www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

కృత్రిమ రక్తం.. ఎవరికైనా వాడొచ్చు..!

అభివృద్ధి చేసిన జపాన్ శాస్త్రవేత్తలు

సాధారణ గది ఉష్ణోగ్రతలో రెండేళ్లపాటు

నిల్వ చేసే చాన్స్.. ఫ్రీజర్‌లో అయితే ఐదేళ్లు!

ఏ, బీ, ఓ.. అన్ని గ్రూపులవారికీ ఎక్కించొచ్చు

ప్రయోగాల్లో సత్ఫలితాలు

2030 నాటికి అందుబాటులోకి..

2



సోమవారం | 9-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 54 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: త్రయోదశి ఉ.9.36 తదుపరి చతుర్దశి, నక్షత్రం: విశాఖ మ.3.31 తదుపరి అనూరాధ, వర్జ్యం: రా.7.56-9.42, దుర్ముహూర్తం: మ.12.40-1.32, మ.3.16-4.08, అమృతఘడియలు: ఉ.6.32-8.18, రాహుకాలం: 7.30-9.00, సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.45 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇంజనీరింగ్‌లో.. | అగ్రి, ఫార్మసీలో..



భానుచరణ్‌రెడ్డి 2వ ర్యాంకు | యశ్వంత్ సాత్విక్ 3వ ర్యాంకు | సాయిహర్షవర్ధన్ మొదటి ర్యాంకు | అకీరానంద 3వ ర్యాంకు

ఈఏపీసెట్‌లో అబ్బాయిల హవా

టాప్-10 ర్యాంకులు వారికే సొంతం

ఇంజనీరింగ్‌లో తెలంగాణ విద్యార్థి, అగ్రికల్చర్, ఫార్మసీలో ఏపీ విద్యార్థి ఫస్ట్

అయినా.. మన సీట్లు మన వారికే

మొత్తంగా 75.67% మందికి అర్హత

ఫలితాలు వెల్లడించిన జేఎన్‌టీయూ కాకినాడ



ఇంజనీరింగ్‌లో 2వ ర్యాంకు సాధించిన భాను చరణ్‌రెడ్డికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు జయభారతిరెడ్డి, సురేఖ

అమరావతి/జేఎన్టీయూకే, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఏపీ ఈఏపీసెట్‌లో అబ్బాయిలు రికార్డు సృష్టించారు. ఇంజనీరింగ్ సహా అగ్రి, ఫార్మసీలో తొలి 10 ర్యాంకులను అబ్బాయిలే దక్కించుకున్నారు. అయితే.. టాప్-10లో అమ్మాయిలు లేకపోయినా.. ఉత్తీర్ణత పరంగా అబ్బాయిలకన్నా వారే కొంత ఎక్కువ సంఖ్యలో అర్హత సాధించడం గమనార్హం. మొత్తంగా ఏపీ ఈఏపీసెట్‌లో 75.67 శాతం విద్యార్థులు అర్హత సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 71.65 శాతం మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 89.8 శాతం మంది అర్హులయ్యారు. ఏపీఈఏపీసెట్-2025 ఫలితాలను జేఎన్‌టీయూ(కాకినాడ) వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ ఆదివారం విడుదల చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో 2,64,840 మంది పరీక్షలు

మిగతా 3వ పేజీలో...

2 ప్రశ్నలకు ఆప్షన్లు మార్చాం: వీసీ

వైసీపీ మార్క్

పొలిటికల్ టెర్రరిజం!

సంఘ విద్రోహులు, నేరస్తులకు అండ

వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా ఇప్పుడు రాష్ట్రంలో రౌడీయిజం లేదు.. అడ్డగోలు దోపిడీ లేదు.. సోషల్ మీడియాలో నీచమైన పోస్టింగ్‌లు కనపడవు.. దారుణమైన బూతులు వినపడవు.. కూటమి ప్రభుత్వం కష్టపడి ఏడాదిలో శాంతిభద్రతలను అదుపులోకి తీసుకొచ్చింది. బడా నేతలు, అధికారులు.. ఎవరైనా సరే చట్టాన్ని అతిక్రమించినవారిపై చర్యలు తీసుకుంటోంది. తప్పు చేయాలంటే భయపడే పరిస్థితులను తీసుకువచ్చింది.



కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం కల్పించడంతో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. రాజధాని అమరావతి పనులు మళ్లీ పట్టాలెక్కాయి. మళ్లీ అభివృద్ధి కనిపిస్తోంది. ఇదంతా ఇష్టం లేని జగన్ రాజకీయ ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్నారు. చట్టప్రకారం పని చేస్తున్న పోలీసులపై తిరగబడాలని పిలుపిస్తున్నారు. రౌడీలకు మద్దతు ఇస్తున్నారు. ప్రతిదీ రాజకీయం చేస్తూ భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారు. కులమతాలను లాగుతున్నారు. రాష్ట్రాన్ని మరో బిహార్, ఉత్తరప్రదేశ్‌లా మార్చాలని చూస్తున్నారు.

- జైలుకు వెళ్లి మరీ జగన్ పరామర్శలు
- రౌడీషీటర్ల కుటుంబాలకు భరోసా
- రాజకీయ రౌడీయిజానికి ప్రోత్సాహం
- పోలీసులపై తిరగబడాలంటూ పిలుపు
- సెల్యూట్ కొట్టిస్తానంటూ వ్యాఖ్యలు
- అదే బాటలో ఆ పార్టీ నేతల వ్యవహారం
- సొంత మీడియాలో విద్వేషాలకు బీజం
- రాజధాని మహిళలపై నీచ వ్యాఖ్యలు
- రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం చెడగొట్టేందుకు జగన్ అండ్ కో కుట్ర
- అమరావతి నిర్మాణం, పెట్టుబడులు అడ్డుకునేలా ఉగ్రవాద రాజకీయం



జగన్ రోత మీడియాలో అమరావతి మహిళలపై దారుణ వ్యాఖ్యలను నిరసిస్తూ నెల్లూరులో జరిగిన ర్యాలీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఓసారి జగన్ ఐదేళ్ల పాలనను గుర్తుచేసుకుంటే.. పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి నాశనం.. మద్యం, ఇసుకలో అడ్డగోలు దోపిడీ.. ప్రకృతి వనరులకు చెర.. విచ్చలవిడిగా గంజాయి, ఎర్రచందనం రవాణా.. అంతులేని అవినీతి, కమీషన్లు, దందాలు, సెటిల్మెంట్లు, దౌర్జన్యాలు, దాడులు, హత్యలు, అత్యాచారాలు.. ఇలా ఎన్నో అరాచకాలు. రాష్ట్రంలో 'స్వేచ్ఛ' అన్నదే

మిగతా 13వ పేజీలో...

మచ్చుకు కొన్ని ఉదాహరణలు


- 'పోలీసులకు ఎదురు తిరగండి. రేపు మనం అధికారంలోకి వచ్చాక వారితోనే సెల్యూట్ చేయిస్తా' - జగన్
- తెనాలిలో కానిస్టేబుల్‌పై దాడి చేసిన రౌడీ షీటర్ల కుటుంబాలకు జగన్ పరామర్శ. రౌడీలు అమాయకులంటూ సర్టిఫికెట్
- జగన్ రోత మీడియా డిబేట్‌లో అమరావతిని 'వేశ్యల రాజధాని' అంటూ మహిళల్ని తీవ్రంగా అవమానించేలా వ్యాఖ్యలు
- నిందితులను కార్లో కూర్చోబెట్టుకుని మాజీ మంత్రి విడదల రజని పోలీసులపైనే చిందులు
- యూనిఫామ్‌లో ఉన్న పోలీసులపై పళ్లు కొరుకుతూ ఏమి చేస్తావ్ అంటూ రెచ్చిపోయిన మాజీ మంత్రి అంబటి

విషం చిమ్మడంలో గట్టు దాటారు

నీచ సంస్కృతికి చెక్ పెడతాం: సీఎం చంద్రబాబు

మన తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు క్షమించరాని నేరం

మహిళల పోరాటాన్ని మనసులో పెట్టుకుని నీచంగా మాట్లాడారు



వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృత కుట్ర

కఠిన చర్యలు తథ్యం: డిప్యూటీ సీఎం పవన్

పోలీసులు చట్ట ప్రకారం ముందుకెళ్తారు

అమరావతిపై దుష్ప్రచారమే ఆ ముఠా ఉద్దేశం





14

ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య

ప్రమాదకర ద్రావణం పోసిన ఆనవాళ్లు

పూర్తిగా కాలిపోయిన ముఖం.. జుత్తు

శరీరంపై కాలిన గుర్తులు.. బొబ్బలు

అనంతలో ఘటన.. మృతదేహం లభ్యం

ముగ్గురు యువకులపై అనుమానం

ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



14

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూత

డెమోక్రాట్లకు నిధులిస్తే తీవ్ర పరిణామాలు

2

మస్క్‌కు అమెరికా అధ్యక్షుడి హెచ్చరిక

ఆయనతో బంధం ముగిసినట్టేనన్న ట్రంప్

టీఎఫ్‌సీసీ అధ్యక్ష పదవికి సునీల్ నారంగ్ రాజీనామా

ఎన్నికై 24 గంటలు గడవకముందే నిర్ణయం

హరిహర వీరమల్లు కోసం థియేటర్లు ఖాళీగా పెట్టుకున్నామన్న టీఎఫ్‌సీసీ సెక్రటరీ శ్రీధర్ వ్యాఖ్యలతో దుమారం

తమ ఇమేజ్‌ను డ్యామేజ్ చేశారంటూ టాలీవుడ్ అగ్ర హీరోల ఆగ్రహం

8

అందుకే రాజీనామా అంటూ ప్రచారం

శుభాకాంక్షలు శుక్లా



'మిషన్ ఆకాశ గంగ'లో భాగంగా రేపే ఐఎస్ఎస్‌కు

బయల్దేరనున్న భారత వాయుసేన పైలట్ శుభాన్షు శుక్లా

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా మరో ముగ్గురితో కలిసి!

ఎల్లుండి రాత్రి పదింటికి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి

రెండు వారాలపాటు అక్కడే ఉండి పలు ప్రయోగాల నిర్వహణ

న్యూఢిల్లీ, జూన్ 8: రోదసి నుంచి భారతదేశం ఎలా కనపడుతోందని అడిగితే.. 'సారే జహాసే అచ్ఛా' అంటూ జవాబిచ్చిన తొలి భారతీయ వ్యోమగామి రాకేష్ శర్మ వారసుడిగా.. ఆయన రోదసిలో విహరించిన నాలుగు దశాబ్దాల తర్వాత.. మరో భారతీయుడు అంతరిక్షంలో విహరించేందుకు సర్వం సిద్ధమైంది! అమెరికాకు చెందిన ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థ 'యాక్సియం స్పేస్' చేపట్టిన యాక్సియం 4 (యాక్స్-4) మిషన్‌లో భాగంగా.. భారత వాయుసేన పైలట్, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా మంగళవారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కి వెళ్లనున్నారు. ఐఎస్ఎస్‌కు వెళ్లే

మిగతా 2వ పేజీలో...

ప్రాంతాలు వేరైనా తెలుగుజాతి ఒక్కటే

దానిని నంబర్ వన్ చేయడమే లక్ష్యం: చంద్రబాబు

మన మంచి పనులతో ప్రజలకు ఫలితాలు అందితే ఎంతో ఆనందం

దత్తాత్రేయ అజాత శత్రువు

లేఖలకు బ్రాండ్ అంబాసిడర్

సాధారణ స్వయంసేవక్ నుంచి ఉన్నత స్థాయికి ఎదిగారు: సీఎం

హైదరాబాద్‌లో దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణకు హాజరు

స్కూలు బీజేపీ.. కాలేజీ టీడీపీ.. ఉద్యోగం రాహుల్ దగ్గర: రేవంత్

డైపర్లు మార్చినట్లు పార్టీలు మారుస్తున్నారు: వెంకయ్య



హైదరాబాద్‌లో హరియాణా గవర్నర్ దత్తాత్రేయ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమంలో దత్తాత్రేయ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య తదితరులు

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రాంతాలు వేరైనా తెలుగుజాతి ఒక్కటే. తెలుగు జాతిని ప్రపంచంలో నంబర్ వన్ చేయడమే నా లక్ష్యం' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అలయ్‌బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ శిల్ప కళా వేదికలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ జీవిత చరిత్ర 'ప్రజల కథే

మిగతా 14వ పేజీలో...

టీచర్ల 'కౌన్సెలింగ్'పై కుదరని ఏకాభిప్రాయం



స్లాట్లవారీగా చేపడతామన్న పాఠశాల విద్యాశాఖ

వెబ్ విధానానికి అంగీకరించని టీచర్ల సంఘాలు

నేడు నిరాహార దీక్షలు.. రేపు విద్యాభవన్ ముట్టడి

అమరావతి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల కౌన్సెలింగ్ విషయంలో పాఠశాల విద్యాశాఖ, ఉపాధ్యాయ సంఘాల మధ్య సఖ్యత కుదరడం లేదు. మాన్యువల్ కౌన్సెలింగ్ కావాలని సంఘాలు పట్టుబడుతుంటే, సమయం లేనందున వెబ్ కౌన్సెలింగ్ ద్వారానే చేపడతామని విద్యాశాఖ చెబుతోంది. ఇదే అంశంపై పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఆదివారం గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన వెబెక్స్‌లో స్లాట్ల వారీగా కౌన్సెలింగ్ చేపడతామని తెలిపారు. అంటే ఒక జిల్లాలో సీనియారిటీ ఆధారంగా తొలుత 500 మందికి ఆప్షన్లు ఇస్తారు. వారు పాఠశాలలను ఎంపిక చేసుకున్న తర్వాత మరో 500 మందికి అవకాశం కల్పిస్తారు. మొదటి జాబితాలో వారు ఎంపిక చేసుకున్న స్థానాలను ఆ తర్వాత వారికి చూపించరని డైరెక్టర్ వివరించారు. అయితే ఈ విధానానికి కూడా ఉపాధ్యాయ సంఘాలు అంగీకరించలేదు. పూర్తిగా మాన్యువల్ విధానంలోనే కౌన్సెలింగ్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో

మిగతా 14వ పేజీలో...



అదానీ మీటర్లపై 24 గంటల్లోగా

నివేదిక ఇవ్వండి

క్షేత్రస్థాయిలో పనితీరును పరిశీలించండి

డిస్కమ్‌లకు మంత్రి గొట్టిపాటి ఆదేశం

బిల్లులు ఎక్కువగా వస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని అంగీకారం

కెపాసిటర్లు మార్చుకోవాలని ఏపీసీపీడీసీఎల్ సలహా

14

నేడు డిస్కమ్‌ల అత్యవసర సమావేశం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

మిర్చి మార్కెట్‌లో డ్రాగన్ ప్రకంపనలు

పురుగుమందు అవశేషాలున్నాయని ఎగుమతులు వెనక్కి

60 కంటైనర్లను తిరస్కరించిన చైనా కస్టమ్స్ శాఖ

రిటర్న్ వస్తే 80 శాతం దిగుమతి సుంకం బాదుడు

లబోదిబోమంటున్న మిర్చి ఎగుమతిదారులు

గుంటూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చి మార్కెట్ నుంచి ఎగుమతి చేసిన మిర్చిని చైనా దేశం తిరస్కరించడం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇక్కడి ఎగుమతి వ్యాపారులు కొద్ది రోజుల క్రితం చైనాకు 60 కంటైనర్లలో మిర్చిని పంపగా, వాటిలో పురుగుమందుల అవశేషాలున్నాయని క్విండాగో కస్టమ్స్ టెక్నికల్ సెంటర్ తిరస్కరించింది. వాటిని వెంటనే భారత్‌కు వెనక్కి తీసుకెళ్లిపోవాలని, లేకుంటే తామే తగలబెట్టేస్తామని హెచ్చరించింది. దీంతో గుంటూరు నుంచి కొంతమంది ఎక్స్‌పోర్టర్లు చైనాలో ఉన్న ఇండియన్ ఎంబసీ, స్పైస్ బోర్డు అధికారులను తీసుకెళ్లి అక్కడి అధికారులతో చర్చలు జరిపారు. అయినప్పటికీ వారు ససేమిరా అనడంతో కంటైనర్లలో ఉన్న 900 టన్నుల మిర్చిని వెనక్కి



మిర్చి లోడింగ్

మిగతా 14వ పేజీలో...

ఎవరికైనా పనికొచ్చే కృత్రిమ రక్తం

అభివృద్ధి చేసిన జపాన్ శాస్త్రవేత్తలు

» ట్రయల్స్‌లో సత్ఫలితాలు.. 2030కి అందుబాటులోకి

టోక్యో, జూన్ 8: రక్త దానం అంటే.. ప్రాణదానం చేయడమే! కానీ స్వచ్ఛందంగా రక్తం ఇచ్చే దాతల కొరత కారణంగా ఏటా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది రోగులు ప్రాణాలు కోల్పోతున్నారు. మరీ ముఖ్యంగా అరుదైన బ్లడ్ గ్రూప్ కలిగిన వారు ఏదైనా ప్రమాదంలో గాయపడ్డా, శస్త్రచికిత్సలు చేయించుకోవాల్సివచ్చినా.. వారి బ్లడ్‌గ్రూప్‌తో సరిపోలే రక్తం దొరక్క కన్నుమూస్తున్నారు!! ఈ క్రమంలోనే.. ఏ గ్రూపువారికైనా ఎక్కించగల కృత్రిమ రక్తాన్ని జపాన్‌లోని నారా మెడికల్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేశారు. సాధారణంగా.. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని 42 రోజుల్లోగా వినియోగించాల్సి ఉంటుంది. ఆ గడువు దాటితే ఆ రక్తం పనికరాదు. కానీ, అందులో ఉన్న హిమోగ్లోబిన్‌ను వాడుకునే వీలుంటుంది. అలా సేకరించే హిమోగ్లోబిన్‌ను లిపిడ్ షెల్స్‌లో ఉంచడం ద్వారా ఏ గ్రూపూ లేని ఎర్ర రక్త కణాలను తయారుచేసే విధానాన్ని వారు రూపొందించారు. ఈ విధానంలో తయారుచేసిన రక్తాన్ని ఎలాంటి పరీక్షా అక్కర్లేకుండా నేరుగా బాధితులకు ఎక్కించవచ్చు. మామూలుగా అయితే.. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని భద్రపరచడానికి ప్రత్యేకమైన ప్రొటోకాల్స్ ఉంటాయి. ఆ రక్తాన్ని 1 నుంచి 6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో నిల్వ ఉంచాలి. కానీ.. ఈ కృత్రిమ రక్తాన్ని సాధారణ గది ఉష్ణోగ్రతలోనే రెండేళ్లపాటు ఏ ఇబ్బందీ లేకుండా నిల్వ ఉంచవచ్చని, అదే ఫ్రిజ్‌లో పెడితే ఏకంగా ఐదేళ్లపాటు నిల్వ చేయొచ్చని దీని రూపకర్తలు చెబుతున్నారు. కాగా.. 2022 నుంచి ఈ రక్తంపై ట్రయల్స్ ప్రారంభించారు. తొలి దశ పరీక్షల్లో భాగంగా 20 నుంచి 50 ఏళ్ల వయసున్న పురుష వలంటీర్లకు ఇంట్రావీనస్ పద్ధతిలో ఈ కృత్రిమ రక్తాన్ని ఎక్కించారు. కొద్దిమొత్తం రక్తంతో ప్రారంభించి.. కొంచెం కొంచెంగా పెంచుకుంటూ 100 మిల్లీలీటర్ల దాకా ఎక్కించారు. వలంటీర్లలో కొద్దిమందికి స్వల్ప దుష్ప్రభావాలు కనిపించాయి తప్ప.. వారి రక్తపోటులో ఎలాంటి తేడా రాలేదని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త సకాయ్ తెలిపారు. ఈ ఏడాది మార్చి నుంచి మలిదశ ట్రయల్స్ మొదలుపెట్టి.. వలంటీర్లకు 100 మిల్లీలీటర్ల నుంచి 400 మిల్లీలీటర్ల దాకా రక్తాన్ని ఎక్కించి చూశారు. అయితే.. రక్తమార్పిడి అనేది కోట్ల మంది ప్రాణాలకు సంబంధించిన అంశం కాబట్టి ఈ ట్రయల్స్‌ను 2030 దాకా కొనసాగించి, కృత్రిమ రక్తం పూర్తిగా సురక్షితం అని నిర్ధారించుకున్నాకే అందరికీ అందుబాటులోకి తెచ్చే ఆలోచనలో ఉన్నారు. మరోవైపు.. జపాన్‌కే చెందిన చువో యూనివర్సిటీ ప్రొఫెసర్ తెరుయుకి కొమత్సు కూడా ఇదే తరహా ప్రయోగాలు చేస్తున్నారు. శరీరంలోని అన్ని కణాలకూ అవసరమైన ఆక్సిజన్‌ను సరఫరా చేసే కృత్రిమ ప్రాణవాయు వాహకాలను తయారుచేసే పనిలో ఆయన ఉన్నారు. అల్బుమిన్‌లో పొదిగిన హిమోగ్లోబిన్‌ను ఉపయోగించి.. రక్తపోటును సమస్థితికి తీసుకొచ్చే అవకాశాలపైన, మెదడులో రక్తస్రావం, పక్షవాతం వంటి సమస్యలకు చికిత్సపైన ఆయన దృష్టి సారించారు.



భారత్-పాక్ మధ్య మధ్యవర్తిత్వానికి సిద్ధం

» ఇరాన్ ప్రకటన.. స్వాగతించిన పొరుగు దేశం

న్యూఢిల్లీ, జూన్ 8: భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తగ్గేలా మధ్యవర్తిత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నట్టు ఇరాన్ ప్రకటించింది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో శనివారం ఫోన్‌లో మాట్లాడిన ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ ఈ విషయాన్ని తెలిపారు. పరస్పరం ఈద్ శుభాకాంక్షలు తెలుపుకొన్న ఇరువురు నేతలు ముస్లిం దేశాల మధ్య ఐకమత్యం ఉండాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. అనంతరం భారత్-పాక్ సంబంధాలపై మాట్లాడారు. 'ఉద్రిక్తతలు తగ్గి ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా ఇస్లామిక్ రాజ్యాల్లో శాంతి నెలకొనాలన్న సిద్ధాంతపర విధానంపై ఇరాన్ దృష్టి కేంద్రీకరించిన'ట్టు పెజెష్కియన్ తెలిపారు. భారత్-పాక్‌ల మధ్య చిరకాల శాంతి నెలకొనేలా జరిగే ఎలాంటి ప్రయత్నాలనైనా ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ స్వాగతిస్తుందని, అందులో భాగంగా రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వ పాత్రను కూడా పోషించగలదని చెప్పారు. పాక్‌లో పర్యటించాలని షరీఫ్ కోరగా అందుకు ఆయన అంగీకరించారు. తర్వాత షరీఫ్ మాట్లాడుతూ భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతల్లో ఇరాన్ అనుసరిస్తున్న వైఖరిని ప్రశంసించారు. భారత్‌తో చర్చలు జరపాలనే తాము కోరుకుంటున్నామని, ఇరాన్ మధ్యవర్తిత్వం వహిస్తే స్వాగతిస్తామని తెలిపారు.

సుఖోయ్ కూల్చాం..ఎస్-400 ధ్వంసం చేశాం!

» ఆగని పాక్ దుష్ప్రచారం.. మార్ఫింగ్ చిత్రాలతో హోరు



న్యూఢిల్లీ, జూన్ 8: మన దేశంలోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో సుఖోయ్-30 ఎంకేఐ విమానంపై పాక్ క్షిపణి దాడి చేసిందా? గుజరాత్‌లోని భుజ్ వైమానిక దళ స్థావరంలో ఎస్-400 క్షిపణి రక్షణ వ్యవస్థను ధ్వంసం చేసిందా?.. ఆపరేషన్ సిందూర్ నిలిచి సుమారు నెల రోజులు అవుతున్నా.. పాకిస్థాన్ ఇంకా ఇలాంటి దుష్ప్రచారాన్ని ఆపలేదు. మార్ఫింగ్ చేసిన చిత్రాలు, ఎప్పటివో పాత ఫొటోల్లో కొంతభాగాన్ని చూపుతూ.. పాక్ దాడుల్లో భారత ఎయిర్‌బేస్‌లకు జరిగిన నష్టమంటూ.. ఆ దేశ మీడియా, సోషల్ మీడియా వేదికగా ప్రచారం హోరెత్తుతోంది. అవన్నీ ఉత్త అబద్ధాలేనని తాజాగా ప్రముఖ విశ్లేషకుడు డామియెన్ సిమన్ ఆధారాలతో సహా తేల్చేశారు. ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో సుఖోయ్ విమానాన్ని, ఎస్-400 వ్యవస్థను, భుజ్ ఎయిర్‌బేస్‌లో మరో ఎస్-400 వ్యవస్థను, నలియా, శ్రీనగర్ ఎయిర్‌బేస్‌లు, జమ్మూ విమానాశ్రయంలో రన్‌వేలను, నిర్మాణాలను ధ్వంసం చేసినట్టు పాక్ మీడియా చూపుతున్న చిత్రాలు మార్ఫింగ్ చేసినవని, కొన్ని పాత ఫొటోలని స్పష్టం చేశారు. గత నెల రోజుల్లో ఆయా ఎయిర్‌బేస్‌లకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించి.. అక్కడ ఎలాంటి నష్టం జరగలేదని వివరించారు.

ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే అణిచేస్తాం: షా



మదురైలోని బీజేపీ కార్యాలయంలో అమిత్‌షాను సత్కరిస్తున్న స్థానిక నేతలు

చెన్నై, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదని, ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే సర్వనాశనమేనని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హెచ్చరించారు. ఆదివారం తమిళనాడులోని మదురైలో జరిగిన బీజేపీ రాష్ట్ర నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో త్రివిధ దళాలు ఉగ్ర స్థావరాలను నాశనం చేశాయన్నారు. పాక్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను మన సైనికులు కూల్చివేశారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు తమిళనాడు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్ర రాజకీయాలపైనా అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాట వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని అన్నారు. అంతకుముందు అమిత్‌షా మదురైలోని సుప్రసిద్ధ మీనాక్షి, సుందరేశ్వరర్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

సామూహిక ఆత్మాహుతి చేసుకుంటాం

» తమ నేత విడుదలకు మైతేయీ యువకుల డిమాండ్

ఇంఫాల్, జూన్ 8: భద్రతా బలగాలు, సీబీఐ అరెస్టు చేసిన అరంబాయ్ టెంగోల్(ఏటీ) నేత కరణ్ సింగ్‌ను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో సామూహికంగా ఆత్మాహుతి చేసుకుంటామంటూ మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో మైతేయీ యువకులు ఆందోళన చేపట్టారు. శనివారం రాత్రి ఇంఫాల్‌లో రోడ్లపై టైర్లను తగులబెట్టి, రాస్తారోకో చేశారు. యువకులు తమ తలలపై పెట్రోల్ చల్లుకుని, ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసే కరణ్‌సింగ్ అదనపు ఎస్పీ మొయిరంగ్‌థమ్ అమిత్ ఇంటిపై దాడి చేసి, అతణ్ని అపహరించిన కేసులో నిందితుడు. ప్రభుత్వం కరణ్ సింగ్‌ను సస్పెండ్ చేయడంతో.. అరంబాయ్ టెంగోల్‌లో చేరారు. కరణ్‌సింగ్‌ను తొలుత భద్రతాబలగాలు అరెస్టు చేయగా.. ఆ తర్వాత సీబీఐ అదుపులోకి తీసుకుంది. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తగా ఇంఫాల్(తూర్పు), ఇంఫాల్(పశ్చిమం), బిష్ణుపూర్, థౌబల్, కాక్చింగ్ జిల్లాల్లో కర్ఫ్యూ విధించింది.

దేశంలో 6 వేలు దాటిన కొవిడ్ కేసులు



న్యూఢిల్లీ , జూన్ 8: దేశంలో కొవిడ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా యాక్టివ్ కొవిడ్ కేసుల సంఖ్య 6వేల మార్కును దాటి 6,133కు చేరుకుంది. గత 48 గంటల్లోనే ఏకంగా 769 కొత్త కేసులు నమోదయ్యాయి. అలాగే గత 24 గంటల్లో 6 మరణాలు సంభవించాయి. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి మరణాల సంఖ్య 65కు చేరుకుంది. ఇక దేశవ్యాప్తంగా చూస్తే కేరళలో కొవిడ్ ప్రభావం ఎక్కువగా ఉంది. కొవిడ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. సంసిద్ధతను పరిశీలించడానికి గాను మాక్ డ్రిల్స్ నిర్వహిస్తోంది. ఆక్సిజన్, ఐసోలేషన్ బెడ్స్, వెంటిలేటర్లు, అవసరమైన ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించింది.

శ్వేతసౌధంలో మస్క్-బెసెంట్ డిష్యూం డిష్యూం

ట్రిలియన్ డాలర్ల ఆదా ఏమైంది?

» మస్క్‌ను నిలదీసిన అమెరికా ట్రెజరీ సెక్రటరీ బెసెంట్.. కోపంతో మస్క్ దాడి

» తిరిగి కొట్టిన బెసెంట్..మస్క్‌కు గాయం

» కొట్లాట వివరాలను వెల్లడించిన ట్రంప్ అనుచరుడు స్టీవ్



వాషింగ్టన్, జూన్ 8: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్; డోజ్ మాజీ అధిపతి ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు పొడచూపిన నేపథ్యంలో శ్వేతసౌధంలో జరిగిన దిగ్భ్రాంతికర ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. టెస్లా సీఈవో ఎలాన్ మస్క్, అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ పరస్పరం కొట్టుకున్న విషయం బయటకొచ్చింది. ఏప్రిల్‌లో అమెరికా అధ్యక్ష కార్యాలయంలో జరిగిన ఓ సమావేశంలో ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. ట్రంప్ అనుచరుడు స్టీవ్ బ్యానన్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు 'వాషింగ్టన్ పోస్ట్' కథనంలో పేర్కొంది. శ్వేతసౌధంలో జరిగిన సమావేశం అనంతరం మస్క్, బెసెంట్ నడుచుకుంటూ వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలిపింది. "నువ్వు ప్రభుత్వానికి ట్రిలియన్ డాలర్లు ఆదా చేస్తానని హామీ ఇచ్చావు. కానీ, ఇంత వరకు చేసిందేమీ లేదు. ఇంతకీ నువ్వేం చేస్తున్నట్లు? అని బెసెంట్.. మస్క్‌ను ప్రశ్నించారు. నువ్వో మోసగాడివి, పూర్తిగా మోసగాడివి అని ఆరోపించారు. ఆగ్రహంతో ఊగిపోయిన మస్క్ ఒక్కసారిగా బెసెంట్‌పైకి దూసుకెళ్లారు. రగ్బీ ఆటగాడిలా తన కుడి భుజంతో బెసెంట్ పక్కటెముకలో గుద్దారు. వెంటనే బెసెంట్ కూడా మస్క్‌ను తిరిగి కొట్టారు. వారిద్దరినీ విడిపించేందుకు అక్కడున్నవారంతా ప్రయత్నించారు. తర్వాత మస్క్‌ను పశ్చిమ మార్గం నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న ట్రంప్.. 'ఇది చాలా దారుణం' అని వ్యాఖ్యానించారు" అని బ్యానన్‌ను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ కథనంలో తెలిపింది. డోజ్ అధిపతిగా రాజీనామా చేసిన తర్వాత ట్రంప్‌తో కలిసి చివరిసారిగా విలేకరుల సమావేశంలో పాల్గొన్న సమయంలో మస్క్ కన్ను వాచి, నల్లగా మారి అయ్యింది. అయితే అది తన కుమారుడి వల్ల అయిన గాయమని మస్క్ పేర్కొనడం గమనార్హం. మస్క్-బెసెంట్ కొట్లాట విషయం బయటపడిన తర్వాత అందరూ అది శ్వేతసౌధంలో బెసెంట్ చేసిన గాయమేనని పేర్కొంటున్నారు.

డెమొక్రాట్లకు నిధులిస్తే చాలా తీవ్ర పరిణామాలు

» మస్క్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, జూన్ 8: ఒకప్పటి తన కీలక మద్దతుదారు, ఎన్నికల్లో ఆర్థికంగా అండదండలు అందించిన ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో సంబంధం ముగిసిందని అంగీకరించారు. తన ప్రత్యర్థులైన డెమొక్రాట్లకు నిధులు అందజేస్తే చాలా తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయనను హెచ్చరించారు. తన ప్రభుత్వం ప్రతిపాదించిన వ్యయ నియంత్రణ బిల్లుకు మద్దతు ఇస్తున్న రిపబ్లికన్లను సవాలు చేసే డెమొక్రాటిక్ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని తెలిపారు. అయితే ఆ పరిణామాలు ఏమిటో ఆయన వివరించలేదు. శనివారం ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఇద్దరు ప్రముఖ నాయకుల మధ్య గత వారం రోజులుగా బహిరంగంగానే విమర్శల యుద్ధం నడుస్తోంది. విద్యుత్తు వాహనాలపై రాయితీలు తగ్గింపు సహా ప్రభుత్వ వ్యయంలో కోత విధిస్తూ ట్రంప్ బిల్లు తీసుకొచ్చారు. 'ఇదొక పెద్ద సుందరమైన చట్టం' అని ట్రంప్ అభివర్ణించారు. మస్క్ మాత్రం ఇది రోత, అసహ్యం కలిగించేదని విమర్శించారు. ట్రంప్ విధానాలు తిరోగమనానికి దారి తీస్తాయని హెచ్చరించారు. ట్రంప్ అభిశంసనకు మద్దతు ఇస్తానంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టి అనంతరం తొలగించారు. దీనిపై ట్రంప్ కూడా ఘాటుగానే స్పందించారు. అధ్యక్ష పదవిని మస్క్ అగౌరవపరుస్తున్నారని విమర్శించారు. ఆ కుబేరునిలో అసంతృప్తి కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. మస్క్ విమర్శల కారణంగా రిపబ్లికన్లలో ఎప్పుడూ లేనంత ఐకమత్యం కనిపిస్తోందని తెలిపారు. మస్క్ వ్యాపారాలపై దర్యాప్తు జరపాలని డిమాండ్లు రాగా, వాటి గురించి ప్రస్తుతం ఆలోచించడం లేదని ట్రంప్ అన్నారు. ప్రముఖ విద్యుత్తు వాహనాల తయారీ సంస్థ అయిన టెస్లా.. మస్క్‌దే కావడం గమనార్హం. విద్యుత్తు వాహనాలకు ఇస్తున్న రాయితీలను ట్రంప్ ఎత్తివేయడంతో అసంతృప్తి చెందిన మస్క్ ప్రభుత్వ పదవికి కూడా రాజీనామా చేశారు.

లోకం తీరు

దేశంలో భారీగా తగ్గిన 'తీవ్ర పేదరికం': ప్రపంచబ్యాంకు



రాహుల్ ఆరోపణలు అర్థరహితం!

మహారాష్ట్ర ఎన్నికలపై నేరుగా లేఖ రాస్తేనే స్పందిస్తాం..వ్యాసాలకు జవాబివ్వం: ఈసీ

న్యూఢిల్లీ, జూన్ 8: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని.. బీజేపీ ఓటమి ఖాయమైన చోట్ల ఈసీ మ్యాచ్‌ఫిక్సింగ్‌కు పాల్పడుతోందని.. త్వరలో బిహార్‌లోనూ అదే జరుగుతుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఓ వ్యాసంలో చేసిన ఆరోపణలకు బదులిచ్చేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) నిరాకరించింది. అవి అర్థంలేని ఆరోపణలుగా కొట్టివేసింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత నేరుగా తమకు లేఖ రాస్తేనే స్పందిస్తామని.. వ్యాసాలకు కాదని ఈసీ వర్గాలు ఆదివారం స్పష్టంచేశాయి. మహారాష్ట్ర ఫలితాలపై కాంగ్రెస్ లేవనెత్తిన అభ్యంతరాలకు గత ఏడాది డిసెంబరు 24నే కమిషన్ అన్ని వాస్తవాలతో జవాబులిచ్చామని.. అవి ఈసీ వెబ్‌సైట్‌లో కూడా ఉన్నాయని తెలిపాయి. తర్వాత అవే ఆరోపణలకు సంబంధించి చర్చించేందుకు గత నెల 15వ తేదీన ఆరు జాతీయ పార్టీలను ఆహ్వానించామని.. వాటిలో ఐదు పార్టీలు మాత్రమే వచ్చాయని.. కాంగ్రెస్ చివరి నిమిషంలో రద్దు చేసుకుందని వెల్లడించాయి. విధాన ప్రక్రియ ప్రకారం ఈసీ సహా ఏ రాజ్యాంగ సంస్థయినా తమకు లేఖ రాస్తేనే స్పందిస్తాయని తెలిపాయి. 'తాను లేవనెత్తిన అంశాలు చాలా తీవ్రమైనవని రాహుల్ చెబుతుంటారు. కానీ లిఖితపూర్వకంగా మాకు పంపకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది' అని పేర్కొన్నాయి. మహారాష్ట్ర పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం జరిగిన ఓటింగ్‌పై సీసీటీవీ ఫుటేజీని ఈసీ బయటపెట్టాలని ఆయన తన వ్యాసంలో డిమాండ్ చేశారని.. ఈసీ మార్గదర్శకాల ప్రకారం.. ఎవరైనా ఎన్నికల పిటిషన్ దాఖలుచేస్తే సంబంధిత హైకోర్టు సదరు సీసీటీవీ ఫుటేజీని స్క్రుటినీ చేయవచ్చని స్పష్టం చేశాయి.

కొలంబియా అధ్యక్ష అభ్యర్థిపై బహిరంగంగా కాల్పులు

పరిస్థితి విషమం.. 15 ఏళ్ల బాలుడి అరెస్టు



బగోటా, జూన్ 8: కొలంబియా అధ్యక్ష పదవికి పోటీ చేస్తారని భావిస్తున్న సెనేటర్ మిగుయెల్ ఉరిబే టర్బే (39)పై శనివారం బహిరంగంగా కాల్పులు జరగడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆయన పరిస్థితి విషమంగానే ఉంది. వచ్చే ఏడాది మే నెలలో జరగనున్న ఎన్నికల్లో ఆయన డెమొక్రాటిక్ సెంటర్ పార్టీ తరఫున అధ్యక్ష పదవికి పోటీ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే బగోటాలోని పార్కు వద్ద ఎన్నికల ప్రచార సభ నిర్వహిస్తుండగా వెనుక నుంచి కొందరు సాయుధులు ఆయనపై కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడి రక్తమోడుతున్న ఆయనను వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. రెండు చోట్ల ఆయనకు తుపాకీ గుళ్లు తగిలినట్టు అటార్నీ జనరల్ కార్యాలయం తెలిపింది. మరికొందరు కూడా గాయపడ్డారని పేర్కొంది. ఘటనా స్థలంలో ఆయుధంతో ఉన్న 15 ఏళ్ల బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి కాలుకు గాయం కావడంతో ప్రస్తుతం చికిత్స అందిస్తున్నామని అధికారులు తెలిపారు. మిగిలిన నిందితుల ఆచూకీ చెబితే బహుమతులు ఇస్తామని ప్రకటించారు. కొలంబియాలో అధికారంలో ఉన్న వామపక్ష ప్రభుత్వం కారణంగానే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆరోపించారు.

మాస్కోపై డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి

» రెండు విమానాశ్రయాల మూసివేత

» 9 డ్రోన్లను కూల్చివేసిన రష్యా

మాస్కో, జూన్ 8: ఉక్రెయిన్ ఆదివారం ఏకంగా రష్యా రాజధాని మాస్కోపైనే డ్రోన్లతో దాడి చేసింది. ఈ కారణంగా నగరంలోని రెండు కీలక విమానాశ్రయాలను మూసివేయాల్సి వచ్చింది. భద్రత దృష్ట్యా వునుకోవో, డొమొడేడోవో విమానాశ్రయాల్లో విమానాలను నిలిపివేసినట్టు రష్యా పౌరవిమానయాన సంస్థ రోసావియత్సియా తెలిపింది. మరోవైపు రాత్రి సమయంలో మాస్కో వైపు దూసుకు వస్తున్న డ్రోన్లలో తొమ్మిదింటిని రష్యా వాయు సేన కూల్చివేసిందని మేయర్ సెర్గెల్ సొబ్యానిన్ తెలిపారు. డ్రోన్ల శిథిలాలు పడే చోటికి అత్యవసర సేవల వాహనాలను పంపించినట్టు చెప్పారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగలేదని చెప్పారు. తులా రీజియన్‌లో ఉన్న అజోట్ రసాయనాల కర్మాగారంపై కూడా ఉక్రెయిన్ డ్రోన్ దాడి చేసింది. ఈ కారణంగా కొద్ది సేపు మంటలు వ్యాపించాయి. ఇద్దరు గాయపడ్డారు. కులుగ రీజియన్‌లో ఏడు ఉక్రెయిన్ డ్రోన్లను ధ్వంసం చేసినట్టు అక్కడి గవర్నర్ తెలిపారు. ఇవన్నీ మాస్కో నగరానికి సమీపంలో ఉన్న రీజియన్లు కావడం గమనార్హం. ఈ దాడులపై ఉక్రెయిన్ ఇంతవరకు ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.


శుభాకాంక్షలు శుక్లా..

(మొదటి పేజీ తరువాయి)

తొలి భారతీయ వ్యోమగామి ఆయనే. అమెరికన్ వ్యోమగామి, నాసాకు చెందిన పెగ్గీ విట్సన్ కమాండర్‌గా ఉండే ఈ మిషన్‌లో.. శుక్లా పైలట్‌గా వ్యవహరిస్తారు. వీరితోపాటు.. పోలండ్‌కు చెందిన స్లావోష్ ఉజ్‌నైన్‌స్కీ, హంగరీకి చెందిన టిబోర్ కాపూ వెళ్లనున్నారు. ఆయా దేశాల నుంచి రోదసిలోకి వెళ్లనున్న తొలి వ్యోమగాములు వారే కావడం విశేషం. 'మిషన్ ఆకాశ గంగ' అనే పేరుతో భారతీయులంతా పిలుచుకుంటున్న ఈ మిషన్.. మన కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం 5.52 గంటలకు ప్రారంభం కానుంది. ఫ్లోరిడాలోని నాసాకు చెందిన కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఈలన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ సీ-213 స్పేస్‌క్రాఫ్ట్‌లో ఆ నలుగురూ ఐఎస్ఎస్‌కు పయనం కానున్నారు. ఫాల్కన్9 రాకెట్ ద్వారా ఆ వ్యోమనౌకను దిగువ భూకక్ష్యలో ప్రవేశపెడతారు. అది భారత కాలమానం ప్రకారం బుధవారం రాత్రి దాదాపు 10 గంటల సమయానికి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి అనుసంధానం (డాక్) అవుతుందని అంచనా. ఈ మిషన్ సమయం 14 రోజులు. అంటే.. రెండువారాలపాటు వారు ఐఎస్ఎస్‌లో ఉండి దాదాపు 60 శాస్త్రీయ ప్రయోగాలు చేపట్టనున్నారు. వాటిలో ఏడు మన భారతదేశ పరిశోధకులు ఎంపిక చేసినవి. అవి.. మైక్రో ఆల్గే (సూక్ష్మ శైవలాల)పై భారరహిత స్థితి ప్రభావం, స్పేస్ రేడియేషన్ ప్రభావాన్ని అంచనా వేసే ప్రయోగం (సూక్ష్మ శైవలాలను అంతరిక్ష ప్రయోగాల్లో ఆక్సిజన్ ఉత్పత్తికి ఉపయోగిస్తారు. అలాగే.. మైక్రో ఆల్గేను పోషకాలు అధికంగా గల ఆహారంగా పరిగణిస్తారు). ఈ సూక్ష్మ శైవలాలు భూమ్మీద ఉన్నప్పటితో పోలిస్తే.. రోదసిలో ఉన్నప్పుడు వాటి ఆర్ఎన్ఏలో, ప్రొటీన్లలో, జీవరసాయన చర్యల్లో జరిగే మార్పులపై అధ్యయనం చేస్తారు. అలాగే.. సూక్ష్మ గురుత్వాకర్షణ స్థితిలో కండరాల పునరుద్ధరణ, రోదసిలో పెసర, మెంతి సాగు తదితర అంశాలపై దృష్టి సారిస్తారు. శుక్లా ఈ ప్రయోగాలన్నింటినీ కేంద్రం ఆధ్వర్యంలో మన భారతీయ శాస్త్రవేత్తలు ప్రత్యేకంగా తయారు చేసిన ఉపకరణాలతోనే చేయనున్నారు.



పెగ్గీ విట్సన్, స్లావోష్, టిబోర్



శుభాన్షు శుక్లా

శుక్లాకు 130 ఏళ్లేమో...

శుభాన్షు శుక్లా 1985లో యూపీలోని లఖ్‌నవూలో జన్మించారు. 2006 జూన్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఫైటర్ వింగ్‌లో చేరారు. ఎస్‌యు-30 ఎంకేఐ, మిగ్ 21, మిగ్ 29, జాగ్వార్, హాక్, డోర్నియర్, ఏఎన్-32 సహా పలు రకాల విమానాలను 2000 గంటలపాటు నడిపి అపార అనుభవాన్ని గడించారు. 2024 నాటికి గ్రూప్‌కెప్టెన్ స్థాయికి చేరుకున్నారు. తన కెరీర్‌లో ఎన్నో అవార్డులు, పతకాలు సాధించిన శుక్లాకు 2019లో ఇస్రో నుంచి పిలుపు వచ్చింది. దరిమిలా ఆయన మాస్కో(రష్యా)లోని యూరీ గగారిన్ కాస్మోనాట్ ట్రైనింగ్ సెంటర్‌లో వ్యోమగామి శిక్షణ పొందారు. ఈ మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లడం వల్ల.. స్పేస్‌ఫ్లైట్ ఆపరేషన్స్, లాంచ్ ప్రోటోకాల్స్ వంటివాటిలో అనుభవం సంపాదించే అవకాశం ఆయనకు లభిస్తుంది. అంతే కాదు.. శిక్షణలో భాగమైన కృత్రిమ భారరహిత స్థితి కాకుండా.. రోదసిలో ఉండే నిజమైన భారరహిత స్థితిని అనుభవిస్తారు. ఇస్రో చేపట్టబోయే గగన్‌యాన్ మిషన్‌లో ఈ అనుభవాలు ఆయనకు ఎంతగానో ఉపకరిస్తాయి. కాగా.. ఈ మిషన్‌లో శుక్లాతోపాటు పాల్గొనబోయే మిగతా వ్యోమగాములు ఆయన్ను ఎంతగానో ప్రశంసించారు. శుక్లాను చాలా తెలివైన వ్యక్తిగా ఈ మిషన్ కమాండర్ పెగ్గీ వాట్సన్ కొనియాడగా.. శుక్లా ఏ పైనా చాలా వేగంగా చేస్తారని, అంత వేగంగా ఎలా చేస్తారో తనకు తెలియదని స్లావోష్ ప్రశంసించారు. ఇక హంగరీ వ్యోమగామి టిబోర్ కాపు అయితే.. "శుక్లాకున్న పరిజ్ఞానం, తెలివి చూస్తుంటే ఆయన వయస్సు 130 ఏళ్లేమో అనిపిస్తుంది" అని కొనియాడారు.

లక్షల మంది వస్తారు.. బందోబస్తు అసాధ్యం!

» ఆర్‌సీబీ సన్మాన సభపై ముందే చెప్పిన డీసీపీ

» కర్ణాటక సిబ్బంది శాఖ కార్యదర్శికి లేఖ

» లేఖ వెలుగులోకి రావడంతో దుమారం

» మృతుల కుటుంబాలకు పరిహారం రూ.25 లక్షలకు పెంచిన సీఎం

బెంగళూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ విజేత ఆర్‌సీబీ జట్టుకు దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారని, ఉన్నఫలంగా సన్మానాలు,సభలు ఏర్పాటు చేస్తే భద్రత కల్పించడం అసాధ్యమని కర్ణాటక పోలీసు అధికారులు రాష్ట్రప్రభుత్వానికి ముందుగానే స్పష్టంచేశారు. అభిమానుల తాకిడిని తట్టుకోవడానికి వారు పలు సూచనలు చేసినా యంత్రాంగం పట్టించుకోలేదని ఆదివారం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఇప్పుడు రాజకీయ దుమారం చెలరేగుతోంది. ఆర్‌సీబీ జట్టుకు లక్షల మంది అభిమానులు ఉన్నారని.. సన్మాన సభ పెడితే అధిక సంఖ్యలో తరలిరావచ్చని.. ఆ పరిస్థితుల్లో బందోబస్తు సాధ్యమయ్యే పనికాదని విధానసౌధ డీసీపీ కరిబసవేగౌడ.. సిబ్బంది-పాలనాసంస్కరణల విభాగం (డీపీఏఆర్) కార్యదర్శి జి.సత్యవతికి ముందుగానే లేఖ రాశారు. 'కార్యక్రమం తప్పనిసరైతే.. విధానసౌధ ప్రవేశానికి ప్రజలకు పాస్‌లను సంపూర్ణంగా నిషేధించాలి. 4వ తేదీ మధ్యాహ్నం విధానసౌధ, వికాససౌధకు సెలవు ప్రకటించాలి. సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి. నిశితంగా తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు బాగా సమయం అవసరం. బయటి నుంచి డ్రోన్లు ప్రయోగించి కాల్పులకు, ఇతరత్రా ఘటనలకు పాల్పడకుండా ముందుగా యాంటీ డ్రోన్ సిస్టమ్ అమర్చాలి. నిబంధనలు కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది' అని లేఖలో స్పష్టంచేశారు. దీనిని డీపీఏఆర్ కార్యదర్శి పట్టించుకోలేదని తెలుస్తోంది. ఎవరి ఒత్తిడితో విధానసౌధ వద్ద సభకు ఆమె అంగీకరించారన్నది చర్చనీయాంశమైంది. మరోవైపు.. ఐపీఎల్ ఫైనల్ జరుగకముందే.. బెంగళూరులో విజయోత్సవాల కోసం అనుమతి కోరుతూ కేఎస్‌సీఏ కబ్బన్‌పార్క్ పోలీసుస్టేషన్‌కు లేఖ రాయడం అనుమానాలకు తావిస్తోంది. కాగా.. తొక్కిసలాటలో చనిపోయిన 11మంది కుటుంబాలకు పరిహారాన్ని రూ.25 లక్షలకు పెంచినట్లు సీఎం సిద్దరామయ్య ప్రకటించారు.

ప్రధాని రాజీనామా చేశారా: సీఎం

స్టేడియం వద్ద తొక్కిసలాటలో తన తప్పు ఏమిటని సీఎం సిద్దరామయ్య ప్రశ్నించారు. మహాకుంభమేళాలో తొక్కిసలాట జరిగిందని, అందుకు ప్రధాని మోదీ రాజీనామా చేశారా అని నిలదీశారు. డీపీఏఆర్ కార్యదర్శికి డీసీపీ రాసిన లేఖ తన వద్దకు రాలేదన్నారు. ఆమె ఏ తప్పూ చేయలేదన్నారు. అయితే డీసీపీ లేఖ వైరల్ కావడంతో సత్యవతిపై వేటు వేస్తారని ప్రచారం జరుగుతోంది.

ఈఏపీసెట్‌లో అబ్బాయిల హవా

(మొదటి పేజీ తరువాయి)

రాశారు. వారిలో 1,89,748(71.65శాతం) మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 75,460 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 67,761(89.8శాతం) మంది అర్హత సాధించారు. ఇంజనీరింగ్‌లో అమ్మాయిలు 73.37 శాతం మంది, అబ్బాయిలు 70.33 శాతం మంది... అగ్రికల్చర్, ఫార్మసీలో అమ్మాయిలు 89.76 శాతం, అబ్బాయిలు 89.92 శాతం అర్హత సాధించారు.

- రెండు విభాగాల్లో టాప్-10లో అందరూ అబ్బాయిలే ఉన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో తెలంగాణకు చెందిన ఎ. అనిరుధ్ రెడ్డి ఫస్ట్ ర్యాంకు సాధించాడు. శ్రీకాళహస్తికి చెందిన ఎం. భానుచరణ్ రెడ్డి, పాలకొల్లుకు చెందిన కె. యశ్వంత్ సాత్విక్ రెండు, మూడు ర్యాంకులు సాధించారు.
- అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో విజయవాడకు చెందిన ఆర్. వెంకటనాగసాయి హర్షవర్ధన్ ప్రథమ ర్యాంకు సాధించాడు.
- తెలంగాణకు చెందిన ఎ. షణ్ముఖ నిషాంత్, కోనసీమకు చెందిన డి. అకీరానంద వినయ్ మల్లేశ్‌కుమార్ రెండు, మూడు ర్యాంకులు సాధించారు.
- మొత్తంగా ఇంజనీరింగ్ టాపర్లలో ఇద్దరు, అగ్రి, ఫార్మసీలో ఇద్దరు చొప్పున తెలంగాణ విద్యార్థులున్నారు.
- ఇతర రాష్ట్రాల కోటాలో ఇంజనీరింగ్‌లో 8,233 మంది, అగ్రి- ఫార్మసీలో 1,162 మంది అర్హత సాధించారు. అయితే ఇతర రాష్ట్రాల వారికి సీట్లు కేటాయించకూడదని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది.
- ఏపీ విద్యార్థులకు సీట్లు ఇవ్వకూడదని తొలుత తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించడంతో, ఏపీ కూడా అదే బాటలో 'మన సీట్లు మనకే' అని ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.



కాకినాడలో ఏపీఈఏపీసెట్ ఫలితాల పాస్‌వర్డ్‌ను విడుదల చేస్తున్న సెట్ చైర్మన్ సీఎస్ఆర్కే ప్రసాద్

ఇంజనీరింగ్ టాపర్లు

1. ఎ. అనిరుధ్‌రెడ్డి(రంగారెడ్డి, తెలంగాణ), 2. ఎం. భాను చరణ్‌రెడ్డి(తిరుపతి), 3. కె. యశ్వంత్ సాత్విక్(పశ్చిమగోదావరి), 4. యు. రామచరణ్ రెడ్డి(నంద్యాల), 5. ఎ. భూపతి నితిన్(అనంతపురం), 6. టి. విక్రమ్ (గుంటూరు), 7. డి. మనిదీప్ రెడ్డి(చిత్తూరు), 8. ఎస్. త్రిశూల్(హన్మకొండ, తెలంగాణ) 9. డి. జ్ఞాన రుత్విక్ సాయి(శ్రీకాకుళం), 10. బి. వెంకటమణి ప్రీతమ్(నెల్లూరు).

రెండు ప్రశ్నలకు ఆప్షన్లు మార్చాం: వీసీ

కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీఈఏపీ సెట్-2025 ఫలితాలను సెట్ చైర్మన్, ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ ఆదివారం సాయంత్రం విడుదల చేశారు. ఏపీ, హైదరాబాద్‌లలో 145 కేంద్రాల్లో మే 19 నుంచి 27వ తేదీ వరకు ఈ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించామన్నారు. ర్యాంకు కార్డులను ఈఏపీ సెట్ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు. ఫలితాలను ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌తో పాటు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 9552300009 ద్వారా కూడా తెలుసుకోవచ్చన్నారు. జువాలజీ, ఫిజిక్స్‌లలో టైపోగ్రాఫికల్ లోపం వల్ల రెండు ప్రశ్నలకు ఆప్షన్స్‌ను మార్పు చేసినట్టు తెలిపారు. రెండు మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని, తదుపరి చర్యలపై కమిటీని ఏర్పాటు చేశామని వివరించారు.

అగ్రికల్చర్, ఫార్మసీ టాపర్లు

1. ఆర్. వెంకటనాగ సాయి హర్షవర్ధన్(కృష్ణా), 2. ఎ. షణ్ముఖ నిషాంత్(రంగారెడ్డి, తెలంగాణ), 3. డి. అకీరానంద వినయ్ మల్లేశ్ కుమార్(కోనసీమ), 4. వై. షణ్ముఖ్(హన్మకొండ, తెలంగాణ), 5. వై. సత్య వెంకట్(పశ్చిమగోదావరి), 6. ఎస్. శ్రీసాయి గోవర్ధన్(కాకినాడ), 7. జి. లక్ష్మీ చరణ్(విశాఖపట్నం), 8. డి. కార్తీక్ రామ్ కిరీటి(తూర్పుగోదావరి), 9. కె. మోహిత్ శ్రీరామ్(తూర్పుగోదావరి), 10. డి. సూర్య చరణ్(కాకినాడ).

లోకల్ ఏరియా	ఇంజనీరింగ్				అగ్రికల్చర్, ఫార్మసీ			
	హాజరు		అర్హత		హాజరు		అర్హత	
	అబ్బాయిలు	అమ్మాయిలు	అబ్బాయిలు	అమ్మాయిలు	అబ్బాయిలు	అమ్మాయిలు	అబ్బాయిలు	అమ్మాయిలు
ఏయూ	93,688	72,916	66,958	53,961	10,073	35,835	9,139	32,342
ఎస్వీయూ	50,103	37,689	33,713	26,883	7,381	20,485	6,541	18,160
ఇతర రాష్ట్రాలు	6,131	4,313	4,765	3,468	448	1,238	417	1,162
మొత్తం	1.49.922	1.14.918	1.05.436	84.312	17.902	57.558	16.097	51.664

చదువుల భానుడు!

ఇంజనీరింగ్‌లో 2వ ర్యాంకు



భానుచరణ్‌రెడ్డి

శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామ్ నగర్‌కాలనీకి చెందిన భానుచరణ్‌రెడ్డి ఈఏపీసెట్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు సాధించాడు. భాను చరణ్‌రెడ్డి తల్లిదండ్రులు జయభారత్‌రెడ్డి, సురేఖలు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఓపెన్ కేటగిరిలో భానుచరణ్‌రెడ్డి 51వ ర్యాంకు సాధించాడు. రెండు రోజుల క్రితం సీఎం చంద్రబాబు విజయవాడలో భానును అభినందించారు. ఆదివారం విడుదలైన ఈఏపీసెట్ ఫలితాల్లో భానుచరణ్‌రెడ్డి రెండో ర్యాంకు సాధించాడు. ఐఐటీ ముంబైలో కంప్యూటర్ సైన్స్ చదవనున్నట్టు భానుచరణ్‌రెడ్డి తెలిపాడు.

వ్యవసాయ కూలీ బిడ్డకు 3వ ర్యాంకు

- ముంబై ఐఐటీ లక్ష్యం: యశ్వంత్



యశ్వంత్

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన వ్యక్తి యశ్వంత్ సాత్విక్ ఇంజనీరింగ్ విభాగంలో మూడోర్యాంకు సాధించి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాడు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచాడు. ఓపెన్ కేటగిరిలో 53వ ర్యాంక్ సాధించాడు. ముంబై ఐఐటీలో చదవాలన్నదే తన లక్ష్యమని యశ్వంత్ చెప్పాడు.

సివిల్స్ సాధించడమే లక్ష్యం

- ఉడగండ్ల రామ్‌చరణ్‌రెడ్డి

ఇంజనీరింగ్‌లో 4వ ర్యాంకు



సివిల్స్ సాధించడమే లక్ష్యమని ఏపీఈఏపీసెట్ ఇంజనీరింగ్ విభాగంలో 4వ ర్యాంకు సాధించిన నంద్యాల జిల్లా అవుకు మండలానికి చెందిన ఉడగండ్ల రామ్‌చరణ్ రెడ్డి చెప్పాడు. ఐఐటీలో టాప్-1, టాప్-2 కాలేజీలైన మద్రాస్, కాన్పూర్‌లో ఐఐటీలో సీఎస్ఈ సీటు వస్తుందని ఆశతో ఉన్నట్టు తెలిపాడు. జేఈఈ మెయిన్స్‌లో 53వ ర్యాంకు, అడ్వాన్స్‌డ్‌లో 170 వ ర్యాంకు సాధించినట్టు పేర్కొన్నాడు. ఈఏపీ సెట్‌లో 4వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందన్నాడు. పేదలకు సేవ చేయాలని ఆశగా ఉన్నట్టు తెలిపాడు. కా గా.. రామ్‌చరణ్‌రెడ్డి తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తల్లి సచివాలయం ఉద్యోగి.

ప్రణాళికతో చదివా!

- ఫార్మసీ టాపర్ హర్షవర్ధన్



ఈఏపీసెట్ ఫార్మసీ విభాగంలో కృష్ణాజిల్లా కానూరుకు చెందిన విద్యార్థి రామాయణం నాగసాయి హర్షవర్ధన్ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. "డాక్టర్ కావాలన్నది నా భవిష్యత్తు ప్రణాళిక. ఇంటర్ ప్రారంభం నుంచి ప్రణాళికాబద్ధంగా చదవడం వల్లే మొదటి ర్యాంకు సాధ్యమైంది. దీనివెనుక నా తల్లిదండ్రులు, అధ్యాపకుల కృషి ఎంతో ఉంది. నన్ను డాక్టర్‌గా చూడాలన్నది వారి కల. దాన్ని నేరువేరుస్తా." అని తెలిపాడు.

కార్డియాలజిస్ట్ కావాలని..!

- ఫార్మసీ 3వ ర్యాంకర్ అకీరానంద



ఏపీ ఈఏపీసెట్ అగ్రికల్చర్, ఫార్మశీ విభాగంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలానికి చెందిన దేగల అకీరానంద వినయ్ మల్లేశ్‌కుమార్ రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. మూడో ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందని, నీట్‌లో ర్యాంక్ సాధించి కార్డియాలజిస్ట్‌గా సేవలందించాలని ఉందని తెలిపాడు. తన విజయానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉందన్నాడు.

నాన్న బాటలో నడుస్తా

- ఫార్మసీ 5వ ర్యాంకర్ సత్యవెంకట్



నాన్న బాటలో తాను కూడా నడుస్తానని ఈఏపీసెట్ ఫార్మసీ విభాగంలో రాష్ట్రస్థాయి 5వ ర్యాంకు సాధించిన సత్యవెంకట్ తెలిపాడు. "నాన్న రామకృష్ణ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ప్రముఖ వైద్యులు. ఆయన నడిచిన దారిలోనే వెళ్లాలన్నది నా కోరిక. చిన్నప్పటి నుంచి ఆ కలతోనే చదివాను. ఇటీవల నీట్ పరీక్షలు రాశాను. ఏపీఈఏపీసెట్‌లో రాష్ట్ర స్థాయిలో అయిదో ర్యాంకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఇదే ఉత్సాహంతో అనుకున్నది సాధిసా." అని చెప్పాడు.

అమరావతిలో అపోలో ఆస్పత్రి!

- ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన అపోలో చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి



అపోలో ఆస్పత్రుల చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అపోలో చైర్మన్ డాక్టర్ ప్రతాప్ చంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ వచ్చిన ఏపీ సీఎంతో ఆదివారం ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీ రాజధాని అమరావతిలో ప్రపంచ స్థాయి ఆస్పత్రిని నిర్మించాలని అపోలో చైర్మన్‌ను చంద్రబాబు కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అమరావతిలో ప్రపంచ స్థాయి సౌకర్యాలతో అపోలో ఆస్పత్రిని నిర్మిస్తామని చంద్రబాబుకు తెలిపారు.

డిప్యూటీ సీఎంను దూషించిన కేసులో నిందితునికి రిమాండ్

నరసరావుపేట లీగల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను దూషించిన కేసులో నిందితుడైన నరసరావుపేట మండలం ములకలూరు గ్రామానికి చెందిన ఇర్ఫాన్‌కు నరసరావుపేట మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆవుల సలోమి రిమాండ్ విధించారు. ఈ నెల 4వ తేదీన తెనాలిలోని రౌడీషీటర్లను పరామర్శించడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వెళ్లిన సందర్భంగా నిందితుడు సోషల్ మీడియాలో పవన్ కల్యాణ్‌ను దూషించిన విషయం విదితమే. ఈ మేరకు జనసేన మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ శుక్రవారం రాత్రి నరసరావుపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శనివారం నిందితుడిని అరెస్టు చేసి ఆదివారం న్యాయాధికారి ఎదుట ప్రవేశ పెట్టగా రిమాండ్ విధించారు.

పాలకొండ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు

- పోలీసుల అదుపులో నిందితుడు

పాలకొండ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా.. పాలకొండ జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణపై ఇన్‌స్టాగ్రామ్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం.. భామిని మండలం సొలికిరి గ్రామానికి చెందిన జామి వెంకటేష్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు పోస్టు చేసిన ఎమ్మెల్యే జయకృష్ణ వీడియోకు అభ్యంతకర కామెంట్ చేశాడు. దీనిపై ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి వజ్రగడ రవికుమార్ ఈ నెల 2న పాలకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఆధారంగా నిందితుడి ఐపీ అడ్రస్, కాల్ డేటా ద్వారా విశాఖపట్నంలోని పెందుర్తి ప్రాంతంలో ఆదివారం అదుపులోకి తీసుకొని పాలకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ప్రైవేట్ స్వయంపాలిత ఇంజనీరింగ్ కళాశాలల్లో అక్రమాలు

- విచారణ జరిపి చర్యలు తీసుకోండి: ఏపీటీపీఐఈఏ

విజయవాడ (గాంధీనగర్), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జేఎన్టీయూకే అనుబంధంగా ఉన్న స్వయంపాలిత ఇంజనీరింగ్ కళాశాలల్లో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీటీపీఐఈఏ) అధ్యక్షుడు ఎంవీ బ్రహ్మానందరెడ్డి మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. గుంటూరులోని యూనివర్సల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (జేఎన్‌టీయూకే అనుబంధ) ప్రిన్సిపాల్ నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం చేస్తూ విద్యతో పాటు.. పరిపాలనా వ్యవస్థను తన చేతుల్లోకి తీసుకుని యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఎంటెక్ (సీఎస్ఈ) రెగ్యులర్ కోర్సును నడుపుతున్నారని ఆరోపించారు. అతనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యాశాఖ, జేఎన్‌టీయూకే అధికారులను కోరారు.

అధికార లాంఛనాలతో సింహాచలం అంత్యక్రియలు



సింహాచలం భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు. చిత్రంలో పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ-2 నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం అంత్యక్రియలు ఆదివారం ఉదయం ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. గాజువాక హైస్కూలు రోడ్డులోని శ్మశానవాటికలో నిర్వహించిన అంత్యక్రియల్లో పెద్ద కుమారుడు శంకరరావు తండ్రి చితికి నిప్పు అంటించారు. ఈ సందర్భంగా పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అంతకు ముందు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాజీ స్పీకర్ యనమల రామకృష్ణుడు, కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, పలువురు ఎమ్మెల్యేలు సింహాచలం పార్థివదేహం వద్ద నివాళులర్పించారు.

నెలాఖరులోగా 'కోకో' మొత్తం కొంటాం

- వాస్తవ రైతుల నుంచే గింజల సేకరణ: ఉద్యానశాఖ

అమరావతి, జూన్8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోకో రైతుల వద్ద ఉన్న ప్రతి గింజ కొనుగోలు చేయనున్నట్లు ఉద్యానవన శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు చెప్పారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన చేస్తూ, వాస్తవ సాగుదారుల నుంచి కోకో దిగుబడులను ఈ నెలాఖరులోపు సేకరించనున్నట్లు తెలిపారు. కిలో రూ.500 చొప్పున రైతుకు ధర చెల్లిస్తే, ప్రభుత్వం రూ.50 చొప్పున కంపెనీలకు రీయింబర్స్‌మెంట్ చేస్తుందని పేర్కొన్నారు. గోదావరి ప్రాంతంలో ఈ ఏడాది 49,264 ఎకరాల్లో రైతులు కోకో పంట సాగు చేయగా, ఎకరానికి సగటున 3 క్వింటాళ్ల చొప్పున 11,780టన్నుల దిగుబడి వచ్చిందని తెలిపారు. రైతులు అమ్ముకోగా, గత నెలాఖరుకు 1,620టన్నుల కోకో గింజలు మిగిలినట్లు గుర్తించామని తెలిపారు. వీటి సేకరణకు ప్రభుత్వం అనుమతించిన మాండలేజ్, డీపీ చాక్లెట్స్, ఇతర కంపెనీలు ఇప్పటి వరకు 761 క్వింటాళ్లు కొనుగోలు చేసినందని వెల్లడించారు. మిగిలిన సరుకును ఈ 30వ తేదీలోగా సేకరించాలని టార్గెట్ పెట్టినట్లు ఆయన తెలిపారు.

నారాయణ జైత్రయాత్ర

అమరావతి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్-2025 ఫలితాలలో తమ విద్యార్థులు సంచలనాలు సృష్టించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌తోపాటు టాప్ 10లో 5 అత్యుత్తమ ర్యాంకులు, 100లోపు 46 ర్యాంకులు, వెయ్యిలోపు 416 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. అనిరుధ్ రెడ్డి 1వ ర్యాంకు, భానుచరణ్‌రెడ్డి 2, ఎ.భూపతి నితిన్ 5, మణిదీప్ రెడ్డి 7, డి.సూర్యచరణ్ 10వ ర్యాంకు సాధించినట్టు తెలిపారు. నారాయణ విద్యాసంస్థల విజయ ప్రస్థానం నిరంతరాయంగా కొనసాగుతోందన్నారు. ర్యాంకర్లను, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలిపారు.

శ్రీచైతన్య విజయభేరి

అమరావతి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్-2025 ఫలితాలలో తమ విద్యార్థులు టాప్ 10లోపు 8 ర్యాంకులు, టాప్ 100లోపు 85 ర్యాంకులు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. ఇంజనీరింగ్ లోనూ, అగ్రి/ఫార్మాలోనూ టాప్ ర్యాంకులు సాధించి ఎప్పటిలాగే రికార్డులు సృష్టించామని పేర్కొన్నారు. అగ్రి/ఫార్మాలో ఎ.షన్ముఖ నిశాంత్ 2వ ర్యాంకు, డి.అకీరానంద వినయ్ మల్లేశ్ కుమార్ 3వ ర్యాంకు, యండ్రపాటి షన్ముఖ్ 4, గిరడ లక్ష్మీ చరణ్ 7వ ర్యాంకు, ఇంజనీరింగ్‌లో యు.రామచరణ్ రెడ్డి 4వ ర్యాంకు, షగంటి త్రిశూల్ 8, డి.జ్ఞాన రుత్విక్ సాయి 9, బి.వెంకట మణి ప్రీతం 10వ ర్యాంకు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి ఆమె అభినందనలు తెలిపారు.

వడ్లమూడి విజ్ఞాన్ ప్రభంజనం



ఉమేష్ నారాయణ, విష్ణుకార్తీక్, ఎస్‌డీ అర్షద్

గుంటూరు(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీసెట్ ఫలితాల్లో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కాలేజీకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని విజ్ఞాన్ జూనియర్ కళాశాలల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ తెలిపారు. కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీకూర్మనాథ్ మాట్లాడుతూ వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలకు చెందిన ఎం.ఉమేష్ నారాయణన్ (347), ఎస్ డీ అర్షద్ (565), వై.విష్ణు కార్తీక్ (613), ఎస్.ప్రేమ్ సాగర్ (635), ఎస్ కే ఎఫ్రోజ్ (736), వి.యశ్వంత్ మణికంఠ (883), ఎం.కవిత (2735), జీ వీ ఏ.తేజస్వి (3008), విద్యా కళ (3415) ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. 1000 లోపు ర్యాంకులు ఆరుగురు విద్యార్థులు, 5000 లోపు ర్యాంకులు 25 మంది విద్యార్థులు, 10000 లోపు ర్యాంకులు 48 మంది విద్యార్థులు సాధించారని చెప్పారు. విజ్ఞాన్ జూనియర్ కళాశాల నుంచి ఏపీఈఏపీసెట్‌కు హాజరైన విద్యార్థులందరూ ర్యాంకులు సాధించారని తెలియజేశారు. ప్రణాళికబద్ధమైన విద్యాబోధన వల్లనే అన్ని పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని వెల్లడించారు. 48 ఏళ్లకుపైగా అనుభవం, అవగాహనతో తాము విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఉత్తమ ర్యాంకులతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్ విద్యాసంస్థల ఉపాధ్యక్షుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు జె.మోహన్‌రావు, వై.వెంకటేశ్వరరావు, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల సిబ్బంది అభినందనలు తెలిపారు.

భాష్యం విద్యార్థుల ప్రతిభ



విక్రమ్ లెవి

గుంటూరు(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీసెట్ ఫలితాల్లో భాష్యం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో తమ విద్యార్థులు టి.విక్రమ్ లెవి 6వ ర్యాంక్, కె.పార్థసారథి 19, ఎ.నోషిక్ సాయి 25, యు.తారిక శ్రీ 28, కె.విక్రాంత్ 32, ఎస్.అబ్దుల్ రహీమ్ 32, సీహెచ్.మణికంఠ 38, ఎస్.వెంకట సాయి చక్రి 42, డి.జస్వంత్ బాలాజి 49, వి.మహేష్ చంద్ర 56, షేక్ వసీమా 60వ ర్యాంకు సాధించారని వెల్లడించారు. అదే విధంగా వి.అన్విత్ చేతన్ 67 ర్యాంకు, కె.యశ్వంత్ 71, డి.సుభాష్ 73, యు.మణికంఠ నాయుడు 74, పి.లక్ష్మీ నారాయణ 82, ఎస్.ప్రేమ్ జడ్సన్ ప్రసన్న 95, జి.సాయి మనోజ్ఞ 98, సీహెచ్.నాగ వెంకట నీరజ్ 99, ఎస్.సుజిత్ 100వ ర్యాంకు సాధించినట్టు తెలిపారు. తమ విద్యార్థులు 100 లోపు 20 స్టేట్ ర్యాంకులతో సత్తాచాటారని రామకృష్ణ చెప్పారు. ఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్ అభినందనలు తెలిపారు.

కాల'మే' మారింది!

124 ఏళ్లలో.. మే నెలలో అత్యధిక వర్షం 126.7 మి.మీ.లు నమోదు

- దీర్ఘకాలిక సగటు కంటే 106 % అధికం
- తగ్గిన ఉష్ణోగ్రతలతో జనానికి ఊరట

విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మే.. అంటే వేసవి.. వేసవి అంటే మే నెల ఠక్కున గుర్తుకొస్తాయి! అయితే.. తీవ్రమైన ఎండలు, వడగాడ్పులతో నిప్పుల కుంపటి వాతావరణం నెలకొనాల్సిన మే నెలలో.. ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈశాన్య భారతంలో పలు రాష్ట్రాల్లో, పడమర తీరంలో ముంబైలో వరదలు ముంచెత్తాయి. ఉత్తరాదిలో ఏడు వెస్ట్రన్ డిస్టర్బెన్స్‌లు ప్రయాణించడం, వారం ముందుగానే నైరుతి రుతుపవనాలు దేశ భూభాగంలోకి ప్రవేశించడంతో మే నెలలో 126.7 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఇది దీర్ఘకాలిక సగటు కంటే 106 శాతం ఎక్కువ. ఈ విధంగా నమోదుకావడం గడచిన 124 సంవత్సరాల్లో (1901 నుంచి) ఇదే ప్రథమమని వాతావరణ శాఖ తెలిపింది. దేశంలో 36 వాతావరణ సబ్‌డివిజన్లకుగాను 25 సబ్‌డివిజన్లలో అత్యంత అధికం నుంచి అధిక వర్షపాతం, ఆరు సబ్ డివిజన్లలో సాధారణ వర్షపాతం నమోదైంది. ఈ మేరకు మే నెలకు సంబంధించి వర్షపాతం, ఉష్ణోగ్రతలపై బులెటిన్ విడుదల చేసింది. 50 ఏళ్ల దీర్ఘకాలిక సగటు ప్రకారం మే నెలలో 61.4 మి.మీ.ల వర్షపాతం నమోదు కావాలి. ప్రాంతాలవారీగా చూస్తే దక్షిణ భారతంలో 199.7 మి.మీలు కురిసింది. ఇది 1901 తరువాత రెండో అత్యధికం. గతంలో 1900వ సంవత్సరంలో 201.4 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. వాయువ్యభారతంలో నమోదైన 48.1 మి.మీ.లు 1901 నుంచి 13వ అత్యధికం. కాగా తూర్పు/ ఈశాన్య భారతంలో 242.8 మి.మీ.ల వర్షం కురిసింది. ఇది 1901 తర్వాత 29వ, 2001 తర్వాత నాలుగో అత్యధికం. మధ్యభారతంలో 100.9 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. మరోవైపు ఈ మే నెలలోనే అండమాన్ నికోబార్, లక్షద్వీప్ సహా దేశలోఽని పశ్చిమ తీర ప్రాంతం, ఈశాన్య రాష్ట్రాలు, విదర్భ, కచ్ ప్రాంతాలు, ఇతర అన్ని రాష్ట్రాల్లో భారీ వర్షపాతం నమోదైంది. ఉత్తరాదిలో ఏడు వెస్ట్రన్ డిస్టర్బెన్స్‌ల ప్రభావంతో ఉత్తర, మధ్యభారతం వరకు తరచూ వర్షాలు, ఈదురు గాలులు, వడగండ్లతో వర్షాలు కురిశాయి. అదే సమయంలో రుతుపవనాలు ముందుగానే కేరళలో ప్రవేశించి పశ్చిమబెంగాల్, ఈశాన్య రాష్ట్రాల వరకు విస్తరించడంతో వర్షాలు ముంచెత్తాయి. మే నెల ప్రారంభం నుంచి దేశంలో అనేక ప్రాంతాల్లో ఉరుములు, పిడుగులతో కూడిన అకాల వర్షాలు కురవడంతో ఉష్ణోగ్రతలు తగ్గాయి. అనేకచోట్ల వడగాడ్పుల ప్రభావం లేదు. అయితే 1991 నుంచి 2020 వరకు 30 ఏళ్ల సగటు ఉష్ణోగ్రతల మేరకు మే నెలలో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 36.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.17 డిగ్రీలుకాగా సగటు ఉష్ణోగ్రత 30.38గా నమోదుకావల్సి ఉంది. కానీ మే నెలలో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 35.08, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.07, సగటు ఉష్ణోగ్రత 29.57 డిగ్రీలు నమోదైంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 1.52, కనిష్ఠ ఉష్ణోగ్రత 0.10, సగటు ఉష్ణోగ్రత 0.81 డిగ్రీలు తక్కువగా నమోదైంది. ఈ నేపథ్యంలో మే నెలలో ప్రజలు ఎండ నుంచి ఉపశమనం పొందారని వాతావరణ నిపుణులు విశ్లేషించారు. ఇంకా వర్షాలతో కృష్ణా బేసిన్‌లో వరద వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

నిప్పుల కుంపటిలా.. కోస్తా

- బాపట్లలో 42 డిగ్రీలు నమోదు
- 11వ తేదీ నుంచి భారీ వర్షాలు!

విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పడమర గాలులతో కోస్తాలో ఎండ తీవ్రతకు వాతావరణం వేడెక్కింది. అనేక ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ కొనసాగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. బాపట్లలో 42, నర్సాపురంలో 41, ఒంగోలు, కావలి, నెల్లూరులో 40, కాకినాడలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, వాతావరణ అనిశ్చితితో రాయలసీమ, కోస్తాలో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. సోమ, మంగళవారాల్లో కోస్తాలో ఎండ తీవ్రత కొనసాగి పగటి ఉష్ణోగ్రతలు కొన్నిచోట్ల 40 నుంచి 42 డిగ్రీలు నమోదవుతాయని, పలుచోట్ల పిడుగులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 11వ తేదీ నుంచి కోస్తా, రాయలసీమలో వర్షాలు పెరిగి, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

బాలికపై అత్యాచారం ఇద్దరి అరెస్టు

భీమునిపట్నం (విశాఖపట్నం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా భీమునిపట్నంలో ఓ బాలికపై యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. విజయనగరం పట్టణానికి చెందిన బాలిక భీమిలిలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ పదో తరగతి వరకు చదువుకుంది. ఈ క్రమంలో బాలికకు.. హేమలత అనే మహిళతో పరిచయమైంది. ఆమె చేపల తిమ్మాపురంలో రాడ్ బెండింగ్ పనులు చేస్తున్న నూకరాజుకు పరిచయం చేసింది. అతను ఉపాధి చూపిస్తానని నమ్మబలికి ఇంటికి తీసుకువెళ్లి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరున జరిగిన ఈ ఘటనపై ఆమె తల్లిదండ్రులు శనివారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను వైద్య పరీక్షలకు కేజీహెచ్‌కు తరలించారు. నూకరాజు, అతడికి సహకరించిన హైమావతిపై పోక్సో నమోదు చేశారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- పంటకుంటలో మునిగి ముగ్గురు బాలురు మృతి



భాను తేజ్, సాయి కిరణ్, సుశాంత్

డుంబ్రిగుడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా ముగ్గురు బాలుర ప్రాణాలను బలిగొంది. గుంటసీమలో ఇటీవల తవ్విన పంటకుంటలో మునిగి మృతిచెందారు. అల్లూరి జిల్లా డుంబ్రిగూడ మండలం పోతంగి పంచాయతీ బిల్లాపుట్టుకు చెందిన గుంట సాయి కిరణ్(14), గుంట భాను తేజ్(14) వరుసకు అన్నదమ్ములు. తొమ్మిదో తరగతి చదువుతున్నారు. తండ్రులు జీసీసీలో రోజువారీ కూలీలు. వేసవి సెలవులు కావడంతో వారం రోజుల క్రితం సాయికిరణ్, భాను తేజ్ గుంటసీమ పంచాయతీ గంగవలసలోని మేనమామ గొల్లోరి భాస్కరరావు ఇంటికి వెళ్లారు. అదే గ్రామానికి చెందిన కొర్రా సుశాంత్(14)తో కలిసి ఆదివారం గుంటసీమ గంగమయ్య గుడి సమీపానికి వెళ్లారు. అక్కడ ఉపాధి హామీ పథకంలో కొత్తగా నిర్మించిన పంటకుంటలో ఈత కొట్టేందుకు దిగారు. బంకమట్టితో ఊబిలా ఉండడంతో అందులో కూరుకుపోయి బయటకు రాలేక మృతి చెందారు. ఈ సంఘటన జరగడానికి అరగంట ముందు సాయి కిరణ్, భాను తేజ్‌ను అక్కడ చూసిన వారి మేనమామ పంటకుంటలో దిగవద్దని హెచ్చరించి ఇంటికి వెళ్లారు. తిరిగి వచ్చే సరికి వాళ్లు కనిపించకపోవడంతో పంటకుంటలో దిగి ఉంటారని అనుమానించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బాలుర తల్లిదండ్రులు వచ్చి ఈతగాళ్లతో వెతికించారు.. దీంతో ముగ్గురు బాలుర మృతదేహాలు బయటపడ్డాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణానదిలో మునిగి ఇద్దరు మృతి



ఖాజా



ఖాదర్

అమరావతి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకాకాని ఏపీఎన్ కాలనీకి చెందిన రెండు కుటుంబాలకు చెందిన పది మంది బక్రీద్ పండుగ జరుపుకొని ఆదివారం సరదాగా గడిపేందుకు అమరావతి వచ్చారు. ఈ క్రమంలో కృష్ణానదిలో దిగిన సయ్యద్ ఖాదర్ వలీ(13), సయ్యద్ ఖాజా(23) మునిగిపోయారు. కుటుం బ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గాలింపు చర్య లు చేపట్టగాసాయంత్రానికి ఇద్దరిమృతదేహాలు లభ్యమయ్యాయి.

దిగులు చూపుల పద్యం



పిల్ల, హాస్టల్ కెళుతోంది
కురవడానికి సిద్ధంగా ఉన్న
మేఘంలా ఉంది నా ముఖం
వాళ్ళ అమ్మ ముఖంలో
తీగల మీద వాలిన
జిట్టపిట్టల్లా కన్నీళ్లు

మా రాత్రులు గుర్తుకొస్తున్నాయ్
మాటలతో పండిన రాత్రులు
అలా వంగి
మా ఇంట్లో వినిపించే కథలు విన్న



చంద్రుడు
కిటీకిలో నుంచి
లోపలికి తొంగి చూసే
మనోరంజ మొక్క

మా ఉదయాలు
జ్ఞప్తికొస్తున్నాయ్

టీ తాగుతున్నప్పుడు
మాతో కలిసి
కిరణాల గుడికట్టిన సూర్యుడు
ఎదురింటి అద్దాల నీడతో అల్లిన బొమ్మ

మా కబుర్లు వింటూ
ఆనందించిన నీడలు
మెరుగుపడ్డ క్షణాలు



ఈ రాత్రికి
మాతో పాటే చంద్రుడికి నిద్ర పట్టదు
కోడిపిల్లల్లా కదిలే చుక్కలు
మా ఇద్దరి మధ్య
ఖాళీలో దిగులు కదులుతోంది

హాస్టల్ కిటీకి లోనుంచి
ఒక జత కళ్ళు బయటకు చూస్తున్నట్టే
ఇంటి
తలుపు తీయడానికి
నాలుగు చేతులు
ఉవిళ్ళూరుతుంటాయి

■ సుంకర గోపాలయ్య
✆ 94926 38547



సోమవారం 9 జూన్ 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

రాజకీయఖైదీల గొంతుకలతో పుస్తకం

'చందమామను ఎంత కాలం బందీ చెయ్యగలరు – భారతీయ రాజకీయ ఖైదీల గొంతుకలు' (రచన: సుచిత్ర విజయన్, ఫ్రాన్సెస్కా రెకియా; అనువాదం: కె. సురేష్) పుస్తకం ఆవిష్కరణ సభ జూన్ 11, సా.5.30గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి ప్రకాష్ రాజ్; సభాధ్యక్షులు యాకూబ్; పుస్తక పరిచయం ఎస్. వేణుగోపాల్; వక్తలు ఘంటా చక్రపాణి, కల్పనా కన్నబిరన్, ఖలీదా పర్వీన్; వందన సమర్పణ మలుపు బాల్‌రెడ్డి.

మలుపు బుక్స్

ఉత్తమ గ్రంథ పురస్కారాలు

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రంథ పురస్కారాల ప్రదానోత్సవం జూన్ 11 సా.5.30గంటలకు తెలంగాణ సారస్వత పరిషత్, తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి గుత్తా సుఖేందర్ రెడ్డి, అధ్యక్షులు ఎల్లూరి శివారెడ్డి, సమన్వయకర్త రింగు రామ్మూర్తి. ఉత్తమ గ్రంథ పురస్కారాలను కాంచనపల్లి గోవర్ధనరాజు, ఉదారి నారాయణ, రామాచంద్రమౌళి, కాలువ మల్లయ్య, సంగిశెట్టి శ్రీనివాస్, సంగనభట్ల నర్సయ్య, అమరవాది నీరజ; వరిష్ఠ పురస్కారాలను రంగరాజు పద్మజ, ఎలనాగ, ఎస్. ఆర్. వెంకటేశం, రూప్ కుమార్ డబ్బీకార్ అందుకుంటారు.

జె. చెన్నయ్య

రెండుతరాల కవిసంగమం

రెండుతరాల కవిసంగమం సీజన్ – 2, సిరీస్ – 41 జూన్ 14 సా.6గంటలకు నిజాం కాలేజి, బషీర్ బాగ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. పాల్గొను కవులు: లక్ష్మీనరసయ్య గుంటూరు, తుల శ్రీనివాస్, రూప రుక్మిణి, జబ్బు వెంకటేష్, చుక్క వంశీ

యాకూబ్

'అల్లిక' కవితా సంపుటి

చల్లపల్లి స్వరూపరాణి కవితా సంపుటి 'అల్లిక' ఆవిష్కరణ సభ జూన్ 15 సా.5గంటలకు బాలోత్సవ్ భవన్, రెండో అంతస్తు, విజయవాడలో జరుగుతుంది. వక్తలు: జి. లక్ష్మీనరసయ్య, శిఖామణి, యాకూబ్, గూడురు సీతామాలక్ష్మి, నూకతోటి రవికుమార్, షేక్ కరీముల్లా, దుప్పల రవికుమార్ తదితరులు పాల్గొంటారు.

బహుజన రచయితల వేదిక

'జీవన సౌరభాలు' పద్య సంపుటి

ఓలేటి ఉమా సరస్వతి పద్య కవితా సంపుటి 'జీవన సౌరభాలు' ఆవిష్కరణ సభ జూన్ 15 సా.5:30 నిమిషాలకు బుక్ ఫెస్టివల్ సొసైటీ మీటింగ్ హాల్, విజయవాడలో జరుగుతుంది. అధ్యక్షత గుత్తికొండ సుబ్బారావు, ఆవిష్కర్త మండలి బుద్ధ ప్రసాద్, పుస్తక సమీక్ష గుమ్మా సాంబశివరావు, గౌరవ అతిథి జి.వి. పూర్ణచందు. వివరాలకు: 9247475975.

చలపాక ప్రకాష్

తెలుగు నేల దాటుతున్న 'కొండపొలం'

మేత దొరకని కాలంలో గొర్రెలను నెలా నెలన్నర పాటు నల్లమల అడవుల్లో మేపటానికి పోయే గొర్ల కాపర్ల జీవితం చుట్టూ అల్లిన నవల 'కొండ పొలం'. సన్నపురెడ్డి వెంకటరామి రెడ్డి రాసిన ఈ నవల 2019 'తానా' నవలల పోటీలో రెండు లక్షల రూపాయల బహుమతిని గెలుచుకుంది. 2021లో క్రిష్ దర్శకత్వంలో సినిమాగా కూడా వచ్చింది. ఇప్పుడు ప్రముఖ అంతర్జాతీయ ప్రచురణ సంస్థ 'Bloomsbury' ఈ నవలకు ఇంగ్లీష్ అనువాదాన్ని జూన్ 3న విడుదల చేసింది. ఈ సందర్భంగా నవలను అనువదించిన **నరసింహ కుమార్**‌తో 'వివిధ' జరిపిన సంభాషణ ఇది:



'కొండపొలం' నవల అనువదించాలీ అని ఎందుకు అనిపించింది?

'కొండ పొలం' నవలకి మొట్ట మొదటి సమీక్ష తెలుగులో కంటే ముందే, నేను ఇంగ్లీష్‌లో ఫేస్‌బుక్‌లో రాశాను. అందులో ఇంత గొప్ప నవల, అందులో వర్ణించబడిన జీవన విధానం, ప్రకృతి పట్ల వెలిబుచ్చిన భారతీయ జీవన దృక్పథం – ఇంకా ఎక్కువమందికి చేరాలంటే, ఆంగ్లంలోకి అనువదిస్తే బాగుంటుంది అని రాశాను. నా సమీక్షకు కృతజ్ఞతలు తెలుపుతూ వెంకటరామి రెడ్డి గారు 'ఆ పని మీరే ఎందుకు చేయకూడదు,' అన్నారు. అలా ఈ అనువాదానికి బీజం పడింది.

మనిషి-ప్రకృతుల మధ్య సంఘర్షణ గురించి ఇతర భాషల్లో చాలా నవలలు వచ్చాయి. హెర్మన్ మెల్విల్ 'మోబి-డిక్', హెమ్మింగ్వే 'ది ఓల్డ్ మాన్ అండ్ ద సీ' లాంటి రచనల్లో మనిషి ప్రకృతితో యుద్ధం చేస్తాడు. ఈ రెండు నవలలు పాశ్చాత్య దృక్కోణానికి archetypes (మూల రూపాల) వంటివి. ఈ భూ ప్రపంచంలో మనిషే ఉత్తమ జీవి, మనిషి తన ఆధిపత్యం కోసం మిగిలిన జీవరాశులను ఎక్స్‌ప్లాయిట్ చేయడంలో ఏ తప్పూ లేదు – అన్న దృక్పథం యిది. 'కొండ పొలం' నవల ఇందుకు విరుద్ధంగా ప్రకృతి పట్ల భారతీయ తత్వ చింతనను పరిచయం చేస్తుంది.

గొల్ల, యానాదుల దృక్కోణంలో చెప్పటంతో కథనానికి, వర్ణనలకు ఒక ప్రామాణికత అబ్బింది. నీటి వెతలు, చందనం దొంగల సమస్య, గ్రామాల్లో కుల రాజకీయాలు, ప్రజలు నమ్మే అవధూతలు, దేవతలు, దేవుళ్ళు, వన్యమృగాలు, రకరకాల చెట్లు, ఔషధ మొక్కలు... ఒక్క మాటలో చెప్పాలంటే, మనకు ఎంతో దగ్గరగా ఉన్నా అస్సలు పరిచయంలేని ఒక జీవన శైలిని మనకు చేరువగా తీసుకువస్తుంది. ఒక కొత్త, మార్మిక లోకం లోకి తీసుకెళ్తుంది. కథానాయకుని అద్భుతమైన క్యారెక్టర్ ఆర్క్ కనబడుతుంది. ఒళ్ళు గగుర్పొడిచే సన్నివేశాలూ ఉన్నాయి. ఇలాంటి వివిధ పార్శ్వాల సార్వత్రిక విలువలు ఉన్న కథ తెలుగులో రావడం మన అదృష్టమైతే, దాన్ని వేరే భాషల్లోకి తీసుకువెళ్లడం మన బాధ్యత అని నేను భావిస్తాను.

స్థానీయ అంశాలు బాగా ఎక్కువ ఉన్న ఈ నవలను అనువదించటంలో ఎదురైన సవాళ్లు ఏమిటి?





ఈ నవల అనువదించటంలో ఎదురైన ముఖ్యమైన సవాలు– నల్లమల పరిసర ప్రాంతాల్లో వాడే జాతీయాలు, పలుకుబడులు, సామెతలు, culture specificity (సాంస్కృతిక విశిష్టత) ఉన్న పేర్లు (ఉదా: ఓబులం, కాశినాయన) లాంటి వాటిని నాన్-తెలుగు పాఠకులకు అర్థమయ్యేలా, కానీ ఆంగ్లంలో కృతకంగా ఉండకుండా, అలాగే కథ, వర్ణన, పాత్రల ఆత్మ (soul)కి భంగం కలగకుండా చూసుకోవడం. బ్రౌన్య నిఘంటువు, సూర్యరాయాంధ్ర నిఘంటువు ఉపయోగపడ్డాయి. నేను కడప జిల్లావాడిని కావడం, నంద్యాల, మహానంది, అహోబిలం, శ్రీశైలం ప్రాంతాలతో అనుబంధం ఉండడం కూడా పనికి వచ్చింది. అవసరమైనప్పుడల్లా, రచయితతో ఫోన్‌లో మాట్లాడగలగడం ఒక పెద్ద ఆసరా. ఆయనతో మాట్లాడినప్పుడల్లా ఒక జీవ శాస్త్ర నిపుణునితో, ఒక తత్వవేత్తతో చర్చించినట్టు ఉండేది.

కొన్ని విషయాల్లో ఆంగ్లంలోకి అనువాదమైన ఇతర పుస్తకాలు గమనించి, ఆ పద్ధతులు (బెస్ట్ ప్రాక్టీసెస్) పాటించడానికి ప్రయత్నించాను. ఉదాహరణకి నల్లమల అడవుల్లో ప్రతి కొండకి, కోనకి, వాగుకి, వంకకి, పచ్చిక బయళ్ళకు, రాళ్ళగుట్టలకు, స్థానికంగా పేర్లు ఉంటాయి. ఆ పేర్లను కొన్ని చోట్ల అలాగే ఉంచడం, కొన్ని చోట్ల ఇంగ్లీషు లోకి అనువదించడం ద్వారా ఆ స్థానిక నామంలో ఉండే కవితాత్మకత పాఠకులకి తెలియబర్చడం చేశాను.

అంతర్జాతీయ పబ్లిషర్ 'బ్లూమ్స్‌బరీ'ని మీ అనువాదంతో ఎలా అప్రోచ్ అయ్యారు?

నేను అనువాదం మొదలు పెట్టినప్పుడే, ఒక ప్రఖ్యాత పబ్లిషర్ అయితేనే ఈ నవల ఎక్కువమంది నాన్-తెలుగు పాఠకులకు చేరుతుంది కాబట్టి, ఆలస్యమైనా సరే ఆ దిశగానే ప్రయత్నం చేయాలని అనుకున్నాను. పబ్లిషింగ్ రంగంలోని ఒక మిత్రుని సలహా మేరకు ప్రపోజల్ తయారు చేసుకుని, ముందుగా ఒక బ్లూమ్స్‌బరీ ఎడిటర్‌ని ఫోన్ ద్వారా సంప్రదించి, తర్వాత నా ప్రపోజల్ పంపాను. కలిసి వచ్చిన విషయం ఏమంటే, బ్లూమ్స్‌బరీ వాళ్ళు భారతీయ భాషల్లో నుంచి మంచి పుస్తకాలు ఎన్నుకుని అనువాదం చేయించాలీ అన్న ఆలోచనలో ఉన్నప్పుడే, కాకతాళీయంగా నేను వారిని సంప్రదించాను. బ్లూమ్స్‌బరీ ఇండియా టీంలో చదివిన అందరికీ ఈ నవల నచ్చింది. కానీ, కాంట్రాక్టు బ్లూమ్స్‌బరీ యుకె సంస్థ చేతుల్లో ఉంటుంది, కాబట్టి అఫిషియల్‌గా నాకూ రెడ్డిగారికి ఆఫర్ ఇవ్వటానికి కొన్ని నెలలు పట్టింది. బ్లూమ్స్‌బరీ సంస్థ తెలుగు నుంచి ప్రచురిస్తున్న మొదటి నవల ఇదే. దీని వలన, ఇదే మార్గంలో మరిన్ని తెలుగు పుస్తకాలు కొత్త పాఠకులని ఏర్పర్చుకుంటాయని నా ఆశ.

ఎడిటింగ్ ప్రాసెస్ ఎలా జరిగింది?

ఫిక్షన్, ముఖ్యంగా నవలలకు ఎడిటింగ్ ప్రాసెస్ చాలా విస్తృతంగా వుంటుంది. బ్లూమ్స్‌బరీ సంస్థలో చీఫ్ ఫిక్షన్ ఎడిటర్ శివప్రియ మొదట మాన్యుస్క్రిప్ట్ మొత్తం చదివి, నోట్స్ పంపారు. ఈ మొదటి దశలో ముఖ్యంగా నవల స్ట్రక్చర్ గురించి చర్చించాం. నేను ఎక్కువ ఫుట్‌నోట్స్ వాడాను. వాటిని తీసేసి కథనంలో భాగంగా ఎలా కూర్చాలో ఎడిటర్ మంచి సలహాలు ఇచ్చారు. తరువాత దశలో, మొదట ఒక ఎడిటర్ మొత్తం నవలని ఎడిట్ చేస్తూ, ఒక్కోసారి రెండు మూడు అధ్యాయాల చొప్పున పంపించడం, నేను ఆ ఎడిట్స్‌ని ఒప్పుకోవడం, లేదా ఒప్పుకోకపోవడం, వాళ్ళు అడిగే ప్రశ్నలకి నా సమాధానాలు, సందేహాలకు క్లారిఫికేషన్స్ – ఇలా కొన్ని నెలలపాటు నడిచింది. ఈ ప్రక్రియ తరువాత ఇంకో ఎడిటర్ లైన్ బై లైన్ ఎడిట్స్ చేయగా, వారితో కలిసి నేను ఫైనలైజ్ చేశాను. శివప్రియ మళ్ళీ చివరిలో ఒకసారి, తానూ, తన టీం మెంబర్‌తో కలిసి ఇంకొక రివ్యూ చేసి, ఇంకొన్ని ప్రశ్నలు అడిగారు. ఒక్కోసారి ఒక్క సామెత వారికి అర్థం అయ్యేలా చెప్పడానికి రెండు ఫోన్ కాల్స్ అవసరం అయ్యేవి. వాళ్ళు అడిగిన ప్రశ్నలు నన్ను మరింత ఆలోచింపజేసి, నవలకి మంచి బిగువు వచ్చింది. ఈ క్రమంలో ముద్రణ ఆలస్యమైనా, పనిలో వారికి ఉన్న నిబద్ధత, ఓపిక, రచయిత పట్ల అనువాదకుల పట్ల వారు చూపించిన గౌరవం – ఇవన్నీ నాకు చాలా ఆనందాన్ని ఇచ్చాయి.

ఎడిటింగ్ ప్రాసెస్‌లో భాగంగా పబ్లిషర్ ఒక ముగ్గురు ప్రముఖ రచయితలకి ఇచ్చి అభిప్రాయం అడిగారు. వారిలో ఒకరు 'గోట్ డేస్' నవలా రచయిత బెన్యామిన్ (ఈ నవల తెలుగులో 'మేక జీవితం'గా అనువాదమైంది). ముగ్గురు రచయితలూ పుస్తకానికి గొప్ప ప్రశంసలు ఇచ్చారు.

మీరు చేయాలనుకుంటున్న ఇతర ప్రాజెక్టులు ఏమిటి?

ప్రస్తుతం సన్నపురెడ్డి గారిదే 'ఒంటరి' నవల అనువాదం మొదలుపెట్టాను. దానితో పాటు, నాకు ఇష్టమైన అమెరికన్ రచయిత, నోబుల్ గ్రహీత సాల్ బెల్లో రాసిన 'Seize the Day' అన్న నవలికని తెలుగులో రాస్తున్నాను. 'బోయ కొట్టములు పండ్రెండు' అన్న ఒక చారిత్రక నవలని అనువదించాలని వుంది. ఇవన్నీ గాక నా సొంత కథల పుస్తకం తేవాలని ఉంది. ■

బాకీ తీర్చుకొంటున్నా!

నాకిది కొత్త అనుభూతి. కొండపొలం నవల మొదట్నించీ కొత్త కొత్త అనుభూతుల్ని అందిస్తూనే వుంది. దృశ్యాల్ని వాక్యాలుగా మార్చి పేజీల్లో పొదిగించి నవలగా తీర్చిన దాన్ని, తిరిగి దృశ్యాలుగా మార్చి సినిమాగా రూపాంతరం చెందించి పాఠకుల్ని ప్రేక్షకులుగా మార్చటం చూశాను. ఇప్పుడు మళ్లీ నేను చూసిన నవలల్లోని గొర్లకాపరుల జీవితాలకు సంబంధించిన దృశ్యాలు ప్రపంచవ్యాప్తం కావడాన్ని చూడబోతున్నాను. 'మోబిడిక్', 'ఓల్డ్ మ్యాన్ అండ్ ద సీ' వంటి నవలల్లో ప్రకృతి మీద పైచేయి సాధించేందుకు మనిషి చేసిన యుద్ధాల్ని చూశాను. సోవియట్ రష్యా సాహిత్యంలో యుద్ధం కలిగించిన విధ్వంసాల నేపథ్యంలో అక్కడి ప్రజల బతుకు పోరాటాల్ని చూశాను. అమెరికన్ సాహిత్యంలోని నీగ్రోల బానిస సంకెళ్ళ చిటపటలు విన్నాను. మంగోలియా భూముల్లో శిరసెత్తిన ఆత్మాభిమానం జగజ్జేతగా జెండా ఎగరేయడం చదివాను. జపాన్ చైనా నేలల జెన్ తాత్విక జీవన విధానాన్ని చూశాను. ఇతర భాషల్లోంచి మన భాషలోకి అనువాదమై ప్రపంచపు నలుమూలల్లోని మట్టి వేదనల్ని మన చెవుల దాకా తెచ్చి వినిపించిన అనువాద సాహిత్యాన్ని చిన్నతనాన్నించి చదువుతూనే వున్నాను. వివిధ ప్రాంతాల్లో పుట్టిన సాహిత్యం నాకెంతో లోకజ్ఞానాన్ని ఇచ్చింది. అక్కడి రచయితల గొంతుకలు నాకు కొత్త చూపునిచ్చాయి. కొత్త ఆలోచనల్ని ఇచ్చాయి. కొత్త నైపుణ్యాలను ఇచ్చాయి. జీవితకాలం పాటు ఆ ప్రాంతాలకూ, ఆ మనుషులకూ బాకీ పడ్డదాన్ని తిరిగి ఇవ్వటంలో భాగంగానే నా 'కొండపొలం' నవల 'Tiger Lessons'గా ఆంగ్లానువాదమై తెలుగు నేలను దాటి ఇతర భాషా ప్రాంతాలకు వెళుతున్నదని నేను భావిస్తున్నాను. ఈ సందర్భంగా అనువాద మిత్రుడు నరసింహ కుమార్‌కూ, బ్లూమ్స్‌బరీ ప్రచురణ కర్తలకూ నా కృతజ్ఞతలు.



■ సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి



పంచుకున్న పుస్తకం

ఒకరు చదివి ఇచ్చిన పుస్తకం

గుళ్ళో ఇచ్చిన ప్రసాదాన్ని మిగిల్చి
ఇష్టమైన వాళ్ళ కోసం ఇంటికి తేవడం లాంటిది
తోకచుక్క రాలిపడుతుంటే
పక్కనున్నవాళ్ళని తట్టి చూపించడం లాంటిది
దూరాలనున్న ప్రేమికులు ఫోన్‌లో కబుర్లాడుకుంటూ
చందమామను ఇప్పుడే చూడమని గుసగుసలాడడం లాంటిది
వాళ్ళు కలిసి గుర్తు చేసుకోవాలనుకునే తీపిజ్ఞాపకం లాంటిది.

ఒకరు చదివి గుర్తులు పెట్టి ఇచ్చిన పుస్తకం,

నీలాంటి ఎవరో నీ కలలోకి రావడం లాంటిది
అనూహ్యంగా ఎవరో నీ గుప్పెట్లో పెట్టి మూసిన
ప్రేమలేఖ లాంటిది
అనుకోని ప్రయాణంలో కలిసి
అదాటున మనసుకు దగ్గరైన స్నేహం లాంటిది
చిట్టి పిట్ట మృదుత్వం నీకు అనుభవమవ్వడానికి
దాని ఈకనొకరు నీ చెంపల మీద రాయడం లాంటిది

ఒకరు చదివి, చదవమని ఇచ్చిన పుస్తకం

జగమంతా తిరిగినా తరిగిపోని
జాబిలి తునక వెలుగు లాంటిది. ఆ అనుభవం,
ఈ లోకంలో సూర్యోదయాలను చూడటానికి
దగ్గరి మిత్రులు కలిసి సముద్రాలకు వెళ్ళడం లాంటిది
ఎగసే ఒక సంతోష కెరటానికి ఎదురెళ్ళి
ఇద్దరు మనుషులు నిలువెల్లా తడిసిపోవడం లాంటిది.

■ మానస చామర్తి
✆ 79754 68091

'తానా – మంచి పుస్తకం: బొమ్మల కథలు' ఫలితాలు

పదేళ్ళ లోపు పిల్లలకు బొమ్మల కథలు ఆహ్వానిస్తూ తానా – మంచి పుస్తకం నిర్వహించిన పోటీలో ఈ రచయితల కథలు ఎంపికయ్యాయి: జె.వి.ఎస్. లక్ష్మి, ముంజులూరి కృష్ణకుమారి, బి. రవితేజ, శాఖమూరి శ్రీనివాస్, జాస్తి శివరామకృష్ణ. ఈ రచయితలు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున పారితోషికం అందుతుంది. పుస్తకాలను జులై 2025 నాటికి ప్రచురిస్తాం.

కె. సురేష్

తెలంగాణ జీవన స్పర్శ 'బాపు'

ఎవరికైనా తల్లిదండ్రులే ఆదర్శం. బిడ్డలకు వారే నిజమైన హీరోలు. హీరోలంటే 'రీల్' జీవితంలోని వారు కాదు, 'రియల్' జీవితంలోని వారు. ఆ తల్లిదండ్రులు లేని రోజొకటి వస్తుందనే విషయం ఊహకు కూడా రాదు. అకస్మాత్తుగా కన్నవారు దూరమైతే ఆ దుఃఖం ఎంత వేదనాభరితమో ఊహించాల్సిందే. గడ్డం సతీష్ పుస్తకం 'బాపు' అలాంటి వేదనాభరిత తలపోత.

గడ్డం సతీష్ తండ్రి రామస్వామి తెలంగాణ పల్లె పేద రైతు. తల్లి అజ్జిరవ్వ (వజ్రమ్మ). 30 గుంటల తరిపొలం, 10 గుంటల శెల్క (పెరడి)లో జీవితమంతా ఆ మట్టితోనే బతికిన పేద రైతు. ఆరుగాలం కష్టించి పనిచేసినా ఆ పూటకు ఎల్లదీసుకోవటమే కనాకష్టంగా జీవితాన్ని గడిపిన కష్టజీవి. ఉన్నొక్క బిడ్డ పెండ్లి కోసం తరిపొలాన్ని, కన్న కొడుకు కాలేజీ ఫీజు కోసం ఇంటి పైకప్పుగా ఉన్న రేకులను అమ్మిన కూలి రైతు. ఆయన జీవితాన్ని చెప్పే క్రమంలో తెలంగాణ జీవన సౌందర్యం ఈ పుస్తకం పేజీల నిండా పరుచుకున్నది.

'బాపు'లో విజువల్ ఫ్రేమ్ లన్నీ రవివర్మ గీసిన అందమైన సహజమైన తెలంగాణ జీవన చిత్రాల వంటివి. ఈ పుస్తకంలో ఉన్న ఇరవై రెండు దృశ్య ఖండికలలో మొదటి మూడు సతీష్ తండ్రి గడ్డం రామస్వామి స్మరణలో రాసినవి కాగా, తర్వాతి ఆరు ఆయనతో ఉన్న ఆవిరవని అనుభవాలు, జ్ఞాపకాలు. సతీష్ రాతలో ఉత్తర తెలంగాణ యాస వన్నెలద్దుకున్నది. తెలంగాణ మట్టి పరిమళం అద్దుకున్న భాష ఎంత అందమైనదో సతీష్ రాసిన ప్రతి వాక్యం లోనూ కనపడుతుంది:

"ఎప్పుడు అడ్లమ్మినా లాగోడి కర్సులు, కైకిలోళ్ల కర్సులు అన్నివోను మిగిలేటియి రెండు వేలో, మూడు వేలో. అవిదెచ్చి అజ్జిరవ్వకిస్తే వాటిని ఓరకు వెట్టేది అమ్మ. ఓరకు వెట్టుడంటే బ్యాంకు లాకర్లనో, అల్మార్లనో గాదు. ఇటుకపెల్లల కిందనో, బియ్యం సంచిల్నో.. సందుగుల్నో దాసివెట్టేది. ఇగ ఇంట్ల పైసలుంటే బాపు చేతులుత్తగుండయి. వాటిని నాల్గయిదు సార్లు లెక్కవేత్తడు. అట్లెందుకు, అన్ని సార్లు లెక్కవెడ్తవే బాపు.. అని నేనోసారి అడిగిన. 'మీ అయ్య ఊకె లెక్కవెడ్తే పైసలు డబులైతయిరా' అని అజ్జిరవ్వ పరాష్కమాడుకుంట ఇల్లూడుస్తున్నది. 'నిజమేనానె బాపు' అని అడిగిన. 'దాని మొకం.. అదట్లనే ఒర్రుతది బిడ్డా. మన జేతుల గిన్నిగనం పైసలెప్పుడుంటయిరా, అడ్ల పైసలొచ్చినప్పుడేనాయె! రెండు మూడ్రోజులైతే ఎక్కడియక్కడ గడ్తం. అట్లా గట్టినంక మనకేం ఉంటయి. ఐదార్నెల్లు కట్టవడ్తె అచ్చిన పైసల్ని నాలుగైదు సార్లనన్న లెక్కవెట్టుకోవద్దారా? కట్టాన్ని కండ్ల నిండా సూసుకోవద్దారా కొడుకా?"
('రేకుల కింద రెక్కలు')

ఆరుగాలం కష్టపడి పంట చేతికొచ్చినంక పెట్టుబడులు, చేసిన అప్పులు పోను ఏమీ మిగలని జీవితాలకు, వడ్లు మార్కెట్‌కు పంపి అమ్మిన తర్వాత వచ్చిన బిల్లు పైసలనే తనివిదీరా లెక్కవెట్టి తుర్తిపడే తెలంగాణ రైతు జీవితాల మురిపాలు, ఆనందాలకు ఇదొక తార్కానం.

తెలంగాణ జన జీవితంలోని కష్టనష్టాలు, కన్నీళ్లు, చిన్న చిన్న ఆనందాలు, పిల్లల మురిపాలు ఒక ఎత్తు అయితే, శ్రమజీవుల జీవనంలోని ప్రజాస్వామికత మరో ఎత్తు. స్త్రీ పురుష సమానత్వం విలువల గురించి సిద్ధాంతాలు, వాద సంవాదాలు ఎన్నో ఉన్నాయి. కానీ, సహజంగానే తెలంగాణ జన జీవితంలో ప్రజాస్వామికత, స్త్రీ పురుష సమానత్వం అడుగడుగునా కనిపిస్తుంది. గడ్డం సతీష్ తండ్రి రామస్వామి, తల్లి అజ్జిరవ్వనే తీసుకుంటే– రామస్వామి పొద్దున ఎగిలివారంగనే (అంటే ఉదయం నాలుగున్నర ఐదు గంటలకు) లేసి పొయ్యి అంటివెడ్తడు. కిరసనాయిల్, ఇంకా ఇతర చెత్తా చెదారం లేకుండనే పొయ్య అంటివెట్టుట్ల అతనికి అతనే సాటి. పొయ్యి అంటివెట్టి ఇంటిల్లి పాదికి ఆ పొయ్యి మీద చాయ వెడ్తడు. ఆ తర్వాత అజ్జిరవ్వ లేసి బాసన్లు తోమి పొయ్యి అల్కి, ఇంటిముంగట వాకిలు ఊడుస్తది. అప్పుడు రామస్వామి బోరింగ్ కాన్నుంచి బిందెల నీళ్లు తెచ్చి వాకిట్ల సల్లుతడు. రామస్వామి నీళ్లు జల్లితే అజ్జిరవ్వ ముగ్గు లేస్తది. అజ్జిరవ్వ బట్టలుతికితే రామస్వామి ఆరేస్తడు. ఏడెనిమిది గంటలకల్ల ఇంత వండి బిడ్డకు ఐడికి సద్దిగట్టి, మిగిలింది గిన్నెల వెట్టుకొని, నెత్తిమీద గంప ఎత్తుకొని బాయికాడికి బయల్దేరుతరు. ముంగట రామస్వామి, ఎనుక అజ్జిరవ్వ. రామస్వామి వాడ్కకల్లు ఇంత తాగి సొలుగుకుంట వచ్చినా అజ్జిరవ్వ పరాష్కం ఆడుకుంటనే మొట్టీలు మొత్తినా, రామస్వామి నవ్వుకుంటనే, "ఇగ సాల్ తియ్యె.. ఎగసెక్కాలు. నేను కొంచెం సొల్గిన కనీ.. కిందవడి ఇజ్జత్ కచ్‌రా చేసుకొని ఎచ్చీర్కం కాలె తియ్యే" అని చెప్పుకుంటడు. ఎన్ని కష్టాలొచ్చినా కలిసి మాట్లాడుకొని ఎల్లదీసుకునే ఉపాయం జేస్తరు. ఆలు మొగలుగా స్త్రీ పురుషుల సహజీవనం ఎంత ప్రజాస్వామికంగా ఉంటదో తెలంగాణ జన జీవితమే తార్కానం.

ఈ ప్రజాస్వామిక జీవనం యాంత్రిక మధ్యతరగతి నగర జీవితాల్లో చూడటం సాధ్యం కాదు. పిల్లలను నాలుగైదేండ్ల నుంచే ప్రత్యేక పడకగదుల్లో బంధించే నవనాగరిక జీవనంలో అమ్మానాన్నల అనురాగ స్పర్శ వారికి అందుతున్నదా? నిజానికి ఇవ్వాళ పిల్లల్లో ఉన్న మానసిక వికారాలకు పునాది ఇక్కడనే ఉన్నదా? ఈ మధ్యన బంధువు పురుడు పోసుకుంటే– పరామర్శ కోసం ఓ హాస్పిటల్‌కు పోయిన. పుట్టిన ఒక రోజు పసికందు ఏడుస్తుంటే, ఆపరేషన్ తర్వాత ఇంకా కదల్లేని స్థితిలో ఉన్న తల్లి దగ్గర పడుకోబెడితేనే పాపకు తల్లి స్పర్శ అందుతుందనీ, అప్పుడే పాప ఏడుపు మానుతుందని నర్సులు చెప్పటం విని కదిలిపోయాను. తల్లి స్పర్శ లేకుండా చేయటమే నాగరికత అయితే, అది అనవసరం. ఈ నేపథ్యంలో గడ్డం సతీష్ రాసిన 'బాపు' తెలంగాణ తల్లి స్పర్శ.

'బాపు' పుస్తకంలో ఉన్న ఇరవై రెండు దృశ్య ఖండికలలో మొదటి మూడు సతీష్ తండ్రి రామస్వామి స్మరణలో రాసినవి కాగా, తర్వాతి ఆరు ఆయనతో ఉన్న ఆవిరవని అనుభవాలు, జ్ఞాపకాలు. సతీష్ రాతలో ఉత్తర తెలంగాణ యాస వన్నెలద్దుకున్నది. తెలంగాణ మట్టి పరిమళం అద్దుకున్న భాష ఎంత అందమైనదో సతీష్ రాసిన ప్రతి వాక్యం లోనూ కనపడుతుంది.





■ ఎస్. మల్లారెడ్డి
✆ 80966 77255





సాంస్కృతిక ప్రదర్శనలను తిలకిస్తున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ



మస్తు మజా..

మంగినపూడి సముద్రతీరంలో పోటెత్తిన జనం

- ముగిసిన మసులా బీచ్ ఫెస్టివల్–2025
- పారాగ్లైడింగ్, స్పీడ్ బోటింగ్, హెలీరైడ్‌లతో సందడి
- అలలపై కనులవిందు చేసిన కెనోయింగ్, కయాకింగ్ క్రీడలు
- ఆకట్టుకున్న బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ, బీచ్ ఫుట్‌బాల్
- నవ్వులు పూయించిన జబర్దస్త్ బృందం
- యువతలో జోష్ నింపిన సినీ గాయకులు

6

మచిలీపట్నంలోని మంగినపూడి తీరానికి ఆదివారం జనం పోటెత్తారు. మసులా బీచ్ ఫెస్టివల్ ఆఖరి రోజు అదిరిపోయింది. పారాగ్లైడింగ్, స్పీడ్ బోటింగ్, హెలీరైడ్‌లతో పర్యాటకులు సందడి చేశారు. సముద్ర స్నానాలతో పులకరించారు. ఎగసి పడుతున్న అలలపై కెనోయింగ్, కయాకింగ్ పోటీలు కనుల విందుగా సాగాయి. బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ, బీచ్ ఫుట్‌బాల్ పోరు హోరాహోరీగా ముగిసింది. నవ్వులు పూయించిన బుల్లి తెర నటులు. సినీ గాయకులు తమ గానంతో అబ్బురపరిచారు. బందరు సంస్కృతీ, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఏర్పాటు చేసిన బీచ్ ఫెస్టివల్ పర్యాటకులకు మస్తు మజాని ఇచ్చింది.

- మచిలీపట్నం టౌన్/ అవనిగడ్డ/కృత్తివెన్ను, ఆంధ్రజ్యోతి



తలుపు తట్టిన రేషన్

ఉమ్మడి కృష్ణాలో ఇంటికే నిత్యావసరాలకు 1,23,358 మంది కార్డుదారుల ఎంపిక

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కార్డుదారుల ఇంటికే రేషన్ తీసుకువెళ్లే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1,23,358 మందిని ఎంపిక చేసింది. ఇప్పటికే జూన్ నెల కోటాను 90 వేల మందికి డోర్ డెలివరీ చేసింది. ఇంటికే రేషన్ అంటే ఇదేనంటూ పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తీరును ప్రశంసిస్తున్నారు.

- లేవలేని, కదలలేని, నడవలేని స్థితిలో ఉన్నవారికి ప్రాధాన్యం
- ఇప్పటికే 90 వేల మందికి డోర్ డెలివరీ విధానంలో నిత్యావసరాల పంపిణీ
- నిజమైన డోర్ డెలివరీ ఇదేనంటున్న లబ్ధిదారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నడవలేని, లేవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటికే రేషన్ బియ్యం అందించే మహత్తర కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 1,23,358 మంది 'ఇంటి వద్దకే రేషన్'కు ఎంపికయ్యారు. వీరిలో ఎన్టీఆర్ జిల్లాలో 57,469 మంది, కృష్ణా జిల్లాలో 65,889 మంది ఉన్నారు. జూన్ నెల కోటాను రేషన్ డిపో డీలర్లు వీరి ఇంటికే బియ్యం, పంచదార, కందిపప్పు తదితర నిత్యావసరాలను తీసుకువెళ్లి మరీ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు కూడా భాగస్వాములవుతున్నారు. మంచం మీద ఉన్న వ్యక్తి బయోమెట్రిక్ తీసుకుని సచివాలయ సిబ్బంది సమక్షంలో ఈ పోస్‌లో నిత్యావసరాల వివరాలు నమోదు చేసి, నిత్యావసరాలను తూకం వేసి ఇస్తున్నారు.



నగరంలో ఓ ఇంట్లో లేవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలి వేలిముద్ర తీసుకుని రేషన్ ఇస్తున్న డీలర్

ఇప్పటికే 90 వేల మందికి అందజేత

ఉమ్మడి కృష్ణాజిల్లాలో దాదాపు 90 వేల మందికి నిత్యావసరాల పంపిణీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా, ఏ.కొండూరు మండలంలో 1,950 కార్డుదారులు, చందర్లపాడులో 3,018 మంది, గంపలగూడెంలో మిగతా 6లో..

నాడు రోడ్డు చివరనే ఎండీయూ వాహనాలు

గత వైసీపీ ప్రభుత్వం డోర్ డెలివరీ అని చెప్పినా ఎండీయూ వాహనాలు ఎప్పుడూ కార్డుదారుల ఇళ్ల వద్దకు వెళ్లలేదు. ఒక రోడ్డులో ఒక చోట ఆపితే ఇళ్ల నుంచి బయటకు వచ్చిన లబ్ధిదారులు ఎండీయూ వాహనం వద్ద పడిగాపులు పడి నిత్యావసరాలను తీసుకునే వారు. దీనికి చెక్ పెడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రస్తుతం రేషన్ డీలర్, సచివాలయ సిబ్బంది నిత్యావసరాలతో లేవలేని, నడవలేని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారి ఇంటికే నేరుగా వెళ్లి అందజేస్తున్నారు.

మళ్లీ నిరాశే!

సీల్డ్ కవర్ తెరిచే తేదీ వాయిదా

- కొండపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు వాయిదాల పరంపర
- చైర్మన్ ఎవరో తేలేది ఎన్నడో!
- కొండపల్లి మున్సిపాలిటీకి రాజకీయ గ్రహణం

ఎన్నిక వాయిదా

కొండపల్లి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సీల్డ్ కవర్ ఓపెన్ చేసే కార్యక్రమం కొన్ని అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు మున్సిపల్ కమిషనర్ బి.రమ్య కీర్తన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో మరో తేదీని మళ్లీ ప్రకటిస్తామని పేర్కొన్నారు.



ఇబ్రహీంపట్నం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీ వశం కావడానికి మరింత సమయం పట్టేలా ఉంది. మెజార్టీ కౌన్సిలర్లతో బలంగా ఉన్న టీడీపీకి చైర్మన్ పీటం లభించడం ఖాయమైనా సీల్డ్ కవర్ రూపంలో అవాంతరం ఎదురవుతూనే ఉంది. చైర్మన్ ఎవరనేది కోర్టు నుంచి వచ్చిన సీల్డ్ కవర్‌లో దాగి ఉంది. అసలు కోర్టు నుంచి వచ్చిన ఆ సీల్డ్ కవర్‌లో ఏముందోనని టీడీపీ, వైసీపీ కౌన్సిలర్, చైర్మన్ అభ్యర్థులుగా నిలబడిన వారు బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నారు. సుమారు 20 రోజుల క్రితం మున్సిపాలిటీకి వచ్చిన హైకోర్టు తీర్పు సీల్డ్ కవర్‌ను పటిష్ఠ పోలీస్ బందోబస్తు మధ్య మైలవరం సబ్ ట్రెజరీ కార్యాలయంలో భద్ర పరిచారు. సోమవారం దాన్ని మిగతా 6లో..

పూర్తి బలంతో టీడీపీ

కొండపల్లి మున్సిపాలిటీని దక్కించుకునేందుకు ఇప్పుడు టీడీపీకి పూర్తి బలం ఉంది. ఒకప్పుడు వైసీపీ ఎమ్మెల్యే అయిన వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఇప్పుడు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. 20 మంది కౌన్సిలర్లతో టీడీపీ పూర్తి మెజార్టీతో ఉంది. టీడీపీ తరఫున అభ్యర్థిగా ఉన్న చెన్నుబోయిన చిట్టిబాబు చైర్మన్ కావడం తథ్యం అని టీడీపీ శ్రేణులంటున్నాయి.

యోగాంధ్ర



హరిత బెర్మ్ పార్కులో పర్యాటక శాఖ, ఆయుష్ శాఖ, వీఎంసీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో యోగాసనాలు ప్రదర్శిస్తున్న యువతులు

'శాతవాహన'లో

సర్కారు భూమంటూ కొత్తవాదన

- కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ లిఖితపూర్వకంగా ఇచ్చిన తర్వాతే కూల్చాం
- న్యాయపరంగా పోరాటం చేస్తాం
- బోయపాటి శ్రీనివాస్ శ్రీకృష్ణ, న్యాయవాది భానుప్రసాద్

విజయవాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : శాతవాహన కళాశాల ప్రాంగణంలో ఇంకా ప్రభుత్వ భూమి ఉందంటూ కొంతమంది కొత్తవాదనను తీసుకొస్తున్నారని బోయపాటి అప్పారావు మనువడు శ్రీనివాస శ్రీకృష్ణ, న్యాయవాది కె.భానుప్రసాద్ అన్నారు. విజయవాడ మొగల్రాజపురంలో వారు మీడియాతో ఆదివారం మాట్లాడారు. శ్రీదుర్గామల్లేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీకి కోనేరు లక్ష్మయ్య మొదటి కార్యదర్శిగా పనిచేశారన్నారు. అప్పారావు, లక్ష్మయ్యల మధ్య స్నేహం ఉండడంతో ల్యాండ్ సీలింగ్ చట్టం అమల్లోకి రావడంతో ఆ భూమిని సొసైటీకి ఇచ్చినట్టు అగ్రిమెంట్ చేశారని చెప్పారు. గుండవరపు ప్రజాపతిరావు కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వేర్వేరుగా రెండు దావాలను రెండు కోర్టుల్లో దాఖలు చేశారన్నారు. వాటిని కోర్టులు డిస్మిస్ చేశాయని, తర్వాత హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. ఈ సొసైటీతో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 2011వ సంవత్సరానికి ముందు వరకు ఆలపాటి ఏనాడూ శాతవాహన ప్రాంగణంలో అడుగుపెట్టలేదని తెలిపారు. సుప్రీంకోర్టులో ఉన్న పిటిషన్లను ఉపసంహరించు మిగతా 6లో..

ఇక అమ్మ సేవ

దుర్గగుడిలో ప్రత్యేకంగా సేవా విభాగం ఏర్పాటు

- రోజుకు 200 మంది సేవకులకు అవకాశం
- సేవలో ఇక సమూల మార్పులు
- అంతరాలయం వద్ద సెక్యూరిటీ స్థానంలో సేవకులకు ఛాన్స్



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): శ్రీవారి సేవ... తిరుమలలో సేవ చేయాలనుకున్న వారికి వేదిక ఇది. దీని తరహాలోనే దుర్గమ్మ సేవకు ఒక ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. శ్రీవారి సేవ మాదిరిగానే శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారి సేవకు సంబంధించి కొత్తగా సేవా విభాగాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. అన్ని విభాగాల మాదిరిగానే ఈ సేవా విభాగం శాశ్వతంగా పనిచేస్తుంది. దీనికి ఒక ఏఈవో, ఒక సూపరింటెండెంట్, ఒక గుమస్తాను కేటాయించారు. ప్రస్తుతం సేవకులకు సంబంధించి ప్రత్యేక విభాగమేమీ లేదు. సేవకుల పేర్లను రిజిస్టర్ చేసుకునే విధులను ఇతర విభాగాల్లో ఉన్న సిబ్బందికి అప్పగించేవారు. ఇక నుంచి ఆ విధంగా కాకుండా అమ్మ సన్నిధిలో సేవ చేయాలనుకున్న వారి కోసం ప్రత్యేకంగా ఒక విభాగం ఏర్పాటు చేయాలని ఇటీవల సీఎం నిర్వహించిన సమావేశాల్లో స్పష్టం చేశారు. దీనితోపాటు ఐవీఆర్ఎస్‌లో భక్తుల నుంచి వ్యక్తమవుతున్న అభిప్రాయాలను క్రోడీకరించి ఈ నిర్ణయం తీసుకున్నారు. అమ్మవారి సేవకు వచ్చిన సేవకులకు వన్‌టౌన్‌లో ఉన్న సీవీరెడ్డి సత్రంలో మిగతా 6లో..

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులను ఇంద్రకీలాద్రి మీదకు తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా బస్సులను దేవస్థానం నడుపుతోంది. రైల్వేస్టేషన్ నుంచి ఒక బస్సు, పీఎన్‌బీఎస్ నుంచి మరో బస్సు, దుర్గాఘాట్ నుంచి ఒక బస్సు ఇంద్రకీలాద్రి పైకి భక్తులను చేర్చుతున్నాయి. దుర్గాఘాట్ వద్ద కృష్ణానదిలో

బస్టాప్‌ల వద్ద

స్నానాలు చేసిన తర్వాత ఇక్కడే భక్తులు బస్సు ఎక్కుతారు. దుర్గాఘాట్‌తో పాటు రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్ వద్ద బస్సు ఎక్కేటప్పుడు భక్తులు ఒకరినొకరు తోసుకుంటూ ఎక్కుతున్నారు. ఈ తోపులాటలో చిన్నపిల్లలు నలిగిపోతున్నారు. ఇక ఈ పరిస్థితికి ఫుల్‌స్టాప్ పెట్టాలని భావించారు. ఈ మూడు పాయింట్లలో సేవకులను నియమిస్తారు. వారు భక్తులను ఒక క్యూలో నిలబెట్టి ఒకరి తర్వాత మరొకరిని బస్సు ఎక్కిస్తారు. దీనివల్ల ఎలాంటి తోపులాటలు ఉండవన్నది అధికారుల భావన.

నిత్యం 200 మందికి అవకాశం

దుర్గగుడితో పాటు దానికి అనుబంధంగా ఉన్న అన్ని ప్రదేశాల్లో సేవకులను ఉపయోగించబోతున్నారు. రోజుకు 200 మంది సేవలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుమలలో శ్రీవారి సేవ చేయడానికి దేశ వ్యాప్తంగా భక్త బృందాలు ఉంటాయి. సేవకు వెళ్లాలనుకున్న భక్తులు అయినా, భజన బృందాలు అయినా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. ఖాళీ ఉన్న తేదీలను చూసుకుని బుక్ చేసుకోవాలి. అక్కడికి వెళ్లిన తర్వాత శ్రీవారి సేవా విభాగం వారికి సేవలు చేయాల్సిన ప్రదేశాలను కేటాయిస్తుంది. దుర్గగుడిలోను ఇక నుంచి ఆ విధంగా చేయబోతున్నారు. అమ్మవారికి సేవ చేయాలనుకున్న వారి రిజిస్ట్రేషన్లను ప్రస్తుతం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో చేస్తున్నారు.

ఈఏపీసెట్‌లో ఉమ్మడి కృష్ణా సత్తా

- ఫార్మసీలో కానూరు విద్యార్థికి రాష్ట్ర ప్రథమ ర్యాంకు
- 400లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు



ఫార్మసీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ హర్షకు స్వీట్ తినిపిస్తూ.. 6

మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్

- విగ్రహావిష్కరణలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



జన సంద్రం





బీచ్ ఫెస్టివల్ విజయవంతం సందర్భంగా ఆనందం వ్యక్తం చేస్తున్న కూటమి నేతలు









- మసులా ఫెస్ట్ -2025 సూపర్ హిట్
- ముగిసిన బీచ్ ఫెస్టివల్.. లక్షల్లో వీక్షకులు
- విశేషంగా ఆకట్టుకున్న సీ కయాకింగ్, బీచ్ కబడ్డీ
- పర్యాటకులను ఓలలాడించిన సినీ, సంగీత విభావరి
- చివరి రోజు ట్రాఫిక్ ఇబ్బందులు

మచిలీపట్నం టౌన్/అవనిగడ్డ, కృత్తివెన్ను జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా మంగినపూడిలో నాలుగురోజుల పాటు సాగిన మసులా బీచ్ ఫెస్టివల్ జిల్లా చరిత్రలోనే అతిపెద్ద పర్యాటక ఈవెంట్‌గా నిలిచింది. బీచ్ ఫెస్టివల్‌ను తిలకించేందుకు కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. అధికారిక లెక్కల ప్రకారం తొలి మూడు రోజుల్లోనే 5 లక్షల మందికిపైగా ఫెస్టివల్‌లో పాల్గొన్నారని అంచనా. చివరి రోజైన ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. బీచ్ ఫెస్టివల్‌కు విశేష ఆదరణ లభించటంతో పర్యాటక శాఖలో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి.

విశేషంగా ఆకట్టుకున్న సీ కయాకింగ్

ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే తొలిసారిగా బీచ్ ఫెస్టివల్‌లో ప్రవేశపెట్టిన సీ కయాకింగ్ పోటీలు వీక్షించేందుకు పర్యాటకులు ఆసక్తి కనబరిచారు. ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో రెండుసార్లు మాత్రమే ఈ పోటీలు నిర్వహించగా, మూడోసారి మంగినపూడి బీచ్‌లో జరిగాయి. ఇప్పటికే జలక్రీడల అకాడమీ ద్వారా కయాకింగ్, కెనోయింగ్, డ్రాగన్ బోట్ రేసింగ్, కయాయిస్ సాలోమ్, కనో షో వంటి క్రీడల్లో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరుస్తుండగా, తొలిసారిగా జలక్రీడలకు మరింత ఊతాన్ని ఇవ్వగలవని భావిస్తున్నారు. జలక్రీడల్లో భాగంగా సబ్ జూనియర్, సీనియర్, మిక్స్‌డ్ మాస్టర్స్ విభాగాల్లో పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు మచిలీపట్నం తరలివచ్చారు. కయాకింగ్ పోటీల్లో 17 రాష్ట్రాల క్రీడాకారులు పోటీ పడగా, రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చి ఫైనల్స్‌కు చేరుకున్నారు. 500 మీటర్ల విభాగంలో 12 మంది ఫైనల్స్‌కు చేరుకోగా, ఇద్దరు ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు ఉన్నారు. 500 మాస్టర్స్ విభాగంలో ముగ్గురు, అండర్-18 విభాగంలో ఏడుగురు రాష్ట్ర క్రీడాకారులు ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఆదివారం జరిగిన పోటీలు ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించాయి. మంగినపూడి బీచ్‌లో సినీ సంగీత విభావరి ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, జబర్దస్త్ టీమ్ హాస్యగుళికలు, సంగీత విభావరి కార్యక్రమాలను పర్యాటకులు ఆస్వాదించారు. నాలుగు రోజులపాటు జరిగిన బీచ్ ఫెస్టివల్‌కు లక్షలాదిగా ప్రజలు తరలివచ్చారు.

ఫెస్టివల్‌కు 10 లక్షల మంది : కలెక్టర్ బాలజీ

మసులా బీచ్ ఫెస్టివల్స్‌కు నాలుగు రోజుల్లో 10 లక్షల మందికి పైగా పర్యాటకులు సందర్శించినట్టు కృష్ణా కలెక్టర్ బాలజీ పేర్కొన్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ, బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతమైనట్టు చెప్పారు. యాత్రికులు, పర్యాటకులను క్షేమంగా ఇంటికి చేర్చేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.



కయాకింగ్ విజేతలకు బహుమతి ప్రదానోత్సవంలో మంత్రి రవీంద్ర తదితరులు



బోట్ రైడింగ్‌లో క్రీడాకారులు

క్రీడాభివృద్ధికి ఏసీఏ కృషి

- ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ స్పోర్ట్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : క్రీడాభివృద్ధికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కృషి చేస్తోందని అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ 72వ వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. అనంతరం ఎంపీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఉమెన్ వరల్డ్ కప్‌లో ఐదు మ్యాచ్‌లు విశాఖపట్నంలో జరుగుతాయని, అక్కడి స్టేడియంలో 45 రోజుల్లో జరిగిన అభివృద్ధిని చూసి బీసీసీఐ, ఐసీసీ ఛైర్మన్ జైషా సంతృప్తి వ్యక్తం చేశారని, ఇకపై మ్యాచ్‌లను కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇటీవల జరిగిన ఐపీఎల్ రెండు మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంలోనే వరల్డ్ కప్ మ్యాచ్‌లతో పాటు ఒక వన్‌డే మ్యాచ్ నిర్వహణకు విశాఖ వేదిక కానుందని చెప్పారు. రాష్ట్రంలోని 25 జిల్లాల్లో క్రికెట్ గ్రౌండ్‌లను నిర్మించడానికి నిర్ణయించామని, మొదట కర్నూలు, నెల్లూరులో నిర్మిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో ఎంతోమంది క్రీడాకారులను తయారుచేయడంతో పాటు వారికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఏసీఏ కృషి చేస్తుందన్నారు. ఇకపై అన్ని జిల్లాల్లోని అసోసియేషన్లు, క్లబ్‌ల ఆధ్వర్యంలో సంవత్సరంలో 200 రోజులు క్రికెట్ పోటీలు జరిగేలా ప్రణాళిక రూపొందించేందుకు ఈ సమావేశం నిర్ణయించిందని తెలిపారు. రాజధాని అమరావతిలోని స్పోర్ట్స్ సిటీలో అన్ని వసతులతో ప్రపంచస్థాయి స్టేడియాన్ని నిర్మించాలనే ఆలోచనతో ఉన్నారని, అందుకు ఏసీఏ అన్నివిధాలా సిద్ధంగా ఉందని, దీనిపై బీసీసీఐ, ఐసీసీతో చర్చించామని, వారు కూడా ఆమోదం తెలిపారన్నారు. ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ మాట్లాడుతూ, ఈ సమావేశంలో ప్రధానంగా స్టేడియాలు, క్రీడాకారుల మౌలిక వసతులపై చర్చించామని, క్రికెట్ అభివృద్ధికి ప్రతి జిల్లా నుంచి పలు సూచనలు చేశారని తెలిపారు. జిల్లాస్థాయిలో నిధులను రెట్టింపు అందించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ట్రెజరర్ దండమూడి శ్రీనివాసరావు, కౌన్సిలర్ దంతు విష్ణుతేజ, ప్రసన్న కుమార్, గీత, క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తీరం.. యోగ తరంగం!

- ప్రతిరోజూ యోగా చేయాలి : జేసీ ఇలక్కియ



విద్యాధరపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కృష్ణమ్మ చెంత హరిత బెర్మ్ పార్కులో 'యోగాంధ్ర'లో పాల్గొనడం ఆనందంగా ఉందని, యోగాను నెల రోజులకే పరిమితం చేయకుండా ప్రజలు ప్రతిరోజూ కొంత సమయాన్ని యోగాసనాలకు కేటాయించి, ఆనందమయ జీవితాన్ని సొంతం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. ఆదివారం హరిత బెర్మ్‌పార్కులో జిల్లా అధికార యంత్రాంగం, పర్యాటక, ఆయుష్, వీఎంసీల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన యోగాంధ్ర ప్రత్యేక కార్యక్రమంలో జేసీ, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర పాల్గొని యోగాసనాలను అభ్యసించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ, ఆహ్లాదకర వాతావరణంలో యోగా సాధనతో కొత్త ఉత్సాహం వచ్చిందన్నారు. యోగాసనాలతో శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యం సొంతమవుతుందని పేర్కొన్నారు. యోగా ఔన్నత్యాన్ని చాటిచెప్పేందుకు సుమారు 2 వేల మందితో నదీముఖ పర్యాటక ప్రాంతమైన బెర్మ్‌పార్కులో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి వార్డు సచివాలయ పరిధిలో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి సచివాలయానికి తొమ్మిది మంది శిక్షకులను ఏర్పాటు చేసి ప్రజలకు యోగాసనాలు నేర్పిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కావూరి చైతన్య, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఎస్ఎస్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ కొల్లేటి రమేష్, ఆయుష్ అధికారులు డాక్టర్ వి.రాణి, డాక్టర్ రమత్లేహి, డాక్టర్ రత్నప్రియదర్శిని, యోగా గురు రామాంజనేయులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్‌లో ఉమ్మడి కృష్ణా సత్తా

- ఫార్మసీలో కానూరు విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్

విజయవాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఈఏపీసెట్ ఫలితాల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. 500లోపు ర్యాంకులు సాధించి నిర్దేశించుకున్న లక్ష్యాల వైపు అడుగులు వేయడానికి సిద్ధమవుతున్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరు గ్రామానికి చెందిన రామాయణం వెంకట నాగసాయి హర్షవర్ధన్ ఫార్మసీలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. ఇంజనీరింగ్‌కు కృష్ణాజిల్లా నుంచి మొత్తం 5068 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 4890 మంది ప్రవేశ పరీక్ష రాశారు. వారిలో 3395 మంది ర్యాంకులు సాధించారు.

ఎన్టీఆర్ జిల్లా నుంచి 37,749 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 35,325 మంది పరీక్ష రాశారు. వారిలో 25,943 మంది ర్యాంకులు సాధించారు. కృష్ణాజిల్లా నుంచి అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశపరీక్షకు 1159 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 1094 మంది పరీక్ష రాశారు. వారిలో 984 మందికి ర్యాంకులు వచ్చాయి. ఎన్టీఆర్ జిల్లా నుంచి 6802 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 6208 మంది పరీక్ష రాశారు. వారిలో 5701 మంది ర్యాంకులు సాధించారు.

ఎంఐటీలో చదవాలన్నదే లక్ష్యం

- వడ్లమూడి లోకేష్ (50)



అమెరికాలోని ప్రముఖ ఎంఐటీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చేయాలన్నది లక్ష్యం. ఇందులో సీటుకోసం ప్రయత్నం చేస్తున్నాను. తెలంగాణ ఎంసెట్‌లోనూ 50వ ర్యాంకు వచ్చింది. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో పదో ర్యాంకు వచ్చింది. ముంబై ఐఐటీలో సీటుకు హామీ ఇచ్చింది. నాన్న వెంకయ్య ఓ స్వచ్ఛంద సేవా సంస్థలో పనిచేస్తున్నారు. అమ్మ ఇంటి వద్దే ఉంటారు. అన్నయ్య బెంగళూరు ట్రిపుల్ ఐటీలో ఐదో సంవత్సరం చదువుతున్నాడు.

కంప్యూటర్స్ లేదా ఎలక్ట్రానిక్స్ చేస్తా..

- ఆరుమూరు రామ్ వరప్రసాద్(328)



ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ లేదా ఎలక్ట్రానిక్స్ చేయాలన్నది లక్ష్యం. 328వ ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది. మా నాన్న గురుమోహన్ ప్రసాద్ హౌసింగ్ బోర్డులో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఖరగ్‌పూర్‌లోని ట్రిపుల్ ఐటీలో ఎలక్ట్రానిక్స్ చేయాలనుకుంటున్నా. అది సాధ్యం కాకపోతే గాంధీనగర్‌లోని ట్రిటుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవాలనుకుంటున్నా.

ఇంజనీర్‌గా దేశానికి సేవలందిస్తా..

- కనికిచర్ల జశ్వంత్ వెంకట రఘువీర్ (29)



తాతగారిని ఆదర్శంగా తీసుకుని దేశానికి సేవలందించాలనే లక్ష్యంతో ఇంజనీరింగ్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా. ప్రణాళికాబద్ధంగా చదవడం వల్ల 29వ ర్యాంక్ సాధించా. నాన్నగారు చిన్నపాటి వ్యాపారం చేస్తుంటారు. అన్న కాంచిపురం ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. తాతగారు వాతావరణ సైంటిస్ట్. అదే తరహాలో ఇంజనీరింగ్ పూర్తిచేసి భవిష్యత్‌లో దేశానికి సేవలందించాలని ఉంది. జిల్లాలో టాపర్‌గా నిలుస్తానని ఊహించలేదు. కంప్యూటర్ సైన్స్ చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్న పట్టుదల ఉంది. తల్లిదండ్రులు, తాతయ్య ప్రోత్సాహం టాపర్‌గా నిలిపాయి.

తాతయ్య స్ఫూర్తితో..

- కాకర్ల నిఖిత, మొగల్రాజపురం (154)



నా ఉన్నతికి తాతయ్య స్ఫూర్తే కారణం. తల్లిదండ్రులు ఇద్దరూ వైద్యులు. తాతయ్య వీటీపీఎస్‌లో చీఫ్ ఇంజనీర్‌గా రిటైరయ్యారు. నాపై తాతయ్య ప్రభావం ఉంది. సమాజంలో సేవచేసే అత్యుత్తమ అవకాశం డాక్టర్లకు ఉంటుందని ఆయన ఎప్పుడూ చెబుతుండేవారు. నేనూ మెడిసిన్ చేయాలని నిర్ణయించుకున్నాను.

సివిల్స్ లక్ష్యం

- బుక్కసముద్రం గౌతం రెడ్డి, (315)



మా స్వస్థలం కడప జిల్లా. రైతు కుటుంబం. నా చదువుకోసం అమ్మనాన్న విజయవాడలో ఉంటున్నారు. నాన్న పొలానికి వెళ్లి పనులు చేసి వస్తుంటారు. సివిల్స్ నా లక్ష్యం. ముందుగా ఐఐటీలో సీటు సాధించిన తర్వాత సివిల్స్‌కు వెళ్తా. పేదలకు, సమాజానికి సేవ చేయాలని ఉంది.

సాఫ్ట్‌వేర్ డెవలపర్ కావాలన్నది కల

- పబ్బతి చంద్రేష్, (79)



ఛాలెంజింగ్ సబ్జెక్ట్ అంటే ఇష్టం. సాఫ్ట్‌వేర్ డెవలపర్ కావాలన్నది నా కల. దీనికోసం పది నుంచి కష్టపడుతున్నాను. పదిలో 586 మార్కులు, ఇంటర్‌లో 978 మార్కులు సాధించాను. జేఈఈ అడ్వాన్స్‌లో 1076 ర్యాంకు సాధించాను. ఇప్పుడు ఈఏపీసెట్‌లో 79వ ర్యాంకు వచ్చింది. రోజుకు 14 గంటలు కష్టపడేవాడిని. కంప్యూటర్ సైన్స్ కోర్సు తీసుకోవాలన్నది నా కల.

సాఫ్ట్‌వేర్ డెవలపర్ కావాలన్నది లక్ష్యం..

- సూదుల తేజ యశ్వంత్(228)



ఈఏపీసెట్‌లో నాకు 228 ర్యాంకు వచ్చింది. తెలంగాణాలో 29వ ర్యాంకు వచ్చింది. జేఈఈ అడ్వాన్స్‌లో నాకు 308వ ర్యాంకు వచ్చింది. బాంబే ఐఐటీలో చదవాలన్నది నా కల. అది నెరవేరుతున్నందుకు గర్వంగా ఉంది. కంప్యూటర్స్ సైన్స్ చదివి సాఫ్ట్‌వేర్ డెవలపర్ కావాలన్నది నా లక్ష్యం.

మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ : మందకృష్ణ మాదిగ



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంద కృష్ణ మాదిగ, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

రాణిగారితోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : దేశానికి సుదీర్ఘ సేవలందించిన మహనీయుల్లో మొదటి వరసలో ఉండే వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. రాణిగారితోట 17వ డివిజన్ ఫీడర్ రోడ్డులో ఆదివారం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో మందా కృష్ణ మాదిగతో పాటు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ విగ్రహం పక్కనే మరో మహనీయుడు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని కూడా ఏర్పాటుచేయడం గొప్ప విషయమన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని కులవ్యవస్థ మనదేశంలో ఉందని, దానివల్ల ఏ కులంలో పుట్టి సేవ చేసినా ఆ వ్యక్తిని అన్ని కులాల వారు గౌరవించుకునే సంప్రదాయం ఇంకా రాలేదని, ఇది దురదృష్టకరమన్నారు. దేశంలో కుల వ్యవస్థ లేకపోతే మాజీ ఉప ప్రధానమంత్రి జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను సమాజం గుర్తించేదన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఆధునిక భారతదేశ నిర్మాణంలో స్ఫూర్తివంతమైన సేవలను జగ్జీవన్‌రామ్ అందించారన్నారు. బడుగు బలహీన వర్గాలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

తలుపు తట్టిన రేషన్

(5వ పేజీ తరువాయి)

3,060 మంది, జీ.కొండూరులో 2,278 మంది, ఇబ్రహీంపట్నంలో 2,171 మంది, జగ్గయ్యపేటలో 3,175 మంది, కంచికచర్లలో 2,689 మంది, మైలవరంలో 2,651 మంది, నందిగామలో 3,218, పెనుగంచిప్రోలులో 2,259 మంది, రెడ్డిగూడెంలో 2,213 మంది, తిరువూరులో 2,679, వత్సవాయిలో 2,808, వీరులపాడులో 2,371, విజయవాడ ఏఎస్‌వో కార్యాలయం- 1 పరిధిలో 7,528 మంది, విజయవాడ అర్బన్ - 2 కార్యాలయం పరిధిలో 6,855 మంది, విజయవాడ అర్బన్ - 3 పరిధిలో 4,207 మంది, విస్సన్నపేట మండలంలో 2,399 మంది కార్డుదారులు లేవలేని, నడవలేని, కదలలేని స్థితిలో, దీర్ఘకాలిక వ్యాధులతో మంచం మీద ఉన్న ఉన్నారు. మొత్తంగా 57,469 మందిలో ఆదివారం నాటికి 42,114 మందికి రేషన్ డీలర్లు వారి ఇంటికే వెళ్లి నిత్యావసరాలను పంపిణీ చేశారు. కృష్ణాజిల్లా మొత్తం 65,889 మందిని డోర్ డెలివరీకి గుర్తించగా.. ఆదివారం నాటికి 48,751 మందికి డోర్ డెలివరీ పూర్తి చేశారు.

'శాతవాహన'లో

(5వ పేజీ తరువాయి)

కుంటున్నట్టు వంకాయలపాటి కామేశ్వరరావు, ప్రజాపతిరావు మోమోలు దాఖలు చేయడంతో తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. ఈపీ (ఎగ్జిక్యూషన్ పిటిషన్)కు కోర్టు నుంచి అనుమతి తీసుకోకుండా ఎలా భూమిలోకి ప్రవేశిస్తారని కొంత మంది అసంబద్ధ వాదన చేస్తున్నారన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్, పిన్నమనేని కృష్ణమోహన్ కలిసి మొత్తం కథను నడిపిస్తున్నారని ఆరోపించారు. శాతవాహన కళాశాల అక్కడ నిర్వహించడం లేదని, అందులో విద్యార్థులు లేరని స్పష్టం చేశారు. సొసైటీ ఈ భూమిని ఎగ్జిబిషన్లకు ఇచ్చుకుని డబ్బులు సంపాదిస్తోందన్నారు. పిన్నమనేని కృష్ణమోహన్ ఈ భూమిని లీజుకు తీసుకున్నట్టు కాకినాడ, ఇతర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేయించారని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై న్యాయపరంగా ముందుకు వెళ్తామని చెప్పారు.

'శాతవాహన' పరిరక్షణ కమిటీ ఏర్పాటు

విజయవాడ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శాతవాహన కళాశాల భవనాలు శిథిలమైపోయినా ఆ భూమిని మాత్రం కాపాడుకోవాలని పూర్వ విద్యార్థులు కంకణం కట్టుకున్నారు. ఈ భూమిని కాపాడుకోవడానికి కొత్త శాతవాహన పరిరక్షణ కమిటీ ఏర్పడింది. కళాశాల మాజీ ప్రధాన అధ్యాపకుడు, శ్రీ దుర్గామల్లేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యక్షుడు వి.సాంబిరెడ్డిని కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. కో కన్వీనర్లుగా ఎం.విష్ణువర్ధన్, నవనీతం సాంబశివరావు, ప్రచార కమిటీ కన్వీనర్‌గా మోతుకూరి అరుణకుమార్, సభ్యులుగా కందిరి వెంకటేశ్వరరావు, చుండూరు నరేంద్ర, వి.శ్రీనివాసరావు, వల్లూరు నాగబాబు, వేదాంతం కిరణ్, మల్లంపల్లి సురేష్ ఉన్నారు. ముందుగా పూర్వవిద్యార్థులు కళాశాల వద్ద ధర్నా చేశారు. సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శాతవాహన కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించి, భవనాలను కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇక అమ్మ సేవ

(5వ పేజీ తరువాయి)

బస కల్పిస్తారు. వారికి దుర్గగుడిలో భోజనం ఏర్పాటు చేస్తారు. సేవ చేయాల్సిన ప్రాంతాలకు వారిని దేవస్థాన వాహనాల్లో తీసుకెళ్లి వదులుతారు. అక్కడి నుంచి వాహనాల్లో తీసుకొచ్చి బస కేంద్రం వద్ద దింపుతారు. సేవ పూర్తయిన తర్వాత సేవకులకు అమ్మవారి దర్శనం చేయించి, ప్రసాదంతోపాటు సామూహిక వేద ఆశీర్వచనం ఇప్పిస్తారు. ప్రస్తుతం సేవకులతో సేవ మాత్రమే చేయిస్తున్నారు.

అన్ని సేవలకు వినియోగించాలని..

ఈ సేవకులను ప్రస్తుతం అన్నదానం విభాగంలో, క్యూలైన్ల వద్ద ఉపయోగిస్తున్నారు. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ నుంచి ఇంద్రకీలాద్రికి అనుసంధానంగా అన్ని ప్రదేశాల్లో సేవకులను వినియోగించుకోవడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అంతరాలయం ముందు, లోపల ప్రస్తుతం మహిళా సెక్యూరిటీగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. రద్దీ లేని సమయాల్లోను అమ్మవారిని ప్రశాంతంగా దర్శనం చేసుకోనివ్వడం లేదన్న ఆరోపణ వారిపై ఉంది. దీనితో అంతరాలయంతో పాటు ముఖద్వార దర్శనం, ఉచిత, రూ.100 క్యూలైన్ల వద్ద సెక్యూరిటీ గార్డులను తొలగించి ఆ స్థానంలో సేవకులకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. ఇది కాకుండా అన్నదానం, క్యూలైన్ల ప్రవేశ మార్గం, ప్రసాదం కౌంటర్లు, సెల్‌ఫోన్ డిపాజిట్ పాయింట్లు, లగేజీలను భద్రపరిచే కౌంటర్, చెప్పుల స్టాండ్ వద్ద సేవకులను నియవించబోతున్నారు. కనకదుర్గానగర్‌లో వాహనాల పార్కింగ్ వద్ద నిత్యం సెక్యూరిటీ గార్డులకు భక్తులకు ఏదో ఒక విషయంలో వివాదాలు జరుగుతున్నాయి. సెక్యూరిటీ గార్డులకు సహాయకులుగా ఈ సేవకులను నియమిస్తారు.

మళ్లీ నిరాశే!

(5వ పేజీ తరువాయి)

మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యులు, అధికారుల నడుమ తెరిచేందుకు తొలుత ముహూర్తం నిర్ణయించినా కొన్ని అనివార్య కారణాలతో వాయిదా వేశారు. అందులో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎవరనేది తేటతెల్లంకానుంది. కౌన్సిల్ ఏర్పడి ఛైర్మన్ ఎన్నిక జరిగి సుమారు నాలుగేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు ఛైర్మన్ లేకుండానే అధికారులే పాలిస్తున్నారు. అనేక నాటకీయ పరిణామాల మధ్య ఛైర్మన్ ఫలితం తేలకుండా ఆడిపోయింది. ఈ నెల 9న తేలుతుంది అనుకున్న ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల ఫలితాలు మరోమారు వాయిదా పడటంతో అసలు ఛైర్మన్ లేకుండానే ఐదేళ్ల పదవి కాలం పూర్తవుతుందా ఏంటి అనే సందేహాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

అసలేం జరిగిందంటే..

జనాభా ప్రాతిపదికన ఇబ్రహీంపట్నం, కొండపల్లి పట్టణాలను కలిపి 2020లో అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో కొండపల్లి మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. కొండపల్లి మున్సిపాలిటీకి నవంబరు 15న 2021 ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 29 వార్డుల్లో టీడీపీకి 14, వైసీపీకి 14 వచ్చాయి. ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. స్వతంత్రఅభ్యర్థి టీడీపీలో చేరడంతో టీడీపీ బలం 15కి చేరింది. వైసీపీ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తన ఓటును వైసీపీకి వేయగా, టీడీపీ విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) తన ఓటును టీడీపీ ఛైర్మన్ అభ్యర్థికి వేశారు. దీంతో టీడీపీకి 16 ఓట్లు పడ్డాయి. ఛైర్మన్‌గా టీడీపీ అభ్యర్థి విజయం సాధించాడు. అయితే ఎంపీ నాని విజయవాడలో ఓటు హక్కు కోసం పెట్టుకున్నారని, అక్కడ ఆయన ఓటు హక్కును వినియోగించుకోకుండా ఆ ఓటును కొండపల్లిలో వేశారని వైసీపీ కౌన్సిలర్లు ఎంపీ ఓటుకు అభ్యంతరం తెలుపుతూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో అధికారులు ఛైర్మన్ ఎన్నిక అయితే జరిపారు కాని ఫలితం ప్రకటించకుండా కోర్టుకు దాన్ని సమర్పించారు. అప్పటి నుంచి ఛైర్మన్ ఎవరనేది తేలకుండా ఉంది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటీస్ మేళా నేడు

భారతీనగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్‌షిప్ మేళాలో భాగంగా అప్రెంటీస్‌షిప్ మేళాను ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో పలు ప్రముఖ కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలు హాజరై అర్హత కలిగిన విద్యార్థులకు పరిశ్రమల్లో అప్రెంటీస్‌గా అవకాశం కల్పిస్తారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో అన్ని ట్రేడ్‌లకు శిక్షణ తీసుకుని సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టుసైజ్ ఫొటోతో మేళాకు రావాలని ఆయన సూచించారు.

పేదల ఇళ్లకు పట్టాలివ్వాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్

రామలింగేశ్వరనగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్న పేదలకు వెంటనే జీవో 30 ప్రకారం పట్టాలివ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నగరంలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలకు ఇళ్లు ఇచ్చే అంశంపై జీవో 30ను జనవరిలో ప్రభుత్వం విడుదల చేసిందని, ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని ఆయన అన్నారు. రాష్ట్రంలో చెలరేగిపోతున్న భూ మాఫియా, బుల్డోజర్ వ్యవస్థపై దృష్టిపెట్టాలని ప్రభుత్వానికి శ్రీనివాసరావు సూచించారు. తిరుపతిలో పేదల ఇళ్లను బుల్డోజర్‌తో కూల్చేశారని, నగరంలోని శాతవాహన కళాశాల, అన్నపూర్ణ థియేటర్లను కూల్చేశారని పేర్కొన్నారు. శాతవాహన కాలేజీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడపాలని డిమాండ్ చేశారు. ల్యాండ్ మాఫియాలు విచ్చలవిడిగా చెలరేగిపోతున్నా చూసీచూడనట్లు ప్రభుత్వ యంత్రాంగం వాటికి వత్తాసు పలుకుతోందని విమర్శించారు. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడే వారిపై తక్షణమే చర్యలు తీసుకునే విధంగా చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. జగన్ మీడియా చానల్‌లో అనలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాసరావు ఆ వ్యాఖ్యలను ప్రోత్సహించడాన్ని ఆయన ఖండించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గృహాంధ్రపై శ్రద్ధపెట్టాలి: సీహెచ్ బాబూరావు

ప్రభుత్వం యోగాంధ్రపై పెట్టే శ్రద్ధ గృహాంధ్ర, నివాసాంధ్రపై పెట్టాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు సూచించారు. గ్రామాల్లో మూడు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని, కూటమి ప్రభుత్వం ఇప్పటికి ఎంతమందికి ఇచ్చిందో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లను గత ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదని, 2.5లక్షల ఇళ్లను పేదలకు కూటమి ప్రభుత్వం ఏడాది నుంచి ఇవ్వలేదని అన్నారు. ఇళ్లు ఇవ్వకపోగా కొన్ని చోట్ల పేదలు నివాసిస్తున్న ఇళ్లు, కళాశాలలను అడ్డూఅదుపు లేకుండా అర్ధరాత్రిళ్లు కూల్చేస్తున్నారని ఆయన విమర్శించారు. జీవో 30లో 150 చదరపు గజాల వరకు ఉచితంగా ఇస్తామని చెప్పి ప్రభుత్వం మెలికలు పెడుతోందన్నారు. ముఖ్యమంత్రి నివాసంతోపాటు పలు నివాసాలు కృష్ణానదీ తీరాన ఉన్నాయని, అదే నదీతీరాన ఉన్న నగరంలో నివాసముంటున్న పేదలకు పట్టాలు ఇచ్చేందుకు అభ్యంతరం ఏమిటని నిలదీశారు.

స్ఫూర్తిప్రదాత ఆచార్య ఎన్జీ రంగా

- వర్ధంతి సందర్భంగా నేతల ఘన నివాళి

మొగల్రాజపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా చరిత్ర ఎంతో స్ఫూర్తిదాయకమని, ఆయన చరిత్రను నేటి తరం తెలుసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా 30వ వర్ధంతిని పురస్కరించుకుని 8వ డివిజన్ ఆచార్య రంగానగర్‌లో ఎన్జీ రంగా విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. తాను పుట్టి పెరిగిన ఆచార్య రంగానగర్‌లో ఎన్జీ రంగా విగ్రహం అవిష్కరించడం గ ర్వంగా ఉందని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. ఆర్.వెంకట్రామన్, సర్దార్ గౌతు లచ్చన్న వంటి వారికి ఆయన గురువు అని ఎమ్మె ల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. అనంతరం రూ.37 లక్షలతో చేపడుతున్న రోడ్డు పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఎన్జీ రంగా సోదరి పుష్పకుమారి, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, పేరేపి ఈశ్వర్, కోగంటి రామారావు, లింగం కృష్ణ, శంకర్, ఆట్లూరి శ్రీనివాస్, భారతీదేవి, లక్ష్మీ శ్రియ, ఫణిరాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.


ఆచార్య రంగానగర్‌లో ఎన్జీ రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

నిస్వార్థ సేవకుడు ఎన్జీ రంగా

లబ్బీపేట: నిస్వార్థ సేవకు నిర్వచనం ఆచార్య ఎన్జీ రంగా అని వక్తలు కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుల భవనం లో వర్ధంతి కార్యక్రమాన్ని ఆచార్య ఎన్జీ రంగా ట్రస్ట్ చైర్మన్ గోగినేని ధన శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథు లుగా మాజీ మంత్రి వడ్డే శోభానాద్రీశ్వరరావు, రైతు నాయకులు వై.కేశవరావు, జమలయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల నుకొండ శివాజీలు రంగా విగ్రహనికి నివాళులు అర్పించారు. ఆట్లూరి సోమ శేఖర్, కె.ప్రసాద్, కేవీపీ బసవేశ్వరరావు తదిత రులు పాల్గొన్నారు.

ఎన్జీ రంగా ఆశయాలను నేటితరానికి తెలియజెప్పాలి

పటమట: ఆచార్య ఎన్జీ రంగా ఆశయాలను నేటి తరానికి తెలియజెప్పాల్సిన అవసరం ఉందని కాకాని ఆశయ సాధన సమితి చైర్మన్ కాకాని తరుణ్ అన్నారు. ఎన్జీ రంగా ట్రస్టు చైర్మన్ గోగినేని ధనశేఖర్, కాకాని తరుణ్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీస్ కంట్రోల్ రూం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఎన్జీ రంగా మూడు దశాబ్దాల పాటు పార్లమెంట్ సభ్యుడిగా పని చేశారని, ఏపీలో రైతు ఉద్యమాన్ని చేపట్టారని కాకాని తరుణ్ అన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా గుంటూరులో వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఎన్జీ రంగా పేరు పెట్టారని కోరారు. ట్రస్టు కార్యదర్శి రవి, భాను, నిఖిల్, కె.బసవ పాల్గొన్నారు.


రాణిగారితోట సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద జగన్ పత్రిక ప్రతులు దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

జగన్ డైరెక్షన్‌లోనే అమరావతిపై నీచమైన వ్యాఖ్యలు

- కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలి: టీడీపీ

రాణిగారితోట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జగన్ డైరెక్షన్‌లోనే ఆయన చానల్‌లో నిర్వహించిన డిబేట్‌లో రాజధాని మహిళలపై కృష్ణంరాజు నీచాతినీచమైన వ్యాఖ్యలు చేశారని, కృష్ణంరాజు, వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాస్ వెంటనే క్షమాపణలు చెప్పాలని, వారిపై చర్యలు తీసుకోవాలని రాణిగారితోట 17, 18 డివిజన్ల టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. రాణిగారితోట సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జగన్ చానల్‌లో రాజధాని మహిళలపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం నిరసన తెలిపారు. జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. టీడీపీ 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు మాట్లాడారు. జర్నలిస్టుల ముసుగులో ఉన్న సంస్కారహీనులు, కిరాయి బ్యాచ్ మహిళలను కించపరుస్తూ నీచపు వాఖ్యలు చేశారని అన్నారు. ఇది రాష్ట్ర మహిళల వ్యక్తిత్వంపై దాడి అని పేర్కొన్నారు. జగన్ తన కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, ఈ అంశంపై మేధావులు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు ఏక కంఠంతో ఖండించాలని అన్నారు. ప్రభుత్వం, మహిళా కమిషన్, ఎస్సీ కమిషన్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి నీచప్రచారాలు చేయకుండా ప్రజలు స్పందించి నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ అధ్యక్షురాలు రాయి రంగమ్మ, సునాబీ, పగడాల వెంకటేశ్వరరెడ్డి, వుట్ల రమణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటుబ్యాంకుగా కాపులు!

- ఎన్నికలయ్యాక నిర్లక్ష్యం చేస్తున్న రాజకీయ పార్టీలు
- కాపులకు రిజర్వేషన్లు అమలు చేయాలి
- అఖిల భారత కాపు జేఏసీ డిమాండ్

గాంధీనగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలన్నీ కాపులను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, ఎన్నికల్లో వాడుకుంటూ అధికారంలోకి వచ్చాక కాపులను నిర్లక్ష్యం చేస్తున్నాయని అఖిల భారత కాపు జేఏసీ నేతలు ధ్వజమెత్తారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో జేఏసీ కన్వీనర్లు గొర్రెపాటి అర్జునరావు, ఆలా రామారావు, వాదా ప్రసాదరావు, సంకటి లక్ష్మణరావు, కత్తి చెన్న కేశవనాయుడు మాట్లాడారు. కాపులకు రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇటీవల పిఠాపురంలో గుర్తుతెలియని వ్యక్తులు వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాపులకు సబ్సిడీ లోన్లు మంజూరు చేయాలని, కాపు కార్పొరేషన్‌కు పాలకమండలి ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాపులకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని లేదంటే రాభోయే ఎన్నికల్లో కాపుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాణిగారితోట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, నిర్వహణ కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, న్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11 కేవీ పోలీస్ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. సత్యనారాయణనగర్, పోలీస్ కాలనీ, హెడ్ పోస్టాఫీసు, ఎస్‌బీఐ బాలాజీనగర్, ఉదగిరి గంగయ్య రోడ్డు, కోర వారి వీధి, కొత్త అంజనేయస్వామి గుడి, జీఎల్ రావు ప్లాట్స్, మహితా పబ్లిక్ స్కూల్, బాలాజీ నగర్ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్రీస్తురాజుపురంలో ఆకతాయిల హల్‌చల్

- కత్తులు, బీరు సీసాలతో రోడ్డుపైన వీరంగం.. భయంతో స్థానికుల పరుగులు
- పోలీసుల అదుపులో పదిమంది

గుణదల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఫుల్లుగా మందుకొట్టిన పదిమంది ఆకతాయిలు కత్తులు బీరుసీసాలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటూ రోడ్డుమీదకు రావడంతో క్రీస్తురాజుపురంవాసులు భయంతో పరుగులు తీశారు. ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. గొడవకు దిగిన క్రీస్తుపురానికి చెందిన యువకుల్లో ఓ యువకుడి నెల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి స్నేహితులు పార్టీ ఇవ్వమని ఒత్తిడి తెస్తున్నారు. దీంతో కొంత నగదు స్నేహితులకు ఇచ్చి పార్టీ చేసుకోమని చెప్పాడు. నగదు తీసుకున్న స్నేహితులు మందు తాగి వాటాల వద్ద పేచీకి దిగారు. ఒకరిపై ఒకరు వాగ్వాదానికి దిగి..చివరకు కత్తులతో దాడి చేసుకునే వరకు వచ్చారు. మాచవరం సీఐ ప్రకాష్ సిబ్బందితో వచ్చి పదిమంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు.

కామన్‌సైట్ సమస్యకు పరిష్కారం సంతోషకరం

- ఏపీఐఐసీ కాలనీ ఇళ్ల యజమానుల సమావేశంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ కాలనీలోని కామన్ సైట్ సమస్యకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం సంతోషకరమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నాలుగో డివిజన్ ఏపీఐఐసీ కాలనీలోని కోగంటి సీతారామమ్మ కల్యాణ మండపంలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇళ్ల యజమానుల జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడారు. కాలనీలోని కామన్ సైట్ ఏపీఐఐసీ పేరుతో ఉండడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తన దృష్టికి తెచ్చారని, పరిష్కారం కోసం ఎప్పటి నుంచో తాను అధికారులతో చర్చలు జరుపుతున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లానని, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఉన్నతాధికారులు వచ్చి స్థలాలను పరిశీలించారని తెలిపారు. రూపాయి ఖర్చు లేకుండా స్థలాన్ని కాలనీవాసులకు అందజేయాలనే లక్ష్యంతో పనిచేశానన్నారు. ప్రభుత్వం కాలనీవాసులకు అనుకూలంగా జీవో ఇచ్చిందని తెలిపారు. ఏపీఐఐసీ కాలనీలోని కామన్ సైట్లను పైసా ఖర్చు లేకుండా యజమానుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రభుత్వం నుంచి జీవో రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, కాలనీ అధ్యక్షుడు పాతూరి సాంబశివరావు, గొల్లపూడి నాగేశ్వరరావు, రెడ్డి రాంబాబు, అబ్దుల్ కలాం, మానేం పోతురాజు, జి.అయ్యప్పరెడ్డి, పాతూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఓపెన్ డ్రెయినేజీ

- మెష్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్న స్థానికులు

(ఆంధ్రజ్యోతి-రామలింగేశ్వరనగర్): పటమట అంబేద్కర్ నగర్ కాలువగట్టు ప్రాంతంలో పార్కు సమీపంలోని డ్రెయినేజీ ఓపెన్‌గా ఉండడం వలన ప్రమాదకరంగా ఉంది. ఒక పక్క అంబేద్కర్ భవనం మరో పక్క పార్కు ఖాళీ స్థలం ఉండడంతో చిన్న పిల్లలు ఆడుకుంటూ డ్రెయినేజీ కాలువలో పడుతున్నారు. దీనివలన ప్రాణనష్టం సంభవించే ప్రమాదం పొంచి ఉంది. బందరు కాలువలో కలిసే ప్రాంగణం కావడంతో కాలనీ చుట్టుపక్కల నుంచి వచ్చే మురుగునీరు దుర్గంధం వెదజల్లుతోంది ఓపెన్ డ్రెయినేజీపై మెష్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులకు చెప్పినా పెడచెవిన పెడుతున్నారని, సమస్యను పరిష్కరించడం లేదని అంటున్నారు. రానున్నది వర్షాకాలం కావడంతో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని స్థానికులు భయపడతున్నారు.


డ్రెయినేజీ పక్కన పిల్లలు ఆడుకునే ప్రదేశం


అంబేద్కర్‌నగర్ కాలువగట్టు ప్రాంతంలోని పార్కు సమీపంలో నివాసాలకు అనుకుని ఉన్న డ్రెయినేజీ

పోస్టర్ ఆవిష్కరణ

పటమట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సేవాభావం కలిగిన వైద్యులకు రూట్స్ 12వ హెల్త్ అవార్డు పేరుతో జూలై 1న నిర్వహించే కార్యక్రమంలో హెల్త్ అవార్డులు అందిస్తామని రూట్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయ్‌భాస్కర్ తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. జూలై 1న నిర్వహించే ఈ కార్యక్రమానికి మంత్రిని ఆహ్వానించినట్లు తెలిపారు. కేన్సర్ నివారణ కార్యక్రమంలో రూట్స్ భాగస్వామ్యం కావాలని మంత్రి సూచించారని ఆయన తెలిపారు. చందు శ్రీనివాస్, ఎం.శర్మ, కె.మాధవి, యలమందయ్య, డాక్టర్ భావనాచంద్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


రూట్స్ హెల్త్ సర్వీసెస్ అవార్డ్స్ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

మ్యాన్‌హోల్‌పై సిమెంట్ దిమ్మెకు మరమ్మతులు

పటమట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పటమట సెంటర్ ముఖ ద్వారంలో మ్యాన్‌హోల్‌పై సిమెంట్ దిమ్మెను సరిచేయాలని ఇటీవల ఆంధ్రజ్యోతిలో సిమెంట్ దిమ్మెను సరి చేయరూ అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి కార్పొరేషన్ అధికారులు స్పందించారు. శాశ్వత ప్రాతిపదికన సిమెంట్ దిమ్మెను ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టారు.


మ్యాన్‌హోల్‌పై ఎగుడు దిగుడుగా ఉన్న సిమెంట్ దిమ్మె(ఇంతకుముందు)


తాజాగా మరమ్మతుల కోసం తీసేసిన దిమ్మె

గొల్లపూడి మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తా

- ఏఎంసీ డైరెక్టర్ కొర్రా అప్పన్న

కృష్ణలంక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : గొల్లపూడి మార్కెట్ కమిటీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని డైరెక్టర్‌గా నియ మితుడైన కొర్రా అప్పన్న ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీలో 2013 నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్న ఆయన 2014లో కృష్ణలంకలోని ఆరు డివిజన్లను వైసీపీ కైవసం చేసుకోగా 21వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్‌గా స్వర్గీయ గొరిపర్తి నర్సింహారావు ఘన విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. తనకు ఈ పదవి రావడానికి కారణమైన మంత్రి నారా లోకేశ్, ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గొరిపర్తి నామేశ్వరరావుకు అప్పన్న కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, కేశనం భావన్నారాయణ, మోటేపల్లి చిన్నా, పలిశెట్టి అన్నారావు హర్షం వ్యక్తం చేశారు.

యోగా ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- అధికారులకు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

కార్పొరేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి సచివాలయం పరిధిలో సోమవారం ఉదయం ర్యాలీ నిర్వహించి యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని అధికారులను వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం శాఖాధిపతులు, స్పెషల్ ఆఫీసర్లు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. వీఎంసీ పరిధిలో ప్రధాన ర్యాలీ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్‌సర్కిల్ వరకు నిర్వహించాలని ధ్యానచంద్ర ఆదేశించారు.

జవహర్ నవోదయ విద్యాలయ(జేఎన్‌వీ) సమితి 2026-27 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. సీబీఎస్‌ఈ సిలబస్‌లో బోధన ఉంటుంది. ఎంపికైన విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు ఉచితంగా బోధించడంతోపాటు, వసతి, భోజనం, పుస్తకాలు, యూనిఫామ్ కూడా అందిస్తారు.

నవోదయ విద్యాలయలో అడ్మిషన్స్



అర్హతలు:

- **విద్యార్హత:** జేఎన్‌వీకి దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు ప్రైవేట్ / ప్రభుత్వ / ప్రభుత్వ అనుబంధ పాఠశాలలో, 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ఉండాలి.
- **వయస్సు:** విద్యార్థి 2014 మే1 నుంచి 2016 జూలై 31 తేదీ మధ్యలో(ఈ తేదీలతో సహా) జన్మించి ఉండాలి.
- **నివాసం:** విద్యార్థి ఐదో తరగతి చదువుతో పాటు, అదే జిల్లాలో నివాసాన్ని కలిగి ఉండాలి.
- **సీట్లు:** మొత్తం సీట్లను రూరల్, అర్బన్ కోటా కింద విభజిస్తారు. ప్రతి జేఎన్‌వీ పాఠశాలలో 80 సీట్లు ఉండగా గ్రామీణ విద్యార్థులకు 60 సీట్లు, నగర(అర్బన్) విద్యార్థులకు 20 సీట్లు లభిస్తాయి. గ్రామీణ కోటాలోకి రావాలంటే, విద్యార్థి 3వ, 4వ, 5వ తరగతులను పూర్తిగా గ్రామీణ ప్రాంత పాఠశాలలో చదివి ఉండాలి. ఈ కాలంలో ఒక్క రోజు నగర పాఠశాలలో చదివినా, ఆ విద్యార్థులను నగర కోటాలో పరిగణలోకి తీసుకుంటారు.
- **పరీక్ష విధానం:** పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ఇందులో 80 ప్రశ్నలు వస్తాయి.
- పరీక్ష తరువాత ఒక ఎంపిక జాబితా విడుదల చేస్తారు.

విభాగం	మార్కులు	ప్రశ్నల సంఖ్య
మెంటల్ ఎబిలిటీ	50	40
గణితం	25	20
ఆంగ్లం	25	20

ఎన్ని పాఠశాలలు: ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 15 పాఠశాలలు ఉన్నాయి ఇందులో 13 పాత పాఠశాలలు కాగా ఈ సంవత్సరం కొత్తగా రెండింటిని చేర్చారు. తెలంగాణ ప్రస్తుతం 9 పాఠశాలలు ఉన్నాయి. కొత్తగా ఏడు పాఠశాలలు మంజూరైనప్పటికీ ఈ సంవత్సరపు నోటిఫికేషన్‌లో వాటిని చేర్చలేదు.

- **దరఖాస్తు చివరి తేదీ:** 2025 జూలై 29
- **పరీక్ష తేదీ:** 2025 డిసెంబర్ 13
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్
- **వెబ్‌సైట్:** https://navodaya.gov.inspector

దిక్సూచి

SCHOLARSHIP ALERT

IET India Scholarship Award

Description: The Institution of Engineering and Technology (IET) invites undergraduate engineering students to showcase their creativity, innovation, and leadership. This scholarship recognizes and nurtures India's future engineering leaders, empowering them to excel.
Eligibility: Open to full-time 1st, 2nd, 3rd, and 4th-year UG engineering students from AICTE/UGC-approved institutions across all branches. Applicants must have cleared all credit courses in a single attempt with a minimum of 60% marks in aggregate (or 6.0 CGPA on a 10-point scale). There is no age limit.
Prizes & Rewards: Scholarships worth INR 10,00,000
Last Date to Apply: 22-06-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/IET5

buddy4study.com

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్

మొత్తం ఖాళీలు: 453

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్ష కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దీని ద్వారా ఇండియన్ మిలిటరీ అకాడమి, ఇండియన్ నేవల్ అకాడమి, ఎయిర్ ఫోర్స్ అకాడమి, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీల్లో అడ్మిషన్ కల్పిస్తారు.

1. ఇండియన్ మిలిటరీ అకాడమి(ఐఎమ్ఏ-డెహ్రాడూన్)
- **ఖాళీలు:** 100 (13 ఖాళీలు ఆర్మీవింగ్‌లో ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ ఉన్నవారి కోసం కేటాయించారు)
- **విద్యార్హతలు:** గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2002 జూలై 2 నుంచి 2007 జూలై1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

2. ఇండియన్ నేవల్ అకాడమి(ఐఎన్ఏ-ఎజిమల)
- **ఖాళీలు:** 26 (6 ఖాళీలు నేవల్ వింగ్‌లో ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ ఉన్నవారి కేటాయించారు. 2 హైడ్రో కేడర్ వారికి)
- **విద్యార్హతలు:** ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2002 జూలై 2 నుంచి 2007 జూలై1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

3. ఎయిర్ ఫోర్స్ అకాడమి(ఐఎఫ్ఏ-హైదరాబాద్)
- **ఖాళీలు:** 32 (3 ఖాళీలు నేవల్ వింగ్‌లో ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ ఉన్నవారి కేటాయించారు.)
- **విద్యార్హతలు:** ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ లేదా ఎంపీసీతో ఇంటర్ చదివి ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి.
- **వయస్సు:** 2026 జూలై 1 తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 20 నుంచి 24 సంవత్సరాల మధ్యలో ఉండాలి (2002 జూలై 2 నుంచి 2006 జూలై1 తేదీలోపు జన్మించి ఉండాలి). డీసీసీఏ కమర్షియల్ పైలెట్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులు అయితే 26 సంవత్సరాల వయస్సు వరకు అర్హులు.


4. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమి(ఓటీఏ-చెన్నై)(పురుషుల నాన్ టెక్నికల్ కోర్స్)
- **ఖాళీలు:** 276
- **విద్యార్హత:** గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2001 జూలై 2 నుంచి 2007 జూలై 1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

5. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమి (ఓటీఏ-చెన్నై)(మహిళల నాన్ టెక్నికల్ కోర్స్)
- **ఖాళీలు:** 19
- **విద్యార్హత:** గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2001 జూలై 2 నుంచి 2007 జూలై1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన మహిళలు, పిల్లలు లేకుండా విడాకులు పొందిన మహిళలు/ భర్త చనిపోయిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక విధానం:

1. రాత పరీక్ష(ఆబ్జెక్టివ్)
- ఐఎమ్ఏ, ఐఎన్ఏ, ఏఎఫ్ఏ: ఇంగ్లిష్, జీకే, ఎలిమెంటరీ మేథ్స్(300 మార్కులు)
- ఓటీఏ: ఇంగ్లిష్, జీకే(200 మార్కులు)

2. ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ(సైకలాజికల్, గ్రూప్ టెస్టింగ్, ఇంటర్వ్యూ)
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 14
- **వెబ్‌సైట్:** https://upsconline.nic.in/



నేషనల్ డిఫెన్స్ అకాడమి అండ్ నేవల్ అకాడమి

మొత్తం ఖాళీలు: 406

నేషనల్ డిఫెన్స్ అకాడమి అండ్ నేవల్ అకాడమి ఎగ్జామినేషన్ కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2026 జూలై 1 నుంచి ప్రారంభం అయ్యే ఎన్‌డీఏ 156 కోర్, ఇండియన్ నేవల్ అకాడమి 118 కోర్‌కు సంబంధించిన నోటిఫికేషన్ ఇది. ఆసక్తిగల అవివాహితులైన స్త్రీ, పురుష అభ్యర్థులు యూపీఎస్సీ ఆన్‌లైన్ అప్లికేషన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

1. నేషనల్ డిఫెన్స్ అకాడమి(ఎన్‌డీఏ) 370 పోస్టులు
- **ఆర్మీవింగ్:** 208 (మహిళలకు 10)
- **నేవీ వింగ్:** 42 (మహిళలకు 5)
- **ఎయిర్‌ఫోర్స్ వింగ్:** ఫ్లైయింగ్ బ్రాంచ్ 92(మహిళలకు 2)
- **గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్):** 18 (మహిళలకు 2)
- **గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్):** 10 (మహిళలకు 2)

2. నేవల్ అకాడమి(10+2 కేడెట్ ఎంట్రీ స్కీమ్) 36 పోస్టులు
- మొత్తం 36 పోస్టులు (మహిళలకు 4)

వయస్సు: 2007 జనవరి 2 నుంచి 2010 జనవరి 1వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి.
విద్యార్హత: ఆర్మీ వింగ్ పదో తరగతి పాసై ఉండాలి
ఎయిర్ ఫోర్స్ అండ్ నేవల్ వింగ్/ ఎన్ఏ కేడెట్ ఎంట్రీ స్కీమ్: మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీతో ఇంటర్ పాసై ఉండాలి.

ఎంపిక విధానం:

రాత పరీక్ష: మేథ్స్ 300 మార్కులు, జీకే+ఇంగ్లిష్ 600 మార్కులు(మొత్తం 900 మార్కులు). తప్పుగా గుర్తించిన సమాధానానికి నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.
ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ/ పర్సనాలిటీ టెస్ట్: 900 మార్కులు
ఎయిర్‌ఫోర్స్ కేడెట్స్: కంప్యూటరైజ్డ్ పైలెట్ సెలెక్షన్ సిస్టమ్(సీపీఎస్ఎస్) పాస్ కావాలి.
దరఖాస్తులకు చివరి తేదీ: 2025 జూన్ 17
పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్ 14
వెబ్‌సైట్: https://upsconline.nic.in/

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్



సైన్స్ విభాగాల్లో పరిశోధన, బోధనకు అవకాశం కల్పించే సీఎస్ఐఆర్ యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. ఇది జేఆర్ఎఫ్‌తోపాటు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఉపయోగపడుతుంది.

పరీక్ష పేపర్లు
- కెమికల్ సైన్సెస్
- ఫిజికల్ సైన్సెస్
- లైఫ్ సైన్సెస్
- మేథమెటికల్ సైన్సెస్
- ఎర్త్, అట్మాస్ఫియర్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ పాసై ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు 50 శాతం చాలు.

వయస్సు: జేఆర్ఎఫ్‌కు అర్హత విషయానికి వస్తే జనరల్ కేటగిరీ అభ్యర్థులు 2025 జూలై 1 తేదీ నాటికి 30 సంవత్సరాల లోపు ఉండాలి. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలు/ దివ్యాంగ అభ్యర్థులకు ఐదు సంవత్సరాలు, నాన్ క్రిమిలేయర్ ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్/ పీహెచ్‌డీ ప్రవేశాలకు ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.

పరీక్ష విధానం: పరీక్ష కంప్యూటర్ బేస్డ్ విధానంలో, మల్టిపుల్ చాయిస్ పద్ధతిలో 200 మార్కులకు ఉంటుంది. పరీక్ష వ్యవధి మూడు గంటలు. నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1150/-, జనరల్, ఈడబ్ల్యూఎస్/ఓబీసీ(నాన్ క్రిమిలేయర్) రూ.600/-, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/థర్డ్ జెండర్ అభ్యర్థులకు రూ.325/-.

దరఖాస్తులకు చివరి తేదీ: 2025 జూన్ 23
పరీక్ష తేదీలు: 2025 జూలై 26, 27, 28
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
వెబ్‌సైట్: https://csirnet.nta.ac.in/

చిత్రజ్యోతి

SINCE 1965







అంగరంగ వైభవంగా అఖిల్ రిసెప్షన్



యువ కథానాయకుడు అఖిల్ అక్కినేని వివాహ రిసెప్షన్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరయ్యారు. మహేశ్ బాబు, రామ్‌చరణ్ కుటుంబంతో సహ విచ్చేశారు. తమిళ హీరో సూర్యతోపాటు దర్శకుడు వెంకీ అట్లూరి హాజరయ్యారు. వీరితోపాటు పలువురు సినీ సెలబ్రెటీలు కూడా సందడి చేశారు. ఈనెల 6న అఖిల్, జైనబ్ వివాహ బంధంతో కొత్త జీవితంలోకి అడుగుపెట్టారు.

బాలకృష్ణతో మరోసారి



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ విషయాన్ని దర్శకుడు గోపీచంద్ మలినేని ఎక్స్ వేదికగా పంచుకున్నారు. "గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణతో మరోసారి సినిమా చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ సినిమాతో మా కాంబో చేసే గర్జన మరింత ఎక్కువగా ఉండబోతోంది. చరిత్రలో నిలిచిపోయే చిత్రమిది" అని పేర్కొన్నారు. మంగళవారం బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రారంభించనున్నారు. ఇది ఆయన నటించనున్న 111వ చిత్రం. వెంకట్ సతీష్ కిలారు నిర్మించనున్నారు. కాగా, బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కలయికలో 'వీరసింహా రెడ్డి' అనే చిత్రం వచ్చిన సంగతి తెలిసిందే.

అఖండ 2 టీజర్ వచ్చేస్తోంది

హీరో బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబో హ్యాట్రిక్ కొట్టిన సంగతి తెలిసిందే. వారి కలయికలో నాలుగోసారి తెరకెక్కుతోన్న సినిమా 'అఖండ 2: తాండవం'. ఈ సినిమా టీజర్‌ను నేడు విడుదల చేయనున్నారు మేకర్స్.

'మాగంటి'కి చిత్రపరిశ్రమతో అనుబంధం



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా మూడు సార్లు ఎన్నికైన మాగంటి గోపినాథ్‌కు చిత్ర పరిశ్రమతో కూడా అనుబంధం ఉంది. సినీ ప్రముఖులతో మంచి సంబంధాలు ఉన్నాయి. నిర్మాతగా నాలుగు సినిమాలు నిర్మించారు. శ్రీ సాయినాథ్ ఆర్ట్ క్రియేషన్స్ బేనర్‌పై సురేశ్, శ్రీకాంత్ కీలక పాత్రల్లో 'పాత బస్తీ' అనే సినిమాను 1995లో నిర్మించారు. అనంతరం 2000 సంవత్సరంలో ఆర్‌కే ఫిల్మ్స్ బేనర్‌పై రాజశేఖర్, కృష్ణతో 'రవన్న' అనే చిత్రాన్ని నిర్మించారు. 2004లో దివ్య అక్షర నాగ మూవీస్ బేనర్‌పై తారకరత్నతో 'భద్రాద్రి రాముడు', 2009లో రాజశేఖర్‌తో 'నా స్టైలే వేరు' సినిమాలు నిర్మించారు.



శివుడే నన్ను ఎంచుకున్నాడు

మంచు విష్ణు

విష్ణు కథానాయకుడిగా ముఖేశ్‌కుమార్ సింగ్ తెరకెక్కించిన చిత్రం 'కన్నప్ప'. డా.మోహన్‌బాబు నిర్మించారు. ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌బాబు మాట్లాడుతూ "దాదాపు ఏడెనిమిదేళ్లు కష్టపడి ఈ సినిమా తీశాం. ఇందులో నటించమని అడిగిన వెంటనే అంగీకరించిన మా బావ ప్రభాస్‌కు కృతజ్ఞతలు. ఈ సినిమాను శివుడు ఆశీర్వదించాడు" అని అన్నారు. "ఈ సినిమాలో ఎవరెవరు పనిచేయాలి అనేది శివాజ్ఞతోనే జరిగింది. ఈ చిత్ర ప్రయాణం నన్ను చాలా మార్చింది. 'కన్నప్ప' కథను మరోసారి చెప్పరా అని శివుడు నన్ను ఎంచుకున్నాడని భావిస్తున్నా" అని మంచు విష్ణు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం, రఘుబాబు, శివబాలాజీ, కౌశల్ పాల్గొన్నారు.

సరికొత్త కథాంశంతో 'పయనం'



'రోటీ కపడా రొమాన్స్' ఫేమ్ సుప్రజ్, సంగీర్తన విపిన్ జంటగా 'పయనం' అనే చిత్రంలో నటిస్తున్నారు. చందురామ్ దర్శకత్వంలో స్వర్ణకమల నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ క్లాప్ ఇవ్వగా, సంగీత దర్శకుడు రఘు కుంచె కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా చందురామ్ మాట్లాడుతూ "సరికొత్త కథాంశంతో తెరకెక్కుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

టీఎఫ్‌సీసీ అధ్యక్ష పదవికి

సునీల్ నారంగ్ రాజీనామా

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

ఇటీవల కాలంలో ఇండస్ట్రీలో పలు వివాదాలకూ, సంచలనాలకు కారణమైన సింగిల్ స్ర్కీన్ థియేటర్ల మూసివేత అంశం తాజాగా కొత్త మలుపు తీసుకుంది. తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీఎఫ్‌సీసీ) అధ్యక్ష పదవికి నిర్మాత సునీల్ నారంగ్ ఆదివారం రాజీనామా చేశారు. శనివారం జరిగిన టీఎఫ్‌సీసీ ఎన్నికల్లో నారంగ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవికి ఎన్నికవడం ఇది మూడోసారి. అయితే అధ్యక్ష పదవి చేపట్టి 24 గంటలు కూడా గడవకముందే ఆయన రాజీనామా చేయడం ఇండస్ట్రీ వర్గాల్లో సంచలనం కలిగించింది. 'నాకు సంబంధం లేకుండా నా పేరుతో పబ్లిక్ స్టేట్‌మెంట్స్ ఇస్తున్నారు. సినీ పరిశ్రమ నుంచి ఏదైనా ప్రకటన ఇచ్చేముందు, ఇంటర్వ్యూ, ప్రెస్ మీట్ నిర్వహించే ముందు నాకు సమాచారం ఇవ్వడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక టీఎఫ్‌సీసీ అధ్యక్షుడిగా కొనసాగలేను' అని ఆయన టీఎఫ్‌సీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. కానీ ఆయన రాజీనామా కోసం తెరవెనుక పెద్ద తతంగమే నడిచిందంటున్నాయి పరిశ్రమ వర్గాలు.

శ్రీధర్ విమర్శలపై ఇండస్ట్రీ ఆగ్రహం

కొత్త కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో టీఎఫ్‌సీసీ సెక్రటరీ శ్రీధర్ టాలీవుడ్ అగ్రహీరోలను ఉద్దేశించి చేసిన పరుష వ్యాఖ్యలు ఇండస్ట్రీలోని కొన్ని వర్గాలకు రుచించలేదని సమాచారం. 'నీ ప్రోద్బలం లేకుండా నీ సమక్షంలోనే అతను అంత దురుసుగా ఎలా మాట్లాడతాడు, నువ్వు అక్కడే ఎందుకు ఖండించలేదు' అంటూ ఇండస్ట్రీ శక్తులు కొన్ని నిప్పులు చెరగడంతో ఎటూ పాలు పోని పరిస్థితుల్లో సునీల్ రాజీనామా చేశారనే మాట వినిపిస్తోంది. పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రాన్ని అడ్డుకునేందుకే థియేటర్ల మూసివేత అంశాన్ని తెరపైకి తెచ్చారని జరిగిన ప్రచారంలో ఆ నలుగురు(అల్లు అరవింద్, దిల్‌రాజు-శిరీష్, సురేశ్‌బాబు) లో సునీల్‌నారంగ్ పేరు ప్రముఖంగా వినిపించిన విషయం తెలిసిందే. అయితే 'అందులో నేను లేను, పవన్ కల్యాణ్ సినిమా అడ్డుకునే సాహసం ఎవరూ చేయలేరు' అని శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సునీల్ నారంగ్ వివరణ ఇచ్చారు. కానీ అదే ప్రెస్‌మీట్‌లో శ్రీధర్ ఇద్దరు దర్శకులు, ఇద్దరు హీరోలు చేసిన కుట్రలో భాగమే ఇదంతా అంటూ చేసిన వ్యాఖ్యలు సునీల్ నారంగ్ మెడకు చుట్టుకున్నాయి.

పవన్ సినిమా రాకుంటే మా పరిస్థితి ఏమిటి?



శ్రీధర్

అసలు ఇంతకీ మీడియా సమావేశంలో శ్రీధర్ ఏమన్నారంటే 'వరల్డ్‌వైడ్ రూ. 2 కోట్లు వసూళ్లు రాని హీరోకి రూ. 13 కోట్లు పారితోషికం ఇచ్చారు. ఒకప్పుడు రెండు మూడు సినిమాలు చేసేవాళ్లు హీరోలు. ఇవ్వాళ రెండేళ్లకో సినిమా తీస్తున్నారు. భారీగా పారితోషికం తీసుకోవడమే దానికి కారణం. పవన్ కల్యాణ్ సినిమా వస్తుందని మేం థియేటర్లు అన్నీ ఖాళీ పెట్టుకున్నాం. ఇప్పుడు ఈ నెల మొత్తం వృథాగా పోయినట్లే. హీరోలకు ఈ స్టార్‌డమ్ ఎక్కడ నుంచి వచ్చింది. ఒక హీరో ఏడాదికి రెండు సినిమాలైనా చేయక పోతే సింగిల్ స్ర్కీన్లు నడవవు. లేదంటే గోదాములు, సూపర్ మార్కెట్లు అవుతాయి. తెలంగాణ ఎగ్జిబిటర్ల నుంచి థియేటర్ల ప్రతిపాదన రాలేదు. ఇద్దరు దర్శకులు, ఇద్దరు నిర్మాతలే దీని వెనుక ఉన్నారు. టైమ్ వచ్చినప్పుడు పేర్లు చెబుతాను' అని సీరియస్ వ్యాఖ్యలు చేశారు.

హీరోలు అంటే దేవుళ్లు

సినీ పెద్దల ఆగ్రహాన్ని చల్లబరిచే ప్రయత్నంలో భాగంగానే సునీల్ నారంగ్ రాజీనామా చేశారనే ప్రచారం జరుగుతోంది. పవన్ కల్యాణ్ సినిమాతో పాటు మా కుబేర సినిమా కూడా అదే సమయంలో విడుదలవుతుండగా, మేం థియేటర్లను మూయాలని ఎందుకు అనుకుంటాం అని ప్రశ్నించారు. డిజిటల్ మీడియాకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో సైతం ఆయన హీరోలను ఆకాశానికి ఎత్తారు. 'మనదేశంలో డబ్బున్నోళ్లు చాలామంది ఉన్నారు. కానీ హీరోలవ్వలేదు. కోటి మందిలో ఒక హీరో పుడతాడు. వాళ్లు దేవుళ్లు. హీరో అవ్వడం అంత వీజీ కాదు. 145 కోట్ల జనాభాలో 40 మంది హీరోలున్నారు' అంటూ స్పందించారు. తాజా వివాదానికి ఆజ్యం పోసిన శ్రీధర్ వ్యాఖ్యలతోనూ తనకు సంబంధం లేదని చెప్పే ప్రయత్నం చేశారు. 'శ్రీధర్ చెప్పిన మాట వినడు. నిన్న నేను ఆయన్ను చూసి వెనక్కు వెళుతుంటే బలవంతంగా తీసుకెళ్లి ప్రెస్‌మీట్‌లో కూర్చోబెట్టారు. ఆయనకు ఎవరు రాసిచ్చారో, ఆయనతో ఎవరు అలా మాట్లాడించారో నాకు తెలియదు.



నేను ప్రెసిడెంట్‌ని, ఆయన సెక్రటరీ... కాబట్టి నా పక్కన కూర్చొని మాట్లాడాడు. దాంతో నాకేం సంబంధం లేదు. ఆయన మాటల వెనుక నా ప్రోద్బలం ఉండి ఉంటే మీడియా సమావేశంలో ఆయన పక్కన ఎందుకు కూర్చుంటాను. అసలు ప్రెస్‌మీట్‌లో ఆయన ఏం మాట్లాడతాడనేది కూడా నాకు తెలియదు. ఆయన మాటలతో నేను షాక్‌కు గురయ్యాను. 'హీరోలు ఎన్ని సినిమాలు చేయాలో చెప్పడానికి నువ్వెవరు' అన్నాను. ఆయనకు మాట్లాడడం రాదు. నా స్నేహితుడు అయినంత మాత్రాన ఆయన ఏం చేసినా దానికి నేను పూచీ కాదు' అని బదులిచ్చారు.

అందుకే హీరోలతో కలసి థియేటర్ల నిర్మాణం

'మల్టీప్లెక్స్‌ల్లో రెండు సినిమాలు విడుదలైతే ఒకటి ఫ్లాప్ అయినా, ఒకటి హిట్ అవుతుంది. దానికి షోలు పెంచుతాం. సేఫ్ అయిపోతాం. సింగిల్ థియేటర్‌లో వేసిన సినిమా ఫ్లాప్ అయితే ఇక ఏం చేయలేం. అందుకే టాలీవుడ్ అగ్రహీరోలతో కలసి థియేటర్ల నిర్మాణం చేపట్టాం. అది భాగస్వామ్య వ్యాపారం. అందులో తప్పేం ఉంది. ప్రాజెక్ట్‌కి క్రేజ్ వస్తుంది. అలాంటి ఆలోచనతో ఇంకెవరూ వెళ్లలేదు. మేం వెళ్లాం. వాళ్లు ఓకే చేశారు. ఆ స్టార్‌కి కూడా లాభం ఉంటుంది. పైగా ఇలాంటి మల్టీప్లెక్స్‌లు పది కట్టుకుంటే 'ఆ నలుగురు', గుత్తాధిపత్యం లాంటి నిందలు అన్నీ పోతాయి' అన్నారు.

టీనేజర్లు.. వీటికి దూరంగా ఉండాలి!

యుక్తవయసు పిల్లలు పాటించే కొన్ని అలవాట్లే వారి శారీరక, మానసిక సమస్యలకు కారణమని నిపుణులు చెబుతున్నారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. టీనేజర్ల ఆరోగ్యాన్ని పాడుచేసే అలవాట్లు ఏమిటో చూద్దాం...

- చాలామంది టీనేజర్లు.. మొబైల్ చూస్తూ గంటలు గడిపేస్తూ ఉంటారు. దీనివల్ల ఒంటరితనం అలవాటై భావవ్యక్తీకరణ నైపుణ్యం దెబ్బతింటుంది. ఎక్కువ సమయం ఒకేచోట కూర్చుని లేదా పడుకుని ఉండడం వల్ల శారీరక శ్రమ లేక బరువు పెరగవచ్చు. మొబైల్‌ను తదేకంగా చూడడం వల్ల కళ్లు పొడిబారడం, ఎర్రబడడంతోపాటు దృష్టి సమస్యలు వస్తాయి.
- యుక్తవయసు పిల్లలు ఎక్కువగా జంక్ ఫుడ్‌ను ఇష్టపడుతూ ఉంటారు. ప్రాసెస్ చేసిన చిరుతిళ్లు తింటూ చక్కెరలు అధికంగా ఉన్న కూల్‌డ్రింక్స్ తాగేస్తూ ఉంటారు. దీనివల్ల జీర్ణాశయం పనితీరు మందగిస్తుంది. కడుపులో ఆమ్లత్వం పెరుగుతుంది. రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక సమస్యలు వస్తాయి.
- రాత్రిపూట సామాజిక మాధ్యమాలతో గడుపుతూ ఆలస్యంగా నిద్రపోతూ ఉంటారు. దీనివల్ల వారి ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తగ్గుతాయి. చురుకుదనం లోపిస్తుంది. మెదడు పనితీరు కుంటుపడుతుంది. యుక్తవయసు పిల్లలకు కనీసం ఎనిమిది గంటల నిద్ర అత్యవసరం.



- కొంతమంది టీనేజర్లు తరచూ తమను తాము విమర్శించుకుంటూ ఉంటారు. రంగు, రూపురేఖల గురించి మధనపడుతూ ఉంటారు. దీనివల్ల వారిలో ఆత్మ గౌరవం, ఆత్మవిశ్వాసం తగ్గుతాయి. ఆందోళన, నిరాశ పెరుగుతాయి. ఈ విధమైన ధోరణి కాకుండా మంచి వ్యక్తిత్వాన్ని అలవరచుకోవాలి.
- ప్రతి పనినీ వాయిదా వేస్తూ ఉంటారు. దీనివల్ల ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయి. ఎప్పటి పనిని అప్పుడే పూర్తిచేయడం, క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలి.
- ఉదయాన్నే నిద్రలేచి వ్యాయామం చేయడానికి బద్ధకిస్తూ ఉంటారు. దీనివల్ల శారీరక మానసిక ఆరోగ్యం ప్రభావితమవుతుంది. టీనేజర్లు రోజూ కనీసం అరగంటసేపు వ్యాయామం చేయడం మంచిది.
- ఉదయం వేళల్లో అల్పాహారం తీసుకోవడానికి ఇష్టపడరు. దీనివల్ల జీవక్రియలు మందగించడం, పోషకాహార లోపం, రోగనిరోధక శక్తి తగ్గడం లాంటి సమస్యలు వస్తాయి.



మన చుట్టూ నైపుణ్యం ఉన్న మహిళలు అనేక మంది ఉంటారు. వారికి అవకాశాలు లభించటం కష్టమే! అలాంటి వారందరినీ ఒకే చోట చేర్చి.. అవకాశాలు కల్పిస్తే? స్వాతి నీలభట్లకు ఇలాంటి ఆలోచనే వచ్చింది. 'సీతా' అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. నాలుగేళ్ల క్రితం ఆమె ప్రారంభించిన 'షీ జాబ్స్'కు కూడా మంచి ఆదరణ లభిస్తోంది. 'సీతా' మొబైల్ యాప్ విడుదల నేపథ్యంలో స్వాతి తన అనుభవాలను 'నవ్య'తో పంచుకున్నారు.

'సీత'.. మహిళకు భరోసా..



సీతా యాప్ ఆలోచన ఎలా వచ్చిందనే విషయాన్ని వివరించే ముందు- షీ జాబ్స్ పోర్టల్ గురించి కూడా చెప్పాలి. ఈ పోర్టల్ కేవలం మహిళల కోసమే ఉద్దేశించినది. ఐటీలో పనిచేసే మహిళలు కొన్ని సందర్భాలలో ఉద్యోగానికి బ్రేక్ ఇస్తూ ఉంటారు. పిల్లలు పుట్టడం వల్ల కావచ్చు.. ఇంట్లో పెద్ద వాళ్లను చూసుకోవాల్సిన అవసరం వల్ల కావచ్చు.. ఇలా రకరకాల కారణాలు ఉంటాయి. ఒకసారి ఉద్యోగం మానేసిన తర్వాత వారికి మళ్లీ ఉద్యోగం దొరకాలంటే చాలా కష్టం. చాలా సార్లు జాబ్ కన్సల్టెంట్స్ దగ్గరే వీరి అప్లికేషన్లు ఆగిపోతాయి. ఎందుకంటే ఐటీ రంగంలో చాలా పోటీ తత్వం ఉంటుంది. ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీలు వస్తూ ఉంటాయి. ఉద్యోగంలో బ్రేక్ వస్తే వారికి ఈ టెక్నాలజీలు తెలుసా? లేదా అనే అనుమానం కంపెనీ వారికి వస్తూ ఉంటుంది. అందువల్ల జాబ్ బ్రేక్ ఉన్నవారికి ఉద్యోగాలు ఇవ్వటానికి వారు సిద్ధంగా ఉండరు. ఇలాంటి వారందరికీ సాయం చేయటం కోసం నేను కోవిడ్ సమయంలో ఈ పోర్టల్‌ను ప్రారంభించాను. ఈ పోర్టల్‌లో ఉద్యోగం కావాల్సిన వాళ్లు ఎవరైనా అప్లై చేసుకోవచ్చు. ఐటీ కంపెనీల వారు తమ వద్ద ఉన్న ఉద్యోగ అవకాశాలను పోర్టల్‌లో పోస్ట్ చేస్తూ ఉంటారు. ఇదే విధంగా పోర్టల్ తరుపున ఇండియా, అమెరికాలో ఉన్న కంపెనీలకు మేము కూడా అప్లికేషన్లు పంపుతూ ఉంటాం. అంతే కాకుండా మా పోర్టల్‌లో చేరిన వారికి కొత్త టెక్నాలజీలలో శిక్షణ ఇస్తూ ఉంటాం. ఉదాహరణకు ఒక అమ్మాయి ఇంజినీరింగ్ చదివిందనుకుందాం. చదువు పూర్తయిన వెంటనే ఆమెకు పెళ్లి అయిపోయిందనుకుందాం. పిల్లలు పుట్టడం.. వారు పెద్ద వాళ్లు అయ్యేదాకా ఆగటం దాకా ఒక ఐదేళ్ల గ్యాప్ వచ్చిందనుకుందాం. అప్పుడు ఆ అమ్మాయికి కొత్త కొత్త టెక్నాలజీలు తెలియవు. అలాంటి వాళ్లకు శిక్షణ అవసరం అవుతుంది. ఈ శిక్షణ వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇది కేవలం మహిళలను ఉద్దేశించిన పోర్టల్ కాబట్టి.. మహిళా ఉద్యోగుల సంఖ్య పెంచాలనుకొనే కంపెనీలు మా పోర్టల్‌లో ఉన్న అప్లికేషన్లను తీసుకుంటూ ఉంటాయి. ఇలా ఇప్పటి వరకు మా పోర్టల్‌కు సుమారు లక్ష అప్లికేషన్లు వచ్చాయి. వీరిలో చాలా మందికి ఉద్యోగాలు కూడా వచ్చాయి. అయితే ఇది కేవలం ఐటీ.. ఐటీ ఆధారిత టెక్నాలజీలలో పనిచేసే వారికి ఉద్దేశించినది మాత్రమే. కానీ నాకు షీ జాబ్స్ పోర్టల్‌కు అనేక రకాల మెయిల్స్ వచ్చేవి. ఈ మెయిల్స్‌లో కొందరు తాము బాగా పెయింటింగ్ వేస్తామని.. తమకు మేకప్ గురించి తెలుసని.. తమకు ఏవైనా అవకాశాలు లభిస్తాయా అని అడిగేవారు. ఇలాంటి వారందరి కోసం ఒక ఒక ప్రత్యేకమైన యాప్‌ను తయారుచేస్తే బావుంటుందనే ఆలోచన వచ్చింది. ఈ యాప్‌లో మేకప్, డిజైనింగ్, ఫ్యాషన్, రైటింగ్- ఇలా రకరకాల రంగాల్లో నైపుణ్యం ఉన్న మహిళలు తమ అప్లికేషన్లను అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ రంగాల్లో ఉద్యోగాలు లేదా సేవలు అవసరం ఉన్నవారు ఈ యాప్‌కు వెళ్లి తమకు కావాల్సిన వారిని ఎంపిక చేసుకుంటారు. అంటే నైపుణ్యం ఉన్న మహిళలు అందరూ ఒకే చోట కంపెనీల వారికి లభ్యమవుతారు. ఇదే విధంగా మహిళలు ఉద్యోగాల కోసం వేర్వేరు చోట్ల వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు. కేవలం ఉద్యోగాలు మాత్రమే కాదు. తాము అందించే సేవల ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. ఈ యాప్‌కు కూడా మంచి ఆదరణ లభిస్తుందని ఆశిస్తున్నాను.

> ### సమస్యలు అనేకం..
>
> పెద్ద పెద్ద కంపెనీలలో పనిచేసే ఉమెన్ లీడర్స్ నా పోర్టల్‌ను సపోర్టు చేస్తున్నారు. వీరి సహకారం వల్లే నాకు- 'ఎర్నస్ట్ అండ్ యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ విన్నింగ్ ఉమెన్ అవార్డు'.. '100 ఉమెన్ టూ నో ఇన్ అమెరికా' గుర్తింపు వంటివి లభించాయి. ఇక ఐటీ కంపెనీలలో ఉన్నత స్థానాల్లో పనిచేసే మహిళలకు కూడా అనేక సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. సాధారణంగా ఐటీ కంపెనీల్లో ఉన్నత స్థానాల్లో పురుషులే ఎక్కువ మంది ఉంటారు. ఉన్నత స్థానాల్లో 95 మంది పురుషులు.. ఐదుగురు మహిళలు ఉన్నారనుకుందాం. అప్పుడు పురుషులు చెప్పేదే ఎక్కువగా వినబడుతూ ఉంటుంది. అంతే కాదు. ఎవరైనా ఒక మహిళ - ఏదైనా ఒక విషయాన్ని బలంగా చెబితే - "ఈమె చాలా ఎగ్రసివ్.. లేదా ఎమోషనల్" అని ముద్ర వేసేవారు ఉంటారు. వీటన్నింటినీ తట్టుకొని లీడర్‌షిప్ స్థానాల్లోకి ఎదగటం అంత సులభం కాదు.

ఈ ఆలోచన వెనక..

నా జీవితంలో ఎదుర్కొన్న కొన్ని పరిస్థితుల వల్ల నేను 'షీ జాబ్స్'ను, 'సీతా యాప్'ను ప్రారంభించాను. నేను కూడా చాలా మంది అమ్మాయిలలాగే ఇంజినీరింగ్ చదివాను. ఉద్యోగంలో చేరా. ఆ తర్వాత పెళ్లి అయింది. ఒక పిల్లవాడు పుట్టాడు. రెండేళ్లు వచ్చేసరికి.. తనకు ఆటిజం ఉందని తేలింది. మా బాబుకు మంచి వైద్య సదుపాయాలు అందించటం కోసం మేము అమెరికా వెళ్లిపోయాం. ఆ సమయంలో నేను ఒక వైపు ఉద్యోగం చేసే దాన్ని. మరో వైపు బాబును చూసుకొనే దాన్ని. దీనితో నాపై విపరీతమైన ఒత్తిడి ఉండేది. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. సాధారణంగా కంపెనీల్లో ఉద్యోగులకు కొంత వరకు మాత్రమే వెసులుబాటు ఉంటుంది. అంతకు మించి వెసులుబాటు కోసం ప్రయత్నిస్తే ఇబ్బంది అవుతుంది. తోటి ఉద్యోగుల నుంచి కూడా వ్యతిరేకత ఎదురవుతుంది. ఇలాంటి అనేక కారణాల వల్ల నేను ఉద్యోగం మానేసి ఒక సొంత కంపెనీ ప్రారంభించాను. నాలాంటి తల్లులను మరి కొందరిని నా కంపెనీలో ఉద్యోగస్తులుగా తీసుకున్నాను. మేమందరం కలిసి పనిచేయటం వల్ల కంపెనీ పైకి వచ్చింది. కానీ నాలాంటి వారెందరో ఉన్నారు. వారందరికీ అవకాశాలు రాకపోవచ్చు. వారి కోసమే పోర్టల్‌ను.. యాప్‌ను ప్రారంభించాను.

> ### నాన్న ప్రోత్సాహమే!
>
> మా నాన్నగారు దుర్గాప్రసాద్ సీనియర్ జర్నలిస్టు. ఆయన ఆంధ్రజ్యోతిలో పని చేసేవారు. జర్నలిస్టు యూనియన్ లీడర్ కూడా. ఆయన చిన్నప్పటి నుంచి నన్ను స్వేచ్ఛగా పెంచారు. జీవితంలో ఏదో ఒకటి సాధించాలని చెప్పేవారు. ఆయనకు జర్నలిజం అంటే పిచ్చి. ఆంధ్రజ్యోతి పేరిట నన్ను ఇంట్లో జ్యోతి అని పిలిచేవారు. ఆయన ఇప్పుడు లేరు. కానీ నేను పోర్టల్ పెట్టినా.. యాప్ అభివృద్ధి చేసినా, చిన్నప్పటి నుంచి ఆయన ఇచ్చిన ప్రోత్సాహమే కారణం.

సీవీఎల్ఎన్ ప్రసాద్

తలనొప్పి తగ్గేదెలా?

ఒత్తిడి, ఆందోళన, అనవసరమైన ఆలోచనలు, వాతావరణ కాలుష్యం లాంటి కారణాల వల్ల తలనొప్పి రావడం సర్వ సాధారణం. తలనొప్పి అనిపించగానే మందుబిళ్ల మింగకుండా కొన్ని ఇంటి చిట్కాలతో ఉపశమనం పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

- ఒక్కోసారి తీవ్రమైన భావోద్వేగాలు తలనొప్పికి కారణమవుతుంటాయి. అలాంటప్పుడు ధారాళంగా గాలి వీచే ప్రదేశంలో కూర్చుని కళ్లు మూసుకుని శ్వాస మీద ధ్యాస నిలపాలి. ఇలా పావుగంటసేపు చేస్తే ప్రయోజనం కనిపిస్తుంది.
- కొంతమంది పని ధ్యాసలో పడి మంచి నీళ్లు తాగడం మార్చిపోతుంటారు. దీనివల్ల శరీరంలో నీటిశాతం తగ్గి నిర్జలీకరణ తలెత్తుతుంది. ఫలితంగా కళ్లు తిరగడం, తలనొప్పి ప్రారంభమవుతాయి. వెంటనే ఒక గ్లాసు చల్లటి మంచినీరు తాగితే కొంతవరకు ఉపశమనం కలుగుతుంది. దాహం అనిపించ పోయినా గంటకు ఒకసారి నీరు తాగడం మంచిది.



- పలుచని చేతి రుమాలులో కొన్ని ఐస్ ముక్కలు చుట్టి తల మీద, నుదుటి మీద పెట్టుకుంటే తలనొప్పి చాలావరకు తగ్గుతుంది. వేసవికాలంలో ఈ చిట్కా బాగా పనిచేస్తుంది. అదే చలికాలమైతే గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కుంటే ఫలితం కనిపిస్తుంది.
- మాడు మీద, కణతల మీద చేతి వేళ్లతో గుండ్రంగా రుద్దుతూ మెల్లగా మర్దన చేస్తే తలనొప్పి తగ్గిపోతుంది. మంచి నిద్ర కూడా వస్తుంది!
- చిన్న అల్లం ముక్కను నోట్లో వేసుకుని కొద్దికొద్దిగా నములుతూ రసం మింగుతుంటే క్రమంగా తలనొప్పి మాయమవుతుంది.
- మెదడు, కళ్లు, శరీరం అలసిపోయినా కూడా తలనొప్పి వస్తుంది. కాబట్టి వ్యాయామం, అల్పాహారం, భోజనం, నిద్ర సమయానుసారం ఉండేలా చూసుకోవాలి.
- కంటిచూపునకు సంబంధించిన సమస్యలు ఉన్నా తలనొప్పి వస్తుంది. కాబట్టి ఆసుపత్రికి వెళ్లి కంటి పరీక్షలు చేయించుకోవాలి.

ఉపాధికి వారధిగా..



నైపుణ్యం ఉన్నవారికోసం వెతుకులాటలో పరిశ్రమలు... వాటికి తగిన నైపుణ్యాన్ని అందుకోలేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్న యువత.. ఈ అంతరాన్ని తగ్గించడానికి పదిహేడేళ్ళుగా కృషి చేస్తున్నారు శిప్రా శర్మ భుటాని. లక్షమందికి పైగా అట్టడుగువర్గాలవారికి శిక్షణ ఇచ్చి, ఉపాధికి దోహదం చేసిన ఈ జైపూర్ మహిళ... విద్యార్థులకు, పరిశ్రమలకు మధ్య వారధిగా నిలుస్తున్నారు.

"తమ అవసరాలకు తగిన నైపుణ్యం ఉన్నవారు దొరకడం లేదనేది పరిశ్రమల నుంచి నిరంతరం ఎదురవుతున్న ఫిర్యాదు. డిమాండ్ ఉన్నా నిపుణులు దొరకని పనులు అనేకం ఉన్నాయి. టెకీలు, ఇంజనీర్లు, అకౌంటెంట్లు లాంటి వృత్తి నిపుణులనే కాదు... ఇంకా ఎన్నో బాధ్యతలను చక్కగా నెరవేర్చేవారి కోసం సంస్థలు వెతుకుతూ ఉంటాయి. అలాంటి వాటికి అవసరమైన నైపుణ్యాన్ని... అట్టడుగువర్గాల వారికి అందించాలన్న ఆలోచన పదిహేడేళ్ళ క్రితం కలిగింది. దీనికి నేపథ్యం ఏమిటంటే... నాకు పదేళ్ళ వయసున్నప్పుడే మా నాన్న చనిపోయారు. అయిదేళ్ళ తరువాత మా అమ్మ, సోదరుడు కూడా మరణించారు. నేను, నా సంరక్షణలో నా తమ్ముడు మిగిలేం. పదిహేనేళ్ళ వయసులో... నా జీవితానికి అర్థం ఏమిటనే ప్రశ్న తలెత్తింది. తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయాను. కానీ కొద్ది రోజులలోనే దాని నుంచి బయటపడ్డాను. నాకన్నా దుర్భరమైన స్థితిలో బతుకున్నవారెందరో నా చుట్టూ కనిపించారు. ఆర్థికంగా, మానసికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలకోసం, పిల్లలకోసం ఏదైనా చేయాలని అప్పుడే నిశ్చయించుకున్నాను. ఎన్ని ఆటంకాలు ఎదురైనా తట్టుకొని, కష్టపడి చదివాను. ఐఎంఎం-కోల్‌కతాలో సీటు సంపాదించాను. చదువు పూర్తయ్యాక... ఇంజనీరింగ్ లెక్చరర్‌గా చేరాను. ఆ వృత్తిలో నేను పరిశీలించిన ఎన్నో అంశాలు... నేను కొత్త దారిని ఎంచుకొనేలా చేశాయి. విద్యార్థులు డిగ్రీలు సంపాదిస్తున్నా... వారు చేయాల్సిన, చేయాలనుకొనే ఉద్యోగాలకు సరిపడే నైపుణ్యాలు కొరవడుతున్నాయి. ఇది ఏదో ఒక విద్యా సంస్థకే పరిమితమైన సమస్య కాదు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి. తరువాతి తరానికి మంచి ఉద్యోగావకాశాలు రావాలన్నా, తమ తమ వృత్తుల్లో వారు రాణించాలన్నా... దానికి నైపుణ్యాలు తప్పనిసరి. వాటిని పెంపొందించడమే మన ముందున్న అత్యవసర సమస్య అని అర్థమయింది. 2008లో ఉద్యోగం వదిలేసి... మా ఇంటి బేస్‌మెంట్‌లో... నలభై మంది విద్యార్థులతో ప్రాథమిక నైపుణ్య శిక్షణ సంస్థను ప్రారంభించాను.



ఆ డిమాండ్ తీర్చాలని...

ఎవరికి శిక్షణ ఇవ్వాలో, వేటిలో ఇవ్వాలో ఒక ప్రణాళిక నేను ముందే తయారు చేసుకున్నాను. వెనుకబడిన, అణగారిన వర్గాలకు చెందిన పిల్లలు, వీధులు ఊడ్చేవారు, చిన్న చిన్న నేరాలు చేసి జైలుకు వెళ్ళి వచ్చాక ఉపాధి లేనివారు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకు ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్, సెక్యూరిటీ సర్వీసెస్ తదితర వృత్తుల్లో ప్రాథమిక శిక్షణ ఇవ్వడం ప్రారంభించాను. వీటిలో చాలా సేవలు దాదాపు అన్ని సంస్థలకూ అవసరమే. కానీ ఇలాంటి శిక్షణ కల్పించడానికి ఏ సంస్థా చొరవ తీసుకోదు. కానీ ఈ సేవలకు భారీ డిమాండ్ ఉంది. ఆ డిమాండ్ తీర్చడం, తద్వారా పేదలకు ఆసరాగా నిలవడం నా ఆశయం. అలా ఇప్పటివరకూ లక్ష మందికి పైగా నా సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చాను. వారికి నైపుణ్య శిక్షణ కౌన్సిలింగ్, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు సాయం చెయ్యడం... ఇలా వివిధ అంశాల్లో మా సంస్థ సాయపడుతోంది. కొన్ని వందలమంది మా సంస్థ తరఫున పని చేస్తున్నారు. ఇప్పుడు 'కెపాసిటా కనెక్ట్' పేరిట మా కార్యకలాపాలన్నిటినీ ఒకే గొడుగు కిందికి తేవడంతో పాటు... ఇతర అంశాల్లోకి కూడా విస్తరించాం. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్-కార్పొరేట్ సంస్థలకు కూడా సేవలు అందించడం ప్రారంభించాం. రాజస్థాన్ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు డిజిటల్ సాంకేతికతల్లో శిక్షణ ఇవ్వడం కోసం... కిందటి ఏడాది 'రైజింగ్ రాజస్థాన్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'లో రూ. 45 కోట్ల ఒప్పందాన్ని 'కెపాసిటా కనెక్ట్' చేసుకుంది. ఇది మా సంస్థ పురోగతిలో ఒక మైలురాయి.

నైపుణ్యం పెంచడమే మార్గం...

ప్రస్తుతం పేద వర్గాలవారికి శిక్షణతో పాటు ఉద్యోగులకు, విద్యార్థులకు, కార్పొరేట్ సంస్థలకు విద్యాసంస్థలకు సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నాం. కృత్రిమ మేధ, డేటా అనాలిసిస్, సైబర్ సెక్యూరిటీ లాంటి సరికొత్త సాంకేతికతలను కూడా బోధిస్తూ... యువతలో నైపుణ్యాలు పెంచుతున్నాం. మా సంస్థకు 'సిఐఐ ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అవార్డ్' లాంటి పలు పురస్కారాలు లభించాయి. ప్రతిష్ఠాత్మకమైన 'ఫోర్బ్స్ ఇండియా-గ్లోబల్ ఇండియన్ బ్రాండ్స్ అండ్ లీడర్స్ ఎడిషన్'లో... టాటా, మహీంద్రా, బజాజ్, హెచ్‌సిఎల్, బిర్లా లాంటి సంస్థల సరసన చోటు దక్కింది. వ్యక్తిగతంగా 'రాజస్థాన్ ఇండస్ట్రీ ఐకాన్' అవార్డు అందుకున్నాను. 2019లో 'ఫోర్బ్స్ ఇండియా- లీడింగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ జాబితా'లో స్థానం లభించింది. ఇప్పుడు నా దృష్టంతా భారతీయ యువతను డిజిటల్ ఎకానమీ దిశగా సంసిద్ధం చేయడం మీద ఉంది. ఏ దేశ భవిష్యత్తునైనా నిర్దేశించేవి తరగతి గదులేనని నేను నమ్ముతాను. ఎక్కువ మార్కులు సంపాదించడం ఎలాగో మనం పిల్లలకు నేర్పుతున్నాం కానీ ఒక వైఫల్యాన్ని, విషాదాన్ని ఎదుర్కోవడం ఎలాగనేది చెప్పడం లేదు. ఈ ధోరణిలో మార్పు రావాలనేది నా కోరిక. అలాగే ఆర్థిక, సామాజిక స్థితులతో సంబంధం లేకుండా అందరికీ సమానమైన అవకాశాలు లభించాలి. వారిలో నైపుణ్యం పెంచడమే అందుకు మార్గం. దాని కోసమే ఇన్నేళ్ళుగా కృషి చేస్తున్నాను. భవిష్యత్తులో ఆ కృషిని మరింత దీక్షగా కొనసాగిస్తాను."

మృదువైన చేతుల కోసం

గిన్నెలు రుద్దడం, రసాయనాలు ఉంటే సబ్బులు వాడడం వలన చేతులు పొడిబారిపోయి, గరుకుగా ఉంటాయి. కాబట్టి హస్తాలు మృదువుగా మారాలంటే ఏం చేయాలో తెలుసుకుందాం..



- పెరుగు మీద మీగడను తీసుకుని చేతులకి రాసి మసాజ్ చేయాలి. ఇలా తరచూ చేయడం వలన చేతులు మృదువుగా మారతాయి.
- ఒక చెంచా ఆలివ్ నూనెలో, చెంచా నిమ్మరసం, చెంచా గ్లిజరిన్, చెంచా పాలు, రెండు చెంచాల గోధుమ రవ్వ వేసి కలిపి, ఈ మిశ్రమాన్ని చేతులకు రాసి గంట తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి.
- కలబంద గుజ్జును రోజూ చేతులకు రాసుకుని ఓ పావుగంట తర్వాత కడిగేసుకుంటే చేతులు మృదువుగా ఉంటాయి.
- చెంచా దానిమ్మ రసంలో రెండు చెంచాల పంచదార కలిపి చేతులకు రాసి రుద్దాలి. దీని వల్ల చేతులపై ఉన్న మృత కణాలు తొలగిపోయి చేతులు మృదువుగా మారతాయి.
- రోజూ రాత్రి పడుకునే ముందు పెట్రోలియం జెల్‌ను లేదా తేనెను చేతులకు రాసినా హస్తాలు మృదువుగా మారతాయి.
- టేబుల్‌స్పూన్ ఓట్స్‌లో అరటేబుల్ స్పూన్ కొబ్బరి నూనె వేసి కలిపి చేతులకు రాసి మర్దన చేయాలి. అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. తరచూ ఇలా చేయడం వలన మంచి ఫలితం ఉంటుంది.

ఎల్ఐసీ తాత్కాలిక సీఈఓగా సత్ పాల్ భానూ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సీనియర్ అధికారి సత్ పాల్ భానూకు అదనపు బాధ్యతలను అప్పగించారు. కేంద్ర ఆర్థిక సర్వీసుల శాఖ ఈ మేరకు శనివారం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ నియామకం సెప్టెంబరు వరకు అంటే మూడు నెలల పాటు లేదా రెగ్యులర్ సీఈఓ నియామకం జరిగేంత వరకు అమలులో ఉంటుంది. సిద్ధార్థ మోహంతీ పదవీకాలం ముగియడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	550
వరంగల్	542	గోదావరి	530
చిత్తూరు	613	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	107
కర్నూలు	110	నెల్లూరు	112
విశాఖపట్నం	101	అనంతపురం	112
గోదావరి	114		

విమానాల నవీకరణపై రిలయన్స్ ఇన్‌ఫ్రా ఫోకస్

రూ.5,000 కోట్ల వ్యాపార లక్ష్యం



న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ మరో కొత్త వ్యాపారంలోకి ప్రవేశించింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా విమానాలు, హెలికాప్టర్ల ఆధునీకరణ వ్యాపారం చేపట్టింది. వచ్చే 7-10 సంవత్సరాల్లో ఈ కొత్త వ్యాపారం ద్వారా రూ.5,000 కోట్ల ఆదాయం ఆర్జించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఇప్పటికే జెనిసిస్ అనే అమెరికా కంపెనీతో పొత్తు పెట్టుకుని 55 డోర్నియర్-228 విమానాల ఆధునీకరించి రూ.350 కోట్లు సంపాదించింది. వీటి పనితీరుపై భారత వైమానిక, నౌకా దళాలు, తీర ప్రాంత గస్తీ దళాలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేసినట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. మన దేశానికి చెందిన ఒక ప్రైవేటు కంపెనీ సొంతంగా విమానాల ఆధునీకరణ రంగంలోకి ప్రవేశించడం ఇదే మొదటిసారి.

భారీ అవకాశం: సాధారణంగా విమానాలు, హెలికాప్టర్ల జీవిత కాలం 30 నుంచి 40 సంవత్సరాలు. అయితే కాలానికి అనుగుణంగా మధ్యలో వీటిలో ఉండే కీలక పరికరాలను మార్చాల్సి ఉంటుంది. వీటి ఖర్చులు విమానం లేదా హెలికాప్టర్ కొన్న ధర కంటే రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువగా ఉంటాయి. సాధారణంగా వీటిని తయారు చేసే కంపెనీలు లేదా ఎంఆర్ఓ సంస్థలు ఈ పని చేస్తుంటాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సైనిక విమానాలు, హెలికాప్టర్ల ఆధునీకరణ వ్యాపారమే ఏటా రూ.5 లక్షల కోట్ల వరకు ఉంది. వచ్చే ఏడేళ్లలో ఇది రూ.7 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. మన దేశంలోనూ పౌర, సైనిక విమానాలు, హెలికాప్టర్ల సంఖ్య పెరుగుతోంది. ముందు ముందు ఇది పెద్ద వ్యాపార అవకాశం అవుతుందని రిలయన్స్ గ్రూప్ భావిస్తోంది.

వడ్డీరేట్లు తగ్గించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బీఓబీ

న్యూఢిల్లీ: దేశంలో రుణాలపై వడ్డీరేట్ల కోత కొనసాగుతోంది. తాజాగా బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) రెపో ఆధారిత రుణ వడ్డీరేటు (ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్) అర శాతం తగ్గించింది. ఇక నుంచి తన ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్ 8.15 శాతం నుంచి ప్రారంభమవుతుందని బీఓబీ తెలిపింది. ఈ తగ్గింపు శనివారం నుంచే అమలులోకి వచ్చినట్టు పేర్కొంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మాత్రం అదనపు నిధుల సమీకరణ వ్యయం ఆధారంగా వసూలు చేసే వడ్డీరేటును (ఎంసీఎల్ఆర్) మాత్రమే 10 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతానికి సమానం) తగ్గిస్తున్నట్టు ప్రకటించిది. శుక్రవారం ప్రకటించిన ఆర్థిక, ద్రవ్య విధానంలో ఆర్‌బీఐ రెపోరేటు అర శాతం, సీఆర్ఆర్ ఒక శాతం తగ్గించింది. దాంతో బ్యాంకులు వరుస పెట్టి తమ రెపో ఆధారిత రుణాల వడ్డీరేట్లు తగ్గిస్తున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), యూకో బ్యాంకులు ఇప్పటికే వడ్డీరేట్లు తగ్గించాయి.

అదానీ వేతనం రూ. 10.41 కోట్లు

పోటీదారుల కన్నా తక్కువే



న్యూఢిల్లీ: దేశంలో రెండో సంపన్నుడుగా పేరొందిన గౌతమ్ అదానీ ఈ ఏడాది మార్చి 31వ తేదీతో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.10.41 కోట్లు వేతనం తీసుకున్నారు. తన సొంత వ్యాపార విభాగాల కీలక ఎగ్జిక్యూటివ్‌లు, ఇతర పారిశ్రామిక దిగ్గజాలు పొందిన వేతనం కన్నా అదానీ తీసుకున్న వేతనం తక్కువే. తమ వ్యాపార సామ్రాజ్యంలోని 9 లిస్టెడ్ కంపెనీల్లో 2 కంపెనీల నుంచి ఆయన వేతనం పొందినట్టు ఇటీవల అదానీ గ్రూప్ విడుదల చేసిన వార్షిక నివేదికలో తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంపాదించిన రూ.9.26 కోట్లతో పోలిస్తే గత ఏడాది వేతనం 12% అధికం. దేశంలో కుటుంబ యాజమాన్యంలోని వ్యాపార సంస్థల అధిపతుల కన్నా కూడా అదానీ వేతనం తక్కువగా ఉంది. దేశంలో కొవిడ్-19 విజృంభణ తర్వాత అత్యంత సంపన్నుడైన ముకేశ్ అంబానీ తన వేతనం మొత్తం వదులుకున్నారు. అంతకు ముందు ఆయన వేతనం రూ.15 కోట్లుండేది.

ఏటీఆర్ విమానాలకు పెరుగుతున్న గిరాకీ

వచ్చే పదేళ్లలో 300 విమానాలు అవసరం

న్యూఢిల్లీ: ప్రాంతీయ విమానయానం అభివృద్ధితో మన దేశంలో స్వల్పదూరం ప్రయాణించే ఏటీఆర్ విమానాలకు డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుతం ఇండిగో, అలయెన్స్ ఎయిర్, ఫ్లై91 వంటి సంస్థలు ఈ తరహా విమానాలు 70 వరకు వినియోగిస్తున్నాయి. వచ్చే పదేళ్లలో భారత్‌లో 300కు పైగా ఏటీఆర్ విమానాలకు డిమాండ్ ఉంటుందని ఏటీఆర్ కంపెనీ అంచ నా. ఇందుకోసం ఇప్పటికే భారత్‌లోని పలు విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు కంపెనీ ఎండీ పీరే క్లెర్సిన్ చెప్పారు. భారత్‌లో వచ్చే ఐదేళ్లలో కొత్తగా మరో 50 కొత్త విమానాశ్రయాలు రానున్నాయి. దీంతో ప్రాంతీయ విమానయానం మరింత పుంజుకుంటుందని ఏటీఆర్ కంపెనీ భావిస్తోంది.

స్టార్టప్స్‌కు నిబంధనల సంకెళ్లు: మోహన్‌దాస్ పాయ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ స్టార్టప్స్ విధానంపై ఇన్ఫోసిస్ మాజీ డైరెక్టర్/సీఎఫ్ఓ, ఆరిన్ క్యాపిటల్ చైర్మన్ మోహన్‌దాస్ పాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ నియంత్రణలు ఈ రంగానికి పెద్ద గుది బండలా మారాయన్నారు. దీంతో దేశీయ స్టార్టప్స్ తమకు అవసరమైన పెట్టుబడుల్లో 80 శాతం విదేశాల నుంచి సమకూర్చుకోవాల్సి వస్తోందని చెప్పారు. "2014-2024 మధ్య కాలంలో స్టార్టప్స్‌పై చైనా 83,500 కోట్ల డాలర్లు, అమెరికా 2.32 లక్షల కోట్ల డాలర్లు పెట్టుబడిగా పెట్టాయి. మనం కేవలం 16,000 కోట్ల డాలర్లతో సరిపుచ్చాం. మళ్లీ అందులో 80 శాతం నిధులు విదేశాల నుంచి వచ్చాయి. అంటే మన స్థానిక పెట్టుబడులు పెద్దగా లేవని అర్థం" అన్నారు. ఈ కారణం చేతే స్టార్టప్స్ సంఖ్యలో మన దేశం 1.65 లక్షల స్టార్టప్స్‌తో ప్రపంచంలో మూడో స్థానంలో ఉన్నా, నవ కల్పనలు పెద్దగా లేవని మోహన్ దాస్ పాయ్ స్పష్టం చేశారు. ఈ కంపెనీలను ఆదుకునేందుకు ప్రారంభించిన ఫండ్ ఆఫ్ ఫండ్స్ మూల నిధిని ప్రస్తుత రూ.10,000 కోట్ల నుంచి రూ.50,000 కోట్లకు పెంచాలని కోరారు.

టెక్ వ్యూ: 25,000 స్థాయి కీలకం



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో మరింత బలహీనత ప్రదర్శించినా శుక్రవారం బలమైన ర్యాలీ సాధించి చివరికి 25,000 సమీపంలో ముగిసింది. ముందు వారంతో పోల్చితే 250 పాయింట్ల వరకు లాభపడింది. గత నాలుగు వారాలుగా 24,500-25,000 స్థాయిలో సైడ్‌వేస్, కన్సాలిడేషన్ ధోరణిలో ట్రేడయిన అనంతరం గరిష్ఠ స్థాయిల్లో పటిష్ఠంగా ముగిసింది. మిడ్‌క్యాప్ సూచీ 1600 పాయింట్లు, స్మాల్‌క్యాప్ సూచీ 700 పాయింట్ల మేరకు బలమైన ర్యాలీ సాధించాయి. టెక్నికల్‌గా మార్కెట్ ప్రస్తుతం పాజిటివ్ ధోరణిలోనే ఉన్నప్పటికీ ఇటీవల సాధించిన గరిష్ఠ స్థాయి 25,150 కన్నా దిగువనే ఉంది. ఈ కారణంగా ఈ స్థాయిలో పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: ర్యాలీని మరింతగా కొనసాగించాలంటే నిఫ్టీ తప్పనిసరిగా 25,150 కన్నా పైన నిలదొక్కుకోవాలి. పైన ప్రధాన నిరోధ స్థాయిలు 25300, 25500.

బేరిష్ స్థాయిలు: 25000 వద్ద పరీక్షలో విఫలమై అంతకన్నా దిగజారితే అప్రమత్త సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,800. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 24,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ బలమైన ర్యాలీ సాధించి 830 పాయింట్ల లాభంతో 56,580 వద్ద ముగిసింది. మానసిక అవధి 57,000. ఆ పైన మాత్రమే మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది. 56,000 వద్ద రియాక్షన్ ఏర్పడి అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతగా భావించి అప్రమత్తం కావాలి.

పాటర్న్: మార్కెట్ మూడో సారి 25,000 స్థాయిలో పరీక్షకు సమాయత్తం అవుతోంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ మరింతగా కొనసాగాలంటే ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. 25,000 స్థాయిలోనే "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఎదురవుతోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	25,150, 25240
మద్దతు	24,920, 24800

ఈ వారం మరింత ముందుకే...

గత వారం నిఫ్టీ కీలక మద్దతు స్థాయి 25,000 పాయింట్లను అధిగమించడం శుభ పరిణామం. దీంతో ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్ మరింత మెరుగ్గా రాణించే అవకాశం కనిపిస్తోంది. ఆర్‌బీఐ రెపో రేటు, సీఆర్ఆర్ రేట్లు తగ్గించడం, వర్షపాతం మెరుగ్గా ఉంటుందన్న అంచనాలు, దిగొస్తున్న రిటైల్ ద్రవ్యోల్బణం వంటి సానుకూల అంశాలు సెంటిమెంట్‌ను మరింత పెంచుతున్నాయి. ఈ వారం డిఫెన్స్, రైల్వే, ఫైనాన్స్, బ్యాంకింగ్, డిపాజిటరీ సర్వీసెస్, మ్యూచువల్ ఫండ్స్ కంపెనీల షేర్లలో బుల్లిష్‌నెస్ కనిపిస్తోంది.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్: రెండేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ షేర్లలో ప్రస్తుతం మూమెంటం కనిపిస్తోంది. రిలెటివ్ స్ట్రెంత్ కూడా క్రమంగా పెరుగుతోంది. గత మూడు నెలల్లోనే ఈ షేర్లు 23 శాతం పెరిగాయి. కీలకమైన రూ.70 మార్క్‌ను దాటి గత వారం రూ.71.5 వద్ద ముగిశాయి. రూ.84/90 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.68/70 శ్రేణిలో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.65ను గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జిందాల్ స్టెయిన్‌లెస్: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కంపెనీ షేర్లు ప్రస్తుతం అప్‌ట్రెండ్‌లోకి మారే సూచనలు కనిపిస్తున్నాయి. గత రెండు నెలల్లోనే ఈ కంపెనీ షేర్లు దాదాపు 35 శాతం లాభపడ్డాయి. కీలకమైన రూ.650 వద్ద కన్సాలిడేట్ అయ్యాక పుంజుకున్నాయి. గత వారం 3.2 శాతం లాభంతో రూ.694 వద్ద ముగిశాయి. మదుపరులు రూ.820 టార్గెట్‌తో రూ.680 వద్ద ఈ కౌంటర్లో ప్రవేశించవచ్చు. రూ.660 స్టాప్‌లాస్‌ని కచ్చితంగా పాటించాలి.

బజాజ్ ఫైనాన్స్: అప్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కంపెనీ షేర్లలో షార్ట్, మీడియం టర్మ్ మూమెంటం పెరుగుతోంది. గత శుక్రవారం 4.9 శాతం లాభంతో రూ.9,372 వద్ద ముగిశాయి. రూ.9,900 టార్గెట్‌తో మదుపరులు రూ.9,300/9,200 శ్రేణిలో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ రూ.9,150.

శ్రీరామ్ ఫైనాన్స్: ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు అత్యంత బలంగా ఉన్నాయి. గత వారం నెలవారీ గరిష్ఠ స్థాయిని బ్రేక్ చేసింది. పైగా వీసీపీ ప్యాటర్న్ ఫామ్ అవుతోంది. గత శుక్రవారం ఈ కంపెనీ షేర్లు 5.7 శాతం లాభంతో రూ.688 వద్ద ముగిశాయి. మదుపరులు రూ.740/820 టార్గెట్‌తో రూ.680/670 శ్రేణిలో పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.650ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్స్: గత రెండేళ్లుగా ఈ కంపెనీ షేర్లు సైడ్‌వేస్‌లో కన్సాలిడేట్ అవుతున్నాయి. ఇపుడిపుడే మూమెంటం, రిలెటివ్ స్ట్రెంత్, వాల్యూమ్స్ పెరుగుతున్నాయి. కీలకమైన రూ.250 మద్దతు స్థాయిని అధిగమించి గత శుక్రవారం ఐదు శాతం లాభంతో రూ.275 వద్ద ముగిశాయి. రూ.320/345 టార్గెట్‌తో మదుపరులు రూ.270 సమీపంలో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.260ని స్టాప్‌లాస్ పాటించి తీరాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

వైభవంగా రింకూ నిశ్చితార్థం



లఖ్‌నవూ: క్రికెటర్ రింకూ సింగ్, సమాజ్‌వాదీ పార్టీ యువ ఎంపీ ప్రియా సరోజ్ నిశ్చితార్థం ఆదివారం ఇక్కడ జరిగింది. ఓ హోటల్‌లో అత్యంత వైభవంగా జరిగిన ఈ వేడుకలో ఓ భావోద్వేగ సన్నివేశం చోటుచేసుకుంది. తన చేతికి రింకూ సింగ్ నిశ్చితార్థ ఉంగరం తొడుగుతున్న సమయంలో ప్రియా సరోజ్ తీవ్ర భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టుకోవడం కనిపించింది. ఆ భావోద్వేగం నుంచి బయటపడేందుకు ఆమెకు కొంచెం సమయం పట్టింది. తేరుకున్న ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్న రింకూ సింగ్..ఇద్దరి చేతులను పైకెత్తాడు. అంగరంగ వైభవంగా జరిగిన రింకూ-ప్రియా ఎంగేజ్‌మెంట్‌కు క్రికెటర్లు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. వీరిలో సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, ఎంపీలు జయాబచ్చన్, డింపుల్ యాదవ్, ప్రొఫెసర్ రాంగోపాల్ యాదవ్, కాంగ్రెస్ నేత రాజీవ్ శుక్లా, క్రికెటర్లు ప్రవీణ్ కుమార్, పియూష్ చావ్లా, యూపీ రంజీ జట్టు కెప్టెన్ ఆర్యన్ జుయల్ ఉన్నారు.

టీమిండియా ప్రాక్టీస్ ప్రారంభం

లండన్: ఇంగ్లండ్ జట్టుతో ఐదు టెస్ట్‌ల సుదీర్ఘ సిరీస్‌కు భారత జట్టు సన్నాహకాలు ప్రారంభించింది. శనివారం ఇక్కడకు చేరుకున్న శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా మరుసటి రోజే సాధన మొదలు పెట్టింది. పేసర్లు బుమ్రా, ప్రసిద్ధ్, సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, కెప్టెన్ గిల్, వైస్-కెప్టెన్ పంత్, ఆల్‌రౌండర్ జడేజా ఆదివారం ప్రాక్టీస్ చేశారు. కోచ్ గంభీర్ సాధన ఆసాంతం పర్యవేక్షించాడు. భారత టెస్ట్ జట్టులోని ఇతర సభ్యులు..ఇండియా 'ఎ' పర్యటనలో భాగంగా ఇప్పటికే ఇంగ్లండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్ లయన్స్‌తో 'ఎ' జట్టు రెండో అనధికార టెస్ట్‌లో తలపడుతోంది. ఇక..భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య తొలి టెస్ట్ ఈనెల 20న హెడింగ్లీలో ప్రారంభం కానుంది.

టెస్ట్ సిరీస్ టిక్కెట్లు.. హాట్ కేకులు

భారత్-ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌కు టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ఐదు టెస్టులకు టిక్కెట్లు దాదాపు అమ్ముడయ్యాయట. హెడింగ్లీలో జరిగే తొలి టెస్ట్, ఎడ్జ్‌బాస్టన్ ఆతిథ్యమిచ్చే రెండో టెస్ట్ నాలుగో రోజు ఆటకు సంబంధించిన టిక్కెట్లు మాత్రమే..అదీ కొద్ది సంఖ్యలో అందుబాటులో ఉన్నాయట.

అదరగొట్టిన భారత అథ్లెట్లు

చివరి రోజు ఆరు స్వర్ణాలు

తైవాన్ ఇంటర్నేషనల్ మీట్



అన్నూరాణి



విత్య

తైపీ సిటీ: తైవాన్ ఓపెన్ ఇంటర్నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ రెండో రోజూ భారత క్రీడాకారులు అదరగొట్టారు. తొలి రోజు ఆరు పసిడి పతకాలు కొల్లగొట్టిన మనోళ్లు..ఆదివారం మరో ఆరు స్వర్ణాలు సొంతం చేసుకొన్నారు. చివరి రోజు.. జాతీయ చాంపియన్ విత్య రామ్‌రాజ్, రోహిత్ యాదవ్, పూజ, కృష్ణకుమార్, అన్నూరాణి, పురుషుల 4×400 మీటర్ల రిలే జట్టు పసిడి పతకాలు దక్కించుకున్నాయి. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లో పాలాక్ష (42.22సె.) వ్యక్తిగత అత్యుత్తమ టైమింగ్‌తో రజతం నెగ్గాడు. మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో విత్య (56.53 సె.) చాంపియన్‌గా నిలిచింది. పురుషుల జావెలిన్ త్రోలో రోహిత్ యాదవ్ (74.42మీ.) టైటిల్ అందుకున్నాడు. మహిళ 800మీ. పరుగు ఫైనల్లో పూజ (2:02.79 సె.) మీట్ రికార్డుతో విజేతగా నిలిచింది. భారత్‌కే చెందిన ట్వింకిల్ చౌధరి రజతం నెగ్గింది. పురుషుల 800 మీటర్ల పరుగు ఫైనల్లో కృషన్ కుమార్ (1:48.46సె.) అగ్రస్థానం చేజిక్కించుకున్నాడు. మహిళల జావెలిన్ త్రోలో 56.82మీ. దూరం ఈటెను విసిరిన అన్నూరాణి టైటిల్ దక్కించుకుంది. పురుషుల 4×400 మీ. రిలేలో సంతోష్, విశాల్, ధరమ్‌వీర్, మనుతో కూడిన భారత బృందం (3:05.58సె.) మీట్ రికార్డుతో టైటిల్ కైవసం చేసుకుంది. మహిళల లాంగ్‌జంప్‌లో శైలీసింగ్ (6.41మీ.) రజతం, అన్సీ సోజన్ (6.39మీ.) కాంస్య పతకం గెలుపొందారు.

ఇంగ్లండ్‌దే సిరీస్

రెండో టీ20లోనూ వెస్టిండీస్ ఓటమి

బ్రిస్టల్: వెస్టిండీస్‌తో మూడు టీ20ల సిరీస్‌ను ఇంగ్లండ్ మరో మ్యాచ్ మిగిలుండగానే సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన రెండో టీ20లో ఆతిథ్య జట్టు నాలుగు వికెట్లతో నెగ్గింది. మొదట వెస్టిండీస్ 20 ఓవర్లలో 196/6 స్కోరు చేసింది. కెప్టెన్ హోప్ (49), చార్లెస్ (47), పొవెల్ (34) రాణించారు. ల్యూక్ ఉడ్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఇంగ్లండ్ 18.3 ఓవర్లలో 199/6 స్కోరు చేసి గెలుపొందింది. బట్లర్ (47), కెప్టెన్ బ్రూక్ (34), డకెట్ (30), బాంటన్ (30 నాటౌట్) తలో చేయి వేశారు. అల్జారి జోసెఫ్ రెండు వికెట్లు తీశాడు.

స్పోర్ట్స్

వారెవ్వా.. ఏం గెలిచాడు!

5 గంటలా 29 నిమిషాల ఫైనల్..

సూపర్ టైబ్రేక్‌లో అల్కారజ్ విజయం

స్పెయిన్ స్టార్ ఖాతాలో రెండో ఫ్రెంచ్ ఓపెన్

పోరాడి ఓడిన సినర్

వారెవ్వా ఏం మ్యాచ్.. అల్కారజ్-సిన్నర్‌ల మధ్య జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టేలా చేసింది. ఎవరిది పైచేయో తేల్చుకునేందుకు ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా ఐదు గంటల 29 నిమిషాల పాటు కొదమ సింహాల్లా తలపడిన ఈ వరల్డ్ టాప్-2 ఆటగాళ్లు సరికొత్త రికార్డు నెలకొల్పారు. ఎన్నెన్నో మలుపుల మధ్య.. ఒకరి గెలుపు అవకాశాలను మరొకరు అడ్డుకుంటూ సాగించిన ఉత్కంఠ సమరంలో చివరకు 21 ఏళ్ల అల్కారజ్ మట్టి కోట రారాజుగా టైటిల్‌ను కాపాడుకున్నాడు.





పారిస్: ఉత్కంఠభరితంగా సాగిన ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో నయా స్పెయిన్ బుల్ కార్లోస్ అల్కారజ్ పైచేయి సాధించాడు. ఆదివారం నువ్వా.. నేనా? అనే రీతిలో సాగిన ఈ తుది పోరులో అల్కారజ్ 4-6, 6-7(4-7), 6-4, 7-6(7-3), 7-6 (10-2)తో వరల్డ్ నెంబర్1 జానిక్ సిన్నర్ (ఇటలీ)ని ఓడించి ఇక్కడ రెండోసారి చాంపియన్‌గా నిలిచాడు. గతేడాది ఇక్కడ టైటిల్ నెగ్గే క్రమంలో సెమీస్‌లో సిన్నర్‌ను ఓడించిన అల్కారజ్.. ఈమారు తుదిపోరులోనూ అంతేస్థాయిలో విజృంభించాడు. అల్కారజ్‌కు ఇది ఐదో గ్రాండ్‌స్లామ్. గతంలో రెండుసార్లు వింబుల్డన్ (2023, 24), ఓసారి యూఎస్ ఓపెన్ (2022) నెగ్గాడు.

తొలి రెండు సెట్లు గెలిచి..: ఇద్దరు యువ ఆటగాళ్లే కావడంతో ఒక్కో పాయింట్ కోసం పట్టు వదలకుండా కోర్టులో చిరుతలా కదిలారు. దీంతో తొలి గేమ్ ముగిసేందుకే 12 నిమిషాలు పట్టింది. సిన్నర్ 1-0తో సర్వీస్ కాపాడుకుని శుభారంభం చేయగా.. అటు ప్రేక్షకులు భారీ మద్దతు పలికిన అల్కారజ్ తొలి బ్రేక్ పాయింట్ సాధించి 3-2తో ఆధిక్యం చూపాడు. ఆ తర్వాత సిన్నర్ ఆరో గేమ్‌ను బ్రేక్ చేసి, ఏడో గేమ్‌లో సర్వీస్ కాపాడుకోవడంతో 4-3తో నిలిచాడు. అదే ఊపులో మరో బ్రేక్ పాయింట్‌తో 6-4తో సెట్‌ను సైతం దక్కించుకున్నాడు. ఇక రెండో సెట్‌లో సిన్నర్ పదునైన సర్వీస్, బేస్‌లైన్ ఆటతీరుతో 4-1తో దూసుకెళ్లాడు. అయితే అల్కారజ్ తొమ్మిదో గేమ్‌ను బ్రేక్ చేసి, ఆ తర్వాత సర్వీస్ కాపాడుకుని 5-5 స్కోరుతో ఆసక్తిగా మార్చాడు. ఇద్దరి పట్టుదల కారణంగా సెట్ టైబ్రేక్‌కు వెళ్లినా సిన్నర్ 7-6తో ముగించాడు. మూడో గేమ్‌లో అల్కారజ్ మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. మొదటే తన సర్వీస్‌ను కోల్పోయినా వరుసగా మూడు పాయింట్లతో ఆధిక్యం చూపాడు. ఎలాంటి తడబాటు లేకుండా ఆడి పదో గేమ్‌ను ఫోర్‌హ్యాండ్ విన్నర్‌తో బ్రేక్ చేసి పోటీలో నిలిచాడు. దీంతో సిన్నర్ 31 వరుస గ్రాండ్‌స్లామ్స్ సెట్‌ల విజయానికి బ్రేక్ పడింది.

మూడు మ్యాచ్ పాయింట్లను కాచుకుని...: మరోవైపు గంటా ఏడు నిమిషాల పాటు సాగిన నాలుగో సెట్‌లో ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలుపుకుంటూ ముందుకు సాగారు. ఏడో గేమ్‌ను సిన్నర్ బ్రేక్ చేసిన తర్వాత సర్వీస్ కాపాడుకుని 5-3తో పైచేయి సాధించాడు. కానీ తొమ్మిదో గేమ్‌లో ప్రత్యర్థి అల్కారజ్ మూడు చాంపియన్‌షిప్ పాయింట్లను కాచుకోవడం విశేషం. ఈ కీలక సమయంలో పుంజుకున్న అతడు బ్రేక్‌తో పాటు వరుస మూడు పాయింట్లతో 6-5కు వెళ్లడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. కానీ 12వ గేమ్‌లో బ్రేక్ పాయింట్‌తో సిన్నర్ టైబ్రేక్‌కు వెళ్లినా.. ఈ సెట్‌ను 7-6తో అల్కారజ్ నెగ్గాడు. నిర్ణాయక ఐదో సెట్‌ను అల్కారజ్ బ్రేక్ పాయింట్‌తో ఆరంభించాడు. అనంతరం పదో గేమ్‌లో ప్రత్యర్థి చాంపియన్‌షిప్ సర్వీస్‌ను బ్రేక్ చేసి, తర్వాత మరో పాయింట్‌తో సిన్నర్ 6-5తో పోటీలోకి వచ్చాడు. కానీ సిన్నర్ సర్వీస్‌ను బ్రేక్ చేసి అల్కారజ్ టైబ్రేక్‌కు తీసుకెళ్లాడు. ఇక్కడ ఒత్తిడికి లోనుకాకుండా వరుస పాయింట్లతో అల్కారజ్ 7-6 (10-2)తో మ్యాచ్‌ను ముగించాడు.

1 ఫ్రెంచ్ ఓపెన్‌లో అత్యంత సుదీర్ఘంగా (5 గంటల 29 నిమిషాలు) సాగిన ఫైనల్ మ్యాచ్ ఇదే. కాగా, ఓవరాల్ గ్రాండ్‌స్లామ్స్‌లో సుదీర్ఘంగా సాగిన రెండో ఫైనల్ ఇది. 2012లో జొకోవిచ్-నడాల్ మధ్య ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ 5 గంటలా 53 నిమిషాల పాటు సాగింది.

రాహుల్, అభిమన్యు అర్ధ శతకాలు

- భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్ 163/4
- లయన్స్ తొలి ఇన్నింగ్స్ 327 ఆలౌట్
- నాలుగు వికెట్లతో చెలరేగిన ఖలీల్



ఖలీల్ (4/70)

నార్తాంప్టన్: ఇంగ్లండ్‌తో మొదటి టెస్ట్‌కు ఓపెనర్ రేస్‌లో నిలిచిన కేఎల్ రాహుల్ మరోసారి సత్తా చాటాడు. ఇంగ్లండ్ లయన్స్‌తో రెండో అనధికార టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో శతక్కొట్టిన రాహుల్..రెండో ఇన్నింగ్స్‌లోనూ భళా అనిపించాడు. రాహుల్ (51), కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (80) అర్ధ శతకాలతో మెరవడంతో రెండో ఇన్నింగ్స్‌లో ఆదివారం ఆఖరికి భారత్ 'ఎ' 163/4 స్కోరు చేసింది. రాహుల్, ఈశ్వరన్ రెండో వికెట్‌కు 88 పరుగులు జోడించారు. క్రిస్ వోక్స్ రెండు వికెట్లు పడగొట్టాడు. కాగా..మొదటి ఇన్నింగ్స్‌లో లభించిన 21 పరుగులతో కలిపి..భారత్ 'ఎ' మొత్తం 184 రన్స్ ఆధిక్యంలో నిలిచింది. పర్యాటక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 348 రన్స్ చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 192/3తో మూడో రోజు..మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ లయన్స్ 327 పరుగులకు ఆలౌటైంది. పేసర్ ఖలీల్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో (4/70) ప్రత్యర్థి బ్యాటర్ల పనిబట్టాడు.

ఎర్రాని జోడీకి డబుల్స్ టైటిల్



ఒలింపిక్ చాంపియన్ సారా ఎర్రాని-పవోలిని (ఇటలీ) ఫ్రెంచ్ ఓపెన్ మహిళల డబుల్స్‌లో తొలిసారి చాంపియన్‌గా నిలిచారు. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో వారు 6-4, 2-6, 6-1 తేడాతో అన్నా డానిలినా (కజక్)-అలెక్సాండ్రా క్రూనిక్ (సెర్బియా)పై నెగ్గారు. కాగా, ఇదే టోర్నీలో రెండ్రోజుల క్రితం మిక్స్‌డ్ విభాగంలో విజేతగా నిలిచిన ఎర్రాని.. తాజాగా మహిళల డబుల్స్ ట్రోఫీతో 'డబుల్' అందుకుంది.

ఆర్సీ.ఏ.129/2025 తేది:08.06.2025.

ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు, కావలి

పత్రికా ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, గుడ్లూరు మండలం, చేవూరు గ్రామంలో**1509.035** యకరముల భూమిని ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు, మంగళగిరి వారు పారిశ్రామిక కూడలి స్థాపించుట కొరకు భూములు అవసరమని భావించి, భూసేకరణ చట్టం,2013 లోని సెక్షన్ 19(1) అనుసరించి, నెల్లూరు జిల్లా గజిట్ నెం.196 తేది 19.10.2023 మరియు గజిట్ నెం.214 తేది 07.11.2023 ప్రకారం శ్రీయుత జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వారు **డిక్లరేషన్ (రూఢి ప్రకటనలు)** జారీ చేయడం జరిగింది. తదనంతరం చట్టములోని సెక్షన్ 21(2) ప్రకారం విచారణ జరిపి భూ సేకరణ అవార్డును కూడా ప్రకటించడమైనది.మరియు 325 యకరముల భూమినిఫారం-C నోటిఫికేషన్ ద్వారా భూ సేకరణ ప్రక్రియ చేపట్టడం జరిగినది.

అయితే,**324.7122** యకరముల భూమికి సంబంధించిన యజమానులు సెక్షన్ 21(2) ప్రకారం జారీ చేసిన నోటీసుననుసరించి విచారణకు రాకుండా వారి భూములకు సంబంధించిన స్వాధీన హక్కు/అనుభవ పత్రాలను దాఖలు చేయలేదు.

కావున ఈ దిగువ చూపబడిన భూములకు సంబంధించిన యజమానులు, తమ స్వాధీన హక్కు/అనుభవ పత్రాలతో **తేది 12.06.2025 గురువారం లోపుగా చేవూరు గ్రామ సచివాలయంలో** నియమించబడిన సర్వే టీము అధికారులకు అందజేయవలసినదిగా కోరడమైనది. ఇది చివరి అవకాశంగా భావించి సద్వినియోగ పరచు కొనవల సినదిగా కోరడమైనది. అట్లు కానియెడల, వీరి భూములకు సంబంధించిన నష్ట పరిహారమును చట్టము లోని సెక్షన్ 77(2) ప్రకారం **L.A.R&R అథారిటీ కోర్టు, విజయవాడ** నందు జమచేయబడునని ఇందుమూ లముగా తెలియజేయడమైనది.

పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల జాబితా భూసేకరణ చేవూరు గ్రామం పాత అవార్డులు

వరుస సంఖ్య	సర్వే నెం.	విస్తీర్ణం	భూమి యజమాని/రైతు పేరు
1	1	0.5700	గోల్లపోలు సుబ్బరామయ్య (చెంచు రామయ్య)
2	2	0.1800	ఇతరులు (గొల్లపోలుమాల్యాద్రి)
3	4	0.0500	రాయణి బక్కయ్య (సుబ్బయ్య)
4	4		మద్దూరి వెంకట శివయ్య (సుబ్బయ్య)
5	4		ఇతరులు
6	6	0.2700	ఇతరులు
7	6	0.6400	నల్లవుల హైమారావు (సోమయ్య)
8	6	0.3800	నల్లవులహైమారావు (సోమయ్య)
9	6	0.6500	నల్లవులహైమారావు (సోమయ్య)
10	7	1.3050	ఇతరులు
11	7	0.6100	నల్లవుల కృష్ణకుమారి (హైమా రావు)
12	7	0.7450	నల్లవుల హైమారావు (సోమయ్య)
13	10	0.4000	ప్రళయకావేరి పర్వతాయ (యర్రా పోలయ్య)
18	10	0.1025	ఇతరులు
19	11	1.0100	యన్నాబత్తిన సుబ్బారావు (నరసింహం)
20			ఇతరులు
21	12	0.7210	ప్రళయకావేరి పరవతమ్మ (యర్రా పోలయ్య)
22			ఇతరులు
23	13	0.2650	మిరియం రమణయ్య (వెంకట సుబ్బయ్య)
24			మిరియం శేషయ్య (రమణయ్య)
25			మిరియం వెంకటేశ్వర్లు (రమణయ్య)
26			మిరియం కోటేశ్వరరావు (రమణయ్య)
28			ఇతరులు
29	15	0.0855	ఇతరులు
30	17	0.1100	పొంకం ప్రభాకర్ (తిరుపాలు)
31	19-3	0.58	మారెబోయిన వెంకటేశ్వర్లు (బలరామయ్య)
32	20-1	0.2500	చీకుర్తి పద్మావతి (బాలయ్య)
33	20-1C	0.33	మారెబోయిన వెంకటేశ్వర్లు (బలరామయ్య)
34	20-2	1.9225	ఇతరులు
35	20-2	0.5000	తోడేటి శ్రీనివాసులు (సంజీవయ్య)
36	28	0.5520	ఇతరులు
37	28	0.3500	వేల్పుల కలగమ్మ (యర్రయ్య)
38	29	0.2325	ఇతరులు
39	32	0.0200	ఇతరులు
40	33	2.9000	ఇతరులు (కామంచి తిరుపతి)
41	33	0.6800	ఇతరులు (దాడే నరసింగరావు & బుర్రిరత్నమ్మ
42	36-1	1.0000	ఇతరులు
43	36-2	1.0200	మల్లెబోయిన పుష్పవతి (తిరుపతి స్వామి)
44	36-2	1.2000	ఇతరులు
45	37	2.0800	శ్రీ బండ్లమాంబ దేవి
46	39	0.3300	ఇతరులు (శ్రీ బండ్లమాంబ)
47	39	0.2000	బిట్రగుంట వెంకటరమణయ్య (రాఘవరాజు)
48	40	2.0000	బిట్రగుంట వెంకటరమణయ్య (రాఘవరాజు)
49	40	0.6800	శ్రీ బండ్లమాంబ దేవి
50	41	0.9700	బిట్రగుంట వెంకటరమణయ్య (రాఘవరాజు)
51	41	0.9700	శ్రీ బండ్లమాంబ దేవి
52	42	1.4800	ఇతరులు
54	45	0.0100	ఇతరులు
56	46	0.3250	ఇతరులు
57	48	0.7900	ఇతరులు (నల్లవులవెంకటేశ్వర్లు ఏసీ 0.39 & అవుల వెంకటేశ్వర్లు 0.30
58	49	0.4737	ఇతరులు
59	55	0.0300	ఇతరులు
60	63-2	0.0100	ఇతరులు
61	64	0.5000	ఇతరులు (నక్కల హరికృష్ణ)
62	64	0.5700	సమాధిచినానియా
63	64	0.5700	సమాధిప్రభాకర్
64	67	0.0300	ఇతరులు
65	68	0.4700	ఇతరులు (కామతం భారతి)
66	68	0.6200	కమటం వెంకటప్రసాద్ (శ్రీనివాసులు)
67	70	1.0000	కమటం కుమారస్వామి (శ్రీనివాసులు)
69	70	0.4000	కమటం వెంకటప్రసాద్ (శ్రీనివాసులు)
70	71	0.3800	ఇతరులు
71	74	0.0025	నక్కల సింహాద్రి (సుధాకర్)
72	83	0.4800	ఏపూరి రమణయ్య (రోషయ్య)
73	83	1.3900	ఏపూరి మురళి బాబు (రామయ్య)
74	83	1.0150	పిగిలి సుప్రజ (రామకృష్ణ)
75	84	1.4400	మిరియం కోటేశ్వరరావు (బాలకోటయ్య)
76	85	0.1100	ఇతరులు
77	85	0.7600	మిరియం కోటేశ్వరరావు (బాలకోటయ్య)
78	86	0.0900	ఇతరులు
79	87	0.2300	ఇతరులు (గొల్లపోలు సుబ్బారావు)
80	89	0.0950	బిట్రగుంటవెంకట రమణయ్య (వెంకమరాజు)
81	89	1.3900	మిరియం పేరయ్య (చినసుబ్బయ్య)
82	89	0.1900	మిరియం కోటేశ్వరరావు (బాలకోటయ్య)
83	91-1	2.4300	శ్రీ బండ్లమాంబ దేవి
84	91-2	0.9600	శ్రీ బండ్లమాంబ దేవి
85	92	0.5700	ఇతరులు
86	94	0.3200	శ్రీ బండ్లమాంబ దేవి
87	95	0.2400	నక్కల వెంకటేశ్వర్లు (వెంకట సుబ్బయ్య)
88	95	0.1500	నక్కల యలమందయ్య (చిన సుబ్బయ్య)
89	95	0.7500	ఇతరులు
91	97	1.2000	మల్లెబోయిన పుష్పవతి (తిరుపతి స్వామి)
92	97	1.2000	వేల్పుల పద్మావతి (అంకమ్మరావు)
94	97	0.1400	పొలుగంగు ప్రమీల (పొలుగంగు శ్రీనివాసులు)
95	97	0.4300	బలికిరి కొండలరావు (సుబ్బరాయుడు)
96	97	0.4400	బలికిరి సుబ్రమణ్యం (సుబ్బరాయుడు)
97	97	0.4900	ఇతరులు
98	97	1.3600	బలికిరి నాగేంద్రబాబు (సుబ్బరాయుడు)
99	98	0.8000	గోల్లపోలు సుబ్బారావు (నాగేశ్వర రావు)
100	100	2.9500	గొల్లపోలు చెంచులు (శేషయ్య)
101	100	0.7200	నక్కల వెంకటేశ్వర్లు (వెంకట సుబ్బయ్య)
102	100	1.0000	మిరియం కోటేశ్వరరావు (బాలకోటయ్య)
103	100	0.3500	మిరియం పేరయ్య (చినసుబ్బయ్య)
104	100	2.3800	ఇతరులు
105	102	0.1000	ఇతరులు
106	103	0.4900	ఇతరులు
107	103	1.1000	మిరియం కోటేశ్వరరావు (బాలకోటయ్య)
108	104-1	0.1350	నల్లపుల చెంచమ్మ (సుబ్బరాయుడు)
109	104-1	0.9850	ఇతరులు
111	104-1	0.5000	మిరియం కోటేశ్వరరావు (బాలకోటయ్య)
112	104-2	0.5700	నల్లవుల చెంచమ్మ (వెంకటసుబ్బయ్య)
113	104-2	0.2700	ఇతరులు
114	104-2	0.4800	మిరియం కోటేశ్వరరావు (బాలకోటయ్య)
115	117	1.00	మారెబోయిన వెంకటేశ్వర్లు (బలరామయ్య)
116	118-1	0.8100	ఇతరులు
116	122	0.0550	ఇతరులు
117	123	0.8900	నక్కల శ్రీనివాసులు (వెంకయ్య)
118	123	0.9700	నక్కల రామనయ్య (వెంకయ్య)
119	123	1.7100	నక్కల వేంకట సుబ్బమ్మ (బాల కృష్ణ)
120	123	0.9500	నక్కల కృష్ణ (రామనయ్య)
121	124	0.6200	ఇతరులు (పందిళ్ల లక్ష్మమ్మ & పందిల రమణమ్మ)
122	127	0.0050	నక్కల సింహాద్రి (సుధాకర్)
123	132	0.0200	ఇతరులు
124	137	3.6900	నూతలపాటి కోటపనాయుడు (కొండయ్య)
125	138	1.3200	నూతలపాటి కోటపనాయుడు (కొండయ్య)
126	140-2	0.9000	మోడేపల్లి మనోజ్ కుమార్ (కోటేశ్వరరావు)
127	140-2	0.5800	మోడేపల్లి శ్రీహర్ష (హరిబాబు)
128	148	0.0200	ఇతరులు
129	150	0.4100	తోడేటి పద్మావతి (వెంకట నారాయణ)
130	151	0.1200	ఇతరులు (పోలుగంగు సునీత)
131	151	0.7100	చీకుర్తి పద్మావతి (బాలయ్య)
132	152	1.01	ఇతరులు (ఎందేటి మహేష్)
133	162	1.3300	బిట్రగుంట వెంకటరమణయ్య (రాఘవరాజు)
134	162	1.3200	శ్రీ బండ్లమాంబ దేవి
135	163	2.3600	జాలాది పద్మావతి (వెంకటేశ్వరరావు)
137	163	2.3700	బిట్రగుంట వెంకటరమణయ్య (రాఘవరాజు)
138	163	4.7200	శ్రీ బండ్లమాంబ దేవి
139	164	2.5600	ఇతరులు
140	164	2.5500	ఇతరులు (సమాధి చిన్నయ్య 0.57
141	167	0.3200	ఇతరులు
142	174-1	0.3375	ఇతరులు
143	191	0.0300	ఇతరులు
424	195	0.0200	ఇతరులు
145	201-4	0.0400	రాయని పాపరావు (కేతయ్య)
146	201-7	0.1400	తోడేటి రామన్న (కృష్ణయ్య)
147	212	0.5300	రాయని యానాది (సుబ్బయ్య)
148	217	0.2350	రాయణి సుబ్బారావు (చెంచయ్య)
149	217	0.0600	నక్కల మల్లిఖార్జున (వెంకట సుబ్బయ్య)
150	217	0.0700	నక్కల రామకృష్ణ (వెంకట సుబ్బయ్య)
151	217	0.0700	నక్కల శివయ్య (వెంకట సుబ్బయ్య)
152	217	1.32	ఇతరులు
153	243	0.2400	పాపనబోయిన అన్నపూర్ణ (చెంచయ్య)
154	250	0.0350	ఇతరులు
155	250	0.4000	తోడేటి శ్రీరాములు (నారయ్య)
156	260	1.8800	నూతలపాటి విజయబాబు (వెంకట శేషయ్య)
157	262-1	0.5500	పాలకీర్తి మాలకొండయ్య (వెంకటయ్య)
158	262-1	0.0700	ఇతరులు
159	262-1	0.0550	మాచేపల్లికోటేశ్వరమ్మ (చెంచయ్య)
160	262-2	0.3700	ఇతరులు (మొగిలి వెంకటేశ్వర్లు
161	263-2	0.0200	కామంచి సుబ్బయ్య (చిన కోటయ్య)
162	266	1.3000	నూతలపాటి కోటపనాయుడు (కొండయ్య)
163	266	0.8000	నూతలపాటి కోటపనాయుడు (కొండయ్య)
164	267	0.3800	నూతలపాటి కోటపనాయుడు (కొండయ్య)
165	268	0.5900	నూతలపాటి కోటపనాయుడు (కొండయ్య)
166	268	0.6700	మోడేపల్లి హరిబాబు (చిన కొండయ్య)
167	270-1	0.8000	చేవూరు ఇస్సాకు (వెంకట సుబ్బయ్య)
168	270-1	0.1700	చేవూరు చిన్న కొండయ్య (ముసలయ్య)
169	273-2A	0.1200	మనం సుధాకర్ (యలమందయ్య)
170	275	0.0400	ఇతరులు
171	276	0.9200	ఇతరులు
172	282-1	0.0700	ఇతరులు
173	293	0.1700	నక్కల శ్రీనివాస్ (రమణయ్య)
174	296	0.4850	ముదసల శేషమ్మ (వెంకయ్య)
175	298	0.0600	పొట్లూరి శ్రీనివాసులు (గురవయ్య)
176	299	0.7250	ఇతరులు(రాయనిసుబ్రమణ్యం S/o పిట్చుహైా)
177	305	0.3500	ఇతరులు
178	306	0.6300	ఇతరులు (నక్కలకోటేశ్వరులు AC 0.20
179	309-1	0.5000	నక్కల శేషయ్య (సుబ్బరావు)
180	310	0.03	నక్కల శేషయ్య (సుబ్బారావు)
181	312	0.2000	కామంచి అబ్బులు (వెంకయ్య)
182	328	0.0300	ఇతరులు
183	331	1.00	నక్కల శేషయ్య (సుబ్బారావు)
184	333	0.3600	ఇతరులు (కామంచి రమణమ్మ W/o దుగ్గయ్య)
185	337	0.3250	నూతలపాటి కోటపనాయుడు (కొండయ్య)
186	338	0.0500	ఇతరులు (యల్లాంటి అంకమ్మ)
187	342	0.0650	యాదవల్లి శేషమ్మ (సుబ్బ రావు)
188	342	0.1400	ఈమని నరసింహం (సుబ్బయ్య)
189	345	0.6000	ఇతరులు
190	346	0.7600	ఇతరులు (కామంచి రవిచంద్ర S/o వీరస్వామి)
191	349	0.1200	గోనుగుంట రవణమ్మ (కృష్ణయ్య)
192			పుప్పటూరి రవణమ్మ (శ్రీనివాసులు)
193			పుప్పటూరి వెంకటేశ్వర్లు (వెంకయ్య)
194			ఇతరులు
195	354	1.0500	మక్కెన వెంకటేశ్వర్లు (వెంకట సుబ్బయ్య)
196	357	0.1900	ఆలూరి పాపయ్య (లక్ష్మయ్య)
197	357	0.3100	ఇతరులు
198	357	1.0000	గాలి జయమ్మ (శీనయ్య)
199	358-1	0.1900	చేవూరు బక్కయ్య (మాలకొండయ్య)
200	358-1	0.2400	ఇతరులు (చేవూరువానమ్మ W/o ఇమ్మాన్యుయేల్ఎసి0.04)
201	358-1	1.0800	ఇతరులు
202	358-2	0.3700	ఇతరులు
203	360	0.1000	రాయణి సింగమ్మ (బక్కాయ)
204	360	0.5200	మొగిలి గోపయ్య (అంకయ్య)
205	361	0.0300	గాలి కొండయ్య (వెంకటస్వామి)
206	368	2.4000	గడ్డిపాటి జయసింహారావు (రంగయ్య)
207			ఇతరులు
208	369	0.3950	మాకనబోయిన శ్రీనివాసులు (వెంకటేశ్వర్లు)
209			నూరిబోయిన చంద్రయ్య (యానాది)
210			ఇతరులు
211	371	0.6300	నక్కల శేషయ్య (సుబ్బారావు)
212	376	3.0200	ఇతరులు
213	379	1.0950	కమటం వెంకటప్రసాద్ (శ్రీనివాసులు)
214	379	1.0700	కమటం కుమారస్వామి (శ్రీనివాసులు)
215	382	1.0350	ఇమాని లక్ష్మీ జ్యోతి (రమేష్)
216	382	1.035	గుమ్మడిల విజయ (కొండలరావు)
217	383	0.0100	దేవండ్ల కొండమ్మ (యానదయ్య)
218	384	0.5600	సమాధి రమణయ్య (ముసలయ్య)
219			ఈమని లక్ష్మీజ్యోతి (రమేష్)
220			ఇతరులు
221			సమాధి సుబ్బారావు (వెంకట సుబ్బయ్య)
222	387	0.0100	ఇతరులు (నక్కల వేణుగోపాల్)
223	394	0.2200	ఇతరులు
224	396	0.4700	ఇతరులు
225	397-1	0.0800	ఇతరులు
226	397-2	0.1200	నక్కల వెంకటేశ్వర్లు (నరసింహం)
227			నక్కల వినోద్ కుమార్ (భాస్కర్ రావు)
228			నక్కలసింహాద్రి (సుధాకర్)
229			ఇతరులు
230			నక్కల కిషోర్ (సుధాకర్)
231	397-3	0.5200	రాయణి సింగమ్మ (బక్కాయ)
232			మల్లాల మంగయ్య (రామయ్య)
233	397-4	0.0800	రాయణి సింగమ్మ (బక్కాయ)
234			ఇతరులు
235	398	0.0300	నక్కల కృష్ణ (రామనయ్య)
236	398	0.5300	నక్కల శ్రీనివాసులు (వెంకయ్య)
237	398	0.1500	నక్కల కృష్ణ (రామనయ్య)
238	401	0.6500	ఇతరులు
239	404	1.8600	మర్రిబోయిన వెంకటసుబ్బమ్మ (కోటయ్య)
240			మర్రిబోయిన శివప్రసాద్ (కోటయ్య)
241			ఇతరులు
242	405	2.8300	తోడేటి శ్రీనివాసులు (సంజీవయ్య) ac 1.26
243			చల్లా శ్రీచందన (కిషోర్)
244			ఇతరులు
245	408	0.9300	నక్కల శేషయ్య (యలమందయ్య)
246	433	0.6000	నక్కల శేషయ్య (యలమందయ్య)
247	540-5	1.2000	చేవూరు ఇస్సాకు (వెంకట సుబ్బయ్య)
248	456	0.4800	ఉప్పుటూరు శేషయ్య (వెంకట సుబ్బయ్య)
249	585	0.6500	యల్లంటి వేంకటేశ్వర్లు (చిన్న కొండయ్య)
250	594	0.7000	కామంచి అబ్బులు (వెంకయ్య)
251	410	0.1100	నక్కల వేంకటేశ్వర్లు (అదెయ్య)
252	414	0.1300	నక్కల కొటేశ్వర రావు (సుబ్బరావు)
253	419	0.5700	ఇతరులు (ఎండేటి సుగుణమ్మ W/o రమణయ్య AC 0.50)
254	421-2	0.0500	ఇతరులు
255	422	0.6300	ఇతరులు (కొమ్మేటి వెంకటేశ్వర్లు ఎసి0.50)
256	423	0.2800	ఇతరులు
257	429	0.1700	నక్కల శ్రీనివాసులు (రమణయ్య)
258	430	0.0200	నక్కల శేషయ్య (యలమందయ్య)
259	434	0.5550	ఇతరులు
260	439-1	0.2700	ఇతరులు (అవుల గోవిందమ్మ W/oపెంచలయ్య ఏసీ 0.245 Cts)
261	442	2.6800	ఇతరులు
262			మొగిలి సుబ్బలమ్మ (వెంకయ్య)
263	444	1.46	పినిడి కోటేశ్వరమ్మ (వెంకట సుబ్బయ్య)
264	447	0.0200	ఇతరులు
265	448	0.3350	ఇతరులు
266	449	0.2300	ఇతరులు
267	450	0.0100	ఇతరులు (నక్కల వెంకయ్య S/o వెంకటేశ్వర్లు)
268	450	0.4000	
269	452	0.2600	ఎండేటి సుగుణమ్మ (రామనయ్య)
270	453	8.2200	ఇతరులు
271	454-1	1.5000	గాలి కృష్ణయ్య (వెంకటస్వామి)
272	454-1	0.3000	తోడేటి శ్రీనివాసులు (సంజీవయ్య)
273	454-2	0.3300	ఇతరులు
274	455	0.3000	మొగిలిగుండ్ల యానాదమ్మ (పెంచలయ్య)
275	455	0.5500	ఇతరులు
276	455	0.0800	ఇతరులు
277	459	0.0050	ఇతరులు
278	460	0.6200	ఇతరులు (నక్కల యానాదమ్మ W/o కొండయ్య)
279	461	0.0300	ఇతరులు
280	461	1.35	యల్లంటి వెంకటేశ్వర్లు (చిన కొండయ్య)
281	464-1	2.3900	నూతలపాటి కోటపనాయుదు (కొండయ్య)
282	464-3	3.1700	నూతలపాటి కోటపనాయుడు (కొండయ్య)
283	470	0.4800	ఎల్లాంటి కోటమ్మ (కోటయ్య)
284	470	0.5350	ఇతరులు
285	472	0.6000	పాలకీర్తి నవీన్ (సుబ్బరాయుడు)
286	472	0.6000	ఇతరులు (ఉప్పు గోపాల్‌రాజు S/o వెంకయ్య)
287	473-1	0.3750	ఇతరులు
288	473-1	0.3750	ఉప్పు తాతయ్య (చిన రామయ్య)
289	473-2	0.9000	ఇతరులు (ఉప్పు నాగేశ్వరరావు
290	473-2	0.30	ఉప్పు తాతయ్య (చిన రామయ్య)
291	474	0.4550	ఇతరులు (కరికాటి సింగయ్య ఏసీ 0.18 సీట్లు) తమ్మిశెట్టి రాజమ్మ ఏసీ 0.04
292	476	1.5800	దేవర మాధవరావు (అంకయ్య)
293	477	0.2100	ఉప్పు సుబ్బారావు (కొండయ్య)
294	480-2	0.1700	పైనీడి సయమ్మ (వీరబాబు)
295	480-4	0.0500	పైనీడి సయమ్మ (వీరబాబు)
296	483	0.2250	ఉప్పు సుబ్బారావు (కొండయ్య)
297	479	0.2900	పైనీడి నారాయణమ్మ (బ్రహ్మయ్య)
298	479	1.3950	కరికాటి సుబ్బయ్య (చెంచయ్య)
299	489	0.1800	నుతలపాటి వరమ్మ (పర్థాశరది)
300	492	1.41	ఉప్పు తాతయ్య (చిన రామయ్య)
301	492	1.5500	ఇతరులు (ఉప్పు గోపాల్ రాజు S/o వెంకయ్య AC 0.555) ఉప్పు సుబ్బారావు AC 0.35
302	493-2	0.20	ఉప్పు తాతయ్య (చిన రామయ్య)
303	493-1	0.3750	ఇతరులు (ఉప్పు ధర్మయ్య
304	493-2	1.1150	ఇతరులు (పల్లపు కుమారి W/o పోతురాజు)
305	495	0.5000	పత్రికోటేశ్వరరావు (పెంటయ్య)
306	495	1.0700	ఇతరులు
307	500	0.7100	చేవూర్యోబు (బజాక్)
308	500	0.1300	ఇతరులు
309	500	0.7300	యల్లంటిమాలకొండయ్య (నరసయ్య)
310	503-1	0.6000	ఇతరులు
311	503-2	0.2975	ఇతరులు
312	504	0.5000	గోపాల్స్వామి మహేంద్రన్ (వెంగుడు స్వామి గోపాల్ స్వామి)
313	507	0.4000	తమ్మిసెట్టి బుజ్జమ్మ (అంజనేయులు)
314	507-2	1.2600	రాయని పెదకొండమ్మ (రామయ్య)
315	507-4	0.1500	రాయని చినవెంకయ్య (రామయ్య)

మిగతా 12వ పేజీలో

11వ పేజీ తరువాయి

316	507-4	0.1500	రాయని పెదకొండమ్మ (రామయ్య)
317	507-19	0.9800	రాయని రామ (చెంచు కొండయ్య)
318	516	0.5200	ఇతరులు(ఉప్పుచిన్న కోటేశ్వరరావు ఏసీ 0.22 తమ్మిశెట్టి బుజ్జమ్మ ఏసీ 0.39 బత్తుల రమణమ్మ ఏసీ 0.20 & బత్తుల రమణమ్మ ఏసీ 0.20
319	519	0.0800	ఇతరులు
320	519	0.9300	ఇతరులు(పొంకం ప్రభాకర్ ఎసి0.40)
321	519	1.1700	ఇతరులు
322	520	1.8000	ఇతరులు
323	522	0.6000	ఇతరులు (రాయని రమణయ్య S/o వెంకయ్య AC 0.22 Cts పల్లెపు బాస్ AC 0.12 ఉప్పు చిన్నకోటేశ్వరరావు)
324	523	1.5800	ఇతరులు (ఉప్పు చిన్న కోటేశ్వరరావు AC 0.50
325	524-4	0.2000	గండికోట బుజ్జమ్మ (శ్రీనివాసులు)
326	525	0.8500	ఇతరులు (గండికోట సిమ్రాన్ ఎసి0.39)
327	526	0.4700	ఇతరులు (గండికోట వెంకమ్మ W/o కొండయ్య AC 0.50 &RayaniRamanaiah S/o Venkaiah Ac 0.255 దేవండ్ల చంద్రమౌళి S/o చిన్న కొండయ్య AC 0.16
328	530	0.2000	ఇతరులు నూతలపాటి లక్ష్మమ్మ
329	532	0.03	ఇతరులు
330	532	0.1100	ఇతరులు
331	533	1.3200	యలగల శ్రీనివాసులు (సుబ్బయ్య)
332	533	0.5000	యలగల శ్రీనివాసులు (సుబ్బయ్య)
333	533	1.0000	నక్కల వేంకటేశ్వర్లు (వెంకయ్య)
334	537	0.2700	పల్లెపు వెంకయ్య (సుబ్బయ్య)
335	542-1	1.1000	చేవూరు సుబ్బరత్నమ్మ (రాజగోపాల్)
336	543-2	0.1500	యల్లంటి కోటమ్మ (కోటయ్య)
337	543-2	0.9000	ఎల్లాంటి కోటమ్మ (కోటయ్య)
338	543-2	0.9200	ఇతరులు
339	543-2	0.1300	లేళ్లపల్లి వెంకయ్యమ్మ (చెన్నయ్య)
340	545-1	0.4500	ఇతరులు (దుగ్గిరాల సుబ్బయ్య S/o. నారయ్య)
341	546	0.5300	ఇతరులు (ఎంగటికొండమ్మ W/o రాములు
342	546	1.40	చేవూరి యాకోబ్ (వెంకట సుబ్బయ్య)
343	547	1.5000	చేవూరి యాకోబ్ (వెంకట సుబ్బయ్య)
344	547	0.6000	చేవూర్కొండయ్య (ఇస్సాక్)
345	547	0.6000	చేవూరి గంగయ్య (ఇస్సాక్)
346	547	0.2000	గౌడపేరు దయమ్మ (లాజర్)
347	548	0.5800	గౌడపేరు దయమ్మ (లాజర్)
348	548	0.2900	గుండమాగుల సుబ్బమ్మ (యాకోబు)
349	551	0.1075	ఇతరులు
350	555	3.0900	ఇరుపూరు వాణిదేవి (వెంకయ్య)
351	555	1.5000	ఇరువుగూరుగోకుల్ మణిదీప్ చౌదరి మైనర్ స్రవంతి (జనార్ధన్)
352	559	0.4900	యడపల్లిమాల కొండయ్య (వెంకయ్య)
353	560	2.6200	చేవూరి యాకోబు (వెంకట సుబ్బయ్య) మాచేపల్లి రామ చంద్రయ్య ఎసి1.03
354			మాచేపల్లి రామ చంద్రయ్య (వెంకయ్య)
355	562	2.3000	గడ్డిపాటి జయసింహారావు (రంగయ్య)
356			గడ్డిపాటి అమరనాద్ (జయసింహారావు)
357			గడ్డిపాటి మురళి (జయసింహారావు)
358			ఇతరులు
359			చేవూరి యాకోబ్ (వెంకట సుబ్బయ్య)
360	563	0.9700	చేవూరు ఇస్సాక్ (వెంకట సుబ్బయ్య)
361			గడ్డిపాటి అమర్‌నాథ్ (జయసింహారావు)
362			గోచిపాతల యాసోబు (రామయ్య), చేవూరి మరియమ్మ (చిన కొండయ్య)
363			పైనేడి హరిబాబు (వెంకయ్య), దుగ్గినేని అరుణ (శ్రీనివాసులు), చేవూరు సింగమ్మ (మాలకొండయ్య), ఇతరులు
364			చేవూరు బ్రహ్మయ్య, చేవూరు దేవ కుమారి (యేలేష్), గోచిపాతాల్మోష (రామయ్య)
365	566	1.7700	నూతలపాటి కోటపనాయుడు (కొండయ్య)
366	566	0.8900	మోదేపల్లి శ్రీహర్ష (హరిబాబు)
367	567	1.9400	చెబ్రోలు వేంకటేశ్వర్లు (నారయ్య)
368	569	0.1350	ఇతరులు
369	590-1	0.6900	ఇతరులు
370	647-2	0.2600	చెల్లిచంద్ర రావు (జలయ్య)
371	647-2	0.0300	కటకం మనోహర్ (వెంకయ్య)
372	650-4	0.0150	తుమ్మల చిన్న కొండయ్య (కొండయ్య)
373	683-2	0.3000	నల్లావుల శ్రీనివాసులు (పెద్ద రామయ్య)
374	688-2	0.1700	స్వర్ణ చెంచమ్మ (కొండయ్య)
375	699	0.0900	నల్లవుల వెంకటేశ్వర్లు (సోమయ్య)
376	700	0.5200	నల్లొల వెంకయ్య (చైనా రాగయ్య)
377	700	0.10	ఇతరులు
378	708-2	0.5500	పొనుగోటి సిద్ధయ్య (చెంచయ్య)
379	708-2	0.5500	పొనుగోటి బ్రహ్మయ్య (చెంచయ్య)
380	709	0.5550	ఇతరులు (నీరుకొండి వెంకటేశ్వరమ్మఎసి0.31
381	709	2.2300	Ms VES కార్పొరేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (MD లక్కంరాజువెంకటరామ మూర్తి రాజు)
382	710	4.0600	Ms VES కార్పొరేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (MD లక్కంరాజువెంకటరామ మూర్తి రాజు)
383	711	0.8800	నల్లవుల ఆదిశేషమ్మ (వెంకయ్య)
384	711	0.9000	ఇతరులు
385	712	0.0100	ఇతరులు
386	715	0.4400	కుట్టుబోయిన సుబ్బమ్మ (కోటయ్య)
387	715	1.7000	ఇతరులు (పొంకం నాగేశ్వరరావు S/o రమణయ్య AC 0.80)
388	715	1.19	స్వర్ణ నరసింహమూర్తి (మాలకొండయ్య)
389	717-1	0.2500	నల్లొల వెంకయ్య (చైనా రాగయ్య)
390	717-2	0.1000	నల్లొల వెంకయ్య (చైనా రాగయ్య)
391	717-3	0.3900	ఇతరులు (కాకు రమణమ్మ)
392	717-4	0.1400	ఇతరులు
393	777	0.0300	ఇతరులు
394	786	0.0800	ఇతరులు (నల్లవులపేరయ్య)
395	789-2	0.0100	ఇతరులు
396	789-4	0.0200	ఇతరులు
397	791	0.0200	ఇతరులు
398	792	0.1600	ఇతరులు
399	792	0.0200	పేరం రమణమ్మ (వెంకయ్య)
400	793	0.0750	ఇతరులు
401	805	1.15	నల్లవుల వరప్రసాద్ (వెంకట సుబ్బయ్య)
402	805	4.95	నల్లవుల వరప్రసాద్ (వెంకట సుబ్బయ్య)
403	810-1	0.95	ఉప్పల మురళీకృష్ణ (వెంకటేశ్వర్లు)
404	810-2	2.44	ఉప్పల మురళీకృష్ణ (వెంకటేశ్వర్లు)
405	824-1	0.2100	ఇతరులు
406	825	0.1000	ఇతరులు
407	826	1.9000	దేవనబోయిన శంకరయ్య S/o పున్నయ్య
408	826	1.1000	ఇతరులు
409	827	0.1100	ఇతరులు
410	829	0.0250	దేవనబోయిన సుబ్బారావు (వెంకయ్య)
411	829	0.35	వనపాల వెంకమ్రాజు (పిచ్చి రాజు)
412	829	0.025	దేవనబోయిన శ్రీనివాసులు (బంగారు)
413	831	0.0200	వాకా భాస్కర్ రెడ్డి (కృష్ణ రెడ్డి)
414	835	3.4700	దేవనబోయిన శంకరయ్య S/o పున్నయ్య
415	835	0.0200	ఇతరులు
416	836	1.0700	దేవనబోయిన శంకరయ్య S/o పున్నయ్య
417	836	2.12	వనపాల వెంకమ్‌రాజ్ (పిచ్చి రాజు)
418	838	2.5200	దేవనబోయిన శంకరయ్య S/o పున్నయ్య
419	839-1	3.8800	దేవనబోయిన శంకరయ్య S/o పున్నయ్య
420	839-2	0.1000	బత్తుల విజయకుమార్ (నరసయ్య)
421	839-2	1.8900	ఇతరులు
422	841	2.00	గుండ్లపల్లి శంకరయ్య (నరసింహం)
423	842	7.1000	ఇతరులు (కిలా విజయ్ మోహన్)
424	845	0.7075	ఇతరులు
425	845	7.0000	నాగసూరి కృష్ణమూర్తి S/o పున్నయ్య
426	846	2.2100	ఇతరులు (దండిబోయిన పున్నమ్మ)
427	846	1.8100	Ms VES కార్పొరేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (MD లక్కంరాజు వెంకటరామ మూర్తి రాజు)
428	846	1.8100	నాగసూరి కృష్ణమూర్తి S/o పున్నయ్య
429	868	1.0000	యలగల శ్రీనివాసులు (సుబ్బయ్య)
430	868	0.5400	యలగల శ్రీనివాసులు (సుబ్బయ్య)
431	868	0.5000	యలగల శ్రీనివాసులు (సుబ్బయ్య)
432	886	4.2500	కోడూరి రఘునాధరావు (రామయ్య)
433	894	1.2200	కుట్టుబోయిన రామనయ్య (కొటయ్య)
434	894	1.4300	పొంకం శేషమ్మ (రామనయ్య)
435	900-3	0.2600	నల్లావుల శ్రీదేవి (చిన్నయ్య)
436	901-2	0.5700	నల్లావుల సుబ్బయ్యమ్మ (కొటయ్య)
437	901-3	0.5600	నల్లావుల శ్రీదేవి (చిన్నయ్య)
438	902	7.0000	కాకర్లపూడి పద్మ (శ్రీనివాస రాజు)
439	902	7.0000	ఉప్పలపాటి పద్మ (వెంకటరాజు)
440	937	0.0800	వాకా పద్మావతి (భాస్కర రెడ్డి)
441	944-3	1.7200	పర్రె అంజమ్మ (చిన్న వెంకట రామనయ్య)
442	948	0.0200	ఎం.రామచంద్ర (మాలకొండయ్య)
443	948	0.3900	పంజా సోమయ్య (పోలయ్య)
444	948	0.0200	వాలేటి సులోచన (మాలకొండయ్య)
		324.7122	

భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్, A.P. మారిటైమ్ బోర్డు, కావలి.





యోగాంధ్ర కార్యక్రమంలో ఆదివారం విజయవాడలోని కృష్ణా నదీ తీరంలో యువకుల యోగాసనాలు

ఒక్క వజ్రం జీవితాన్నే మార్చేస్తుందని..

» పత్తికొండ, తుగ్గలి, మద్దికెరలో విస్తృత అన్వేషణ

» కుటుంబాలతో తరలివచ్చి అక్కడే బస

తుగ్గలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తొలకరి జల్లులు పడితే అన్ని చోట్లా రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతారు. కానీ ఇక్కడ మాత్రం కుటుంబాలు, కుటుంబాలు వజ్రాల వేటలో నిమగ్నమవుతాయి. వర్షపు జల్లులు తమకు అదృష్టం పండిస్తాయోమోనని ఆశగా అక్కడకి వచ్చిన వారు ఎదురుచూస్తారు. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని తుగ్గలి, మద్దికెర మండలాల పరిధిలోని ఎర్రగుడి, జొన్నగిరి, చిన్నజొన్నగిరి, పగడిరాయి, అమినేబాద్, తుగ్గలి, మదనంతపురం, పెరవలి పంటపొలాల్లో వర్షాలు ప్రారంభమైన వెంటనే విలువైన వజ్రాలు దొరుకుతుంటాయి. వజ్రాలు దొరుకుతున్నాయనీ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో నంద్యాల, తాడిపత్రి, అనంతపురంతో పాటు, గుంటూరు, తెలంగాణ కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి ఈ ఏడాది ఇక్కడకు వచ్చి అన్వేషిస్తున్నారు. వేల సంఖ్యలో ఆటోలలో, కార్లలో ఇంటిల్లిపాది వచ్చి వెదుకుతున్నారు. వచ్చిన వారు దాదాపు వారం రోజులకు సరిపడా బియ్యం, సరుకులు తీసుకుని వచ్చి పొలాల్లోనే వంట చేసుకుంటూ అన్వేషణ కొనసాగిస్తున్నారు. చిన్నారులకు వారి వాహనాల్లోనూ, చెట్లకు ఊయలలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఒక్క వజ్రం దొరికితే తమ జీవితం మారిపోతుందని పలువురు చెబుతున్నారు. అప్పులు తీర్చుకోవడానికే ఈ అన్వేషణ చేస్తున్నామని మరికొందరు తెలిపారు. హోటళ్ల ఖర్చులు భరించలేక వండుకుని తింటున్నామని వెల్లడించారు.



తుగ్గలి మండలంలోని జొన్నగిరిలో వజ్రాలు అన్వేషిస్తున్న అన్వేషకులు



పొలాల్లోనే భోజనం చేస్తున్న వజ్రాన్వేషకులు

మెప్మాకు 9 స్కోచ్ అవార్డులు

» సెప్టెంబరు 20న ఢిల్లీలో ప్రదానం

అమరావతి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) 9 స్కోచ్ అవార్డులను దక్కించుకుంది. వివిధ కేటగిరీల్లో నామినేట్ అయిన 14 ప్రాజెక్టులకు గాను 9 ప్రాజెక్టులకు ప్లాటినం అవార్డులు ప్రకటించారు. దుర్భర జీవితాన్ని గడిపేవారిని ఆర్థికంగా పైకి తీసుకొచ్చే నివాస, బ్యాంక్ లింకేజీ, లైవ్‌లీహుడ్ ట్రాకర్, ఈ-కామర్స్ అమ్మకాలు, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి యూనిట్లు, ప్రేరణ, సఖి, వీధి వ్యాపారుల మేనేజ్‌మెంట్ తదితర పథకాలకు అవార్డులు అందజేయనున్నారు. సెప్టెంబరు 20న ఢిల్లీలో స్కోచ్ ప్లాటినం అవార్డులు ప్రదానం చేయనున్నారు. మెప్మా తరఫున మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అవార్డులను అందుకోనున్నారు. ఈ అవార్డులు దక్కించుకునేందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

లాస్ ఏంజెలెస్‌కు నేషనల్ గార్డ్ దళాలు

» రెండు వేల మందిని మోహరించిన ట్రంప్

న్యూఢిల్లీ, జూన్ 8: అక్రమ వలసదారులను గుర్తించేందుకు అధికారులు చేపట్టిన ఆకస్మిక తనిఖీలతో అమెరికాలోని లాస్ ఏంజెలెస్ రణరంగంగా మారింది. నిరసనకారుల ఆందోళనలు రెండో రోజుకు చేరడంతో అధ్యక్షుడు ట్రంప్ శనివారం 2వేల మంది నేషనల్ గార్డ్ దళాలను నగరంలో మోహరించారు. లాస్ ఏంజెలెస్‌లో పెరుగుతున్న చట్టవిరుద్ధ చర్యలను అడ్డుకొని, సమస్యను పరిష్కరించడానికి ఈ బలగాలు కనీసం 60 రోజుల పాటు అక్కడే ఉంటాయని వైట్ హౌస్ తెలిపింది. హింసాకాండ ఇలాగే కొనసాగితే నావికా దళాన్ని రంగంలోకి దించుతామని రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్ హెచ్చరించారు. లాస్ ఏంజెలిస్‌లో నేషనల్ గార్డ్ దళాల మోహరింపు నిర్ణయాన్ని కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ తప్పుబట్టారు. ట్రంప్ ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని, చట్టాన్ని అమలు చేసే వ్యవస్థల కొరత కారణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోలేదని, వారు అక్కడ వినోదం చూడాలని కోరుకుంటున్నారని 'ఎక్స్'లో చేసిన పోస్టులో న్యూసమ్ ఆరోపించారు.

తెలంగాణలో ముగ్గురు కొత్త మంత్రులు

» రేవంత్ క్యాబినెట్‌లో 14కు చేరిన మంత్రుల సంఖ్య

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో కొత్తగా చోటు దక్కించుకున్న ముగ్గురు ఎమ్మెల్యేలు.. మంత్రులుగా ఆదివారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నూతన మంత్రులతో ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో.. గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి మంత్రులుగా ప్రమాణం చేశారు. అనంతరం పత్రాలపై సంతకం చేసి తొలుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వద్దకు, అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి కృతజ్ఞతలు తెలుపగా.. వారు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ముగ్గురు నూతన మంత్రుల ప్రమాణ స్వీకారం కేవలం తొమ్మిది నిమిషాల్లోనే పూర్తయింది. మధ్యాహ్నం 12.13 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం.. 12.23 గంటలకే ముగిసింది. కొత్త మంత్రులకు సీనియర్ మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు నూతన మంత్రులకు 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. వారితోపాటు శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న జాటోతు రాంచందర్‌నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం చేపట్టిన మంత్రివర్గ విస్తరణతో రేవంత్ క్యాబినెట్‌లో మంత్రుల సంఖ్య 14కు చేరింది. మరో మూడు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. అయితే రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల తరువాత మిగిలిన ఆ మూడు ఖాళీలను భర్తీ చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. వాస్తవానికి మంత్రివర్గ విస్తరణ సుదీర్ఘకాలంగా వాయిదా పడుతూ వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రేపు, మాపు అంటూ పలు దఫాలుగా విస్తరణను వాయిదా వేశారు. దీంతో మంత్రివర్గంలో చోటు కోసం ఆశావహుల పేర్లతో జాబితా రోజురోజుకూ పెరిగిపోయింది. చివరికి సుమారు 17 నెలల తర్వాత శనివారం రాత్రి పార్టీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో సామాజిక సమీకరణాల సమతూకం పాటిస్తూ మాల, మాదిగ, బీసీ వర్గాలకు చెందిన ముగ్గురితో మంత్రివర్గాన్ని సీఎం రేవంత్‌రెడ్డి విస్తరించారు.

డీఎస్సీకి 90.14 శాతం హాజరు

అమరావతి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షలు రెండో రోజు ఆదివారం ప్రశాంత వాతావరణంలో జరిగాయని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఉదయం సెషన్‌లో 9,951 మంది అభ్యర్థులకు గాను 9,516 (95.63%) మంది, మధ్యాహ్నం సెషన్‌లో 17,301 మందికి గాను 15,051 (87%) మంది హాజరయ్యారని వివరించారు. మొత్తంగా 90.14 శాతం మంది పరీక్షలు రాశారని చెప్పారు. ఉదయం అత్యధికంగా కర్నూలులో 98.35%, మధ్యాహ్నం అత్యధికంగా అనంతపురంలో 89.79% మంది హాజరయ్యారని కన్వీనర్ పేర్కొన్నారు.

నీటి ప్రాజెక్టులపై అఖిలపక్షం

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్

అమరావతి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గోదావరి- బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని, ఇదే కొనసాగితే తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టుకు పట్టిన గతే పడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న, కొత్తగా చేపట్టబోయే ఇరిగేషన్ ప్రాజెక్టులపై వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గోదావరి- బనకచర్ల పేరుతో దాదాపు రూ.82వేల కోట్లు ఖర్చు చేయాలనే ప్రతిపాదనపై హడావిడిగా ముందుకెళ్లడం సరికాదని రామకృష్ణ సూచించారు.

'చినాబ్'పై తెలుగు ముద్ర..!

» రైల్వే వంతెన నిర్మాణంలో తెలుగమ్మాయి కీలక పాత్ర

» టెక్నికల్ కన్సల్టెంట్‌గా ప్రకాశం వాసి మాధవీలత బాధ్యతలు

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): భారత ఇంజినీరింగ్ నైపుణ్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన చినాబ్ బ్రిడ్జి నిర్మాణంలో తెలుగుతేజం మాధవీలత కీలక పాత్ర పోషించారు. ప్రకాశం జిల్లా ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలోని ఏడుగుండ్లపాడు గ్రామానికి చెందిన గాలి మాధవీలత ప్రస్తుతం బెంగళూరులోని ఐఐఎస్‌సీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. కందుకూరులోని ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుకున్న మాధవీలత జేఎన్‌టీయూ కాకినాడలో ఇంజనీరింగ్, వరంగల్ నిట్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. మద్రాస్ ఐఐటీలో పీహెచ్‌డీ పూర్తి చేసి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ)లో రాక్ మెకానిక్స్‌లో పోస్ట్ డాక్టొరల్ ఫెలోషిప్ చేశారు. గువాహటీ ఐఐటీలో ఏడాదిపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రస్తుతం బెంగళూరులోని ఐఐఎస్‌సీలో హెచ్ఏజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అక్కడే సెంటర్ ఫర్ సస్టెయినబుల్ టెక్నాలజీస్ విభాగానికి చైర్‌పర్సన్‌గా అనేక ప్రాజెక్టులకు నాయకత్వం వహించారు. ఈ క్రమంలో చినాబ్ వంతెన నిర్మాణ బాధ్యతను నార్తర్న్ రైల్వే ఆఫ్కాన్స్ సంస్థకు అప్పగించింది. ఆ సంస్థకు జియో టెక్నికల్ కన్సల్టెంట్‌గా ఉండటంతో.. రాక్ మెకానిక్స్‌లో అనుభవం ఉన్న మాధవీలతకు ఈ ప్రాజెక్టులో పనిచేసే అవకాశం దక్కింది. ఏళ్ల తరబడి ఎంతో కష్టపడి ఈ బాధ్యతలన్నీ విజయవంతంగా పూర్తిచేసిన ఘనత మాధవీలతకు, ఆమె బృందానికి దక్కింది. ఈ నేపథ్యంలో మాధవీలత ప్రతిభను ఏడుగుండ్లపాడు వాసులు ఘనంగా చెప్పుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నిర్మాణ సమయంలో చినాబ్ వంతెన వద్ద మాధవీలత

కుటుంబ నేపథ్యం

ఒంగోలు సమీపంలోని ఏడుగుండ్లపాడు గ్రామానికి చెందిన ప్రొఫెసర్ మాధవీలత బాల్యమంతా గ్రామంలోనే కొనసాగింది. తండ్రి గాలి వెంకారెడ్డి, తల్లి అన్నపూర్ణమ్మ. మాధవీలత భర్త హరిప్రసాద్ రెడ్డి గూగుల్‌లో పనిచేస్తున్నారు. మాధవీలత, హరిప్రసాద్ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మంగినపూడి బీచ్‌కు భారీగా పర్యాటకుల తాకిడి



మంగినపూడి బీచ్‌కు పోటెత్తిన పర్యాటకులు

» ముగిసిన మసులా బీచ్ ఫెస్టివల్

మచిలీపట్నం టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన మసులా ఫెస్ట్-2025 ఆదివారంతో ముగిసింది. లక్షలాది మంది పర్యాటకులతో సముద్ర తీరం పోటెత్తింది. బీచ్ ఫెస్టివల్‌కు వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 15 లక్షల మంది తరలివచ్చినట్లు తెలుస్తోంది. చివరి రోజు జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు బహుమతులు అందజేశారు.

ఫ్రెండ్లీ పీక్ పర్వతారోహణలో అపశ్రుతి

» కులుమనాలిలో గుండెపోటుతో బెజవాడ వాసి మృతి

పెనమలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కులుమనాలిలోని ఫ్రెండ్లీ పీక్ పర్వతాన్ని అధిరోహిస్తూ విజయవాడకు చెందిన ఓ ప్రైవేటు సంస్థ సీనియర్ ఇంజనీరు అడుసుమల్లి లక్ష్మణరావు (62) గుండెపోటుతో మృతిచెందారు. విజయవాడకు చెందిన టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, లింగాల రవీంద్ర, బొబ్బా గోపాలకృష్ణ, వంశీకృష్ణ, గౌతంరెడ్డి, అడుసుమల్లి లక్ష్మణరావు ఇటీవల కులుమనాలి వెళ్లారు. శనివారం అక్కడికి సమీపంలో 18 వేల అడుగుల ఎత్తున్న ఫ్రెండ్లీ పీక్ పర్వతాన్ని అధిరోహించడం ప్రారంభించారు. మూడున్నర వేల అడుగుల ఎత్తుకు చేరుకున్న లక్ష్మణరావుకు ఒక్కసారిగా ఆయాసం, గుండెదడ ప్రారంభమైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే కుప్పకూలి మృతిచెందారు. దీంతో బృందం వెనుదిరిగింది. కులుమనాలిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో లక్ష్మణరావు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి ఆదివారం విజయవాడ తీసుకొచ్చారు.



లక్ష్మణరావు

రాజధానిపై విషం చిమ్మడంలో గట్టు దాటారు: చంద్రబాబు



అమరావతి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మీడియా విశ్లేషణల పేరుతో రాజధాని అమరావతి మహిళలపై దారుణ వ్యాఖ్యలు చేయడాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టుదాటి ప్రవర్తించారని, మన తల్లులు, చెల్లెళ్లపై ఇలాంటి దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. 'ఆడ బిడ్డలను గౌరవించే సంస్కృతి మనది. రాజకీయ కక్షతో, మీడియా విశ్లేషణల పేరుతో నిస్సిగ్గుగా మన తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం. రాజధాని ప్రాంత మహిళల వ్యక్తిత్వాలను అవమానించేలా వేశ్యలు అంటూ చేసిన దారుణ వ్యాఖ్యలను ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఇటువంటి వికృత పోకడలను తీవ్రంగా ఖండిస్తున్నా. తన సొంత మీడియా ద్వారా జరిగిన ఈ దారుణాన్ని మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఇప్పటికీ ఖండించకపోవడం, స్త్రీ జాతికి క్షమాపణ చెప్పకపోవడం మరింత విచారకరం. రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టుదాటి మహిళల మనోభావాలను గాయపరచినవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళలను గౌరవించి, వారి ఆత్మగౌరవానికి అండగా నిలిచే కూటమి ప్రభుత్వం ఈ నీచ సంస్కృతికి చెక్ పెట్టే బాధ్యత తీసుకుంటుంది' అని చంద్రబాబు ట్వీట్ చేశారు.



నెల్లూరు నగరంలో ఆదివారం సాయంత్రం నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న తెలుగు మహిళలు, నగరంలోని వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకురాళ్లు

ఆ వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృత కుట్ర: పవన్



అమరావతి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని అమరావతిపై కుల ముద్రలు వేసి, మహిళలను అవమానిస్తారా..? ఇక్కడ వెలసిల్లిన బౌద్ధాన్నీ అవహేళన చేస్తారా..?' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మండిపడ్డారు. అమరావతి మహిళలపై జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాజధానిపై కుట్రలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 'రాజధాని అమరావతి ప్రాంతంపై ఒక చానల్‌లో జర్నలిస్టు ముసుగులో ఒక వ్యక్తిచేసిన దారుణ వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృతమైన కుట్ర దాగి ఉంది. వైసీపీ టీవీ చానల్ ద్వారా రాజధాని అమరావతి వేశ్యల రాజధాని అని కామెంట్ చేయించారు. దారుణ వ్యాఖ్యలతో మహిళలను అవమానించారు. అంటే.. ఇక్కడ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, రెడ్డి, కమ్మ, కాపు, ఇతర సామాజిక వర్గాల మహిళలందరినీ అవమానించడమే కదా..' అని పవన్ ప్రశ్నించారు. ఆ వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని.. అది సదరు వ్యక్తి అభిప్రాయం మాత్రమేనని ఆ చానల్ కూడా తప్పించుకోలేదన్నారు. వాటిని ప్రసారం చేయడమే కాకుండా.. చర్చ సందర్భంగా కనీసం ఖండించి, తప్పుబట్టలేదన్నారు. ఇలాంటి కుట్రలు, దుష్ప్రచారం చేసిన వ్యక్తులపైనా, వారి వెనుక ఉన్న వారిపైనా రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. నీచ వ్యాఖ్యలు చేసిన వారిపై పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.

జగన్, భారతిరెడ్డి క్షమాపణ చెప్పాలి

▸ మహిళలను కించపరిచిన వారిపై చర్యలు తప్పవు: హోంమంత్రి అనిత



విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలతోపాటు అమరావతి వాసులకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, భారతిరెడ్డి క్షమాపణలు చెప్పాలని హోంమంత్రి వంగలపూడి అనిత డిమాండ్ చేశారు. విశాఖలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సాక్షి చానెల్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు.. 'అమరావతి వేశ్యల రాజధాని' అని సంబోంధించడం తనతోపాటు మహిళలందరినీ తీవ్ర మనోవ్యథకు గురిచేసిందన్నారు. ఆయన వ్యాఖ్యలను చానెల్ యజమాని వైఎస్ భారతిరెడ్డిగానీ, ఆమె భర్త జగన్‌గానీ ఖండించలేదన్నారు. దీన్నిబట్టి వారి ప్రోద్బలంతోనే కృష్ణంరాజు అలా మాట్లాడివుంటారనే అనుమానం కలుగుతోందని చెప్పారు. కృష్ణంరాజు తన వ్యాఖ్యలను సమర్థించుకునేందుకు అమరావతి చుట్టుపక్కల సెక్స్ వర్కర్ల పునరావాసానికి పనిచేసే ఎన్‌జీవోలు 120కిపైగా ఉన్నాయని చెప్పారని, తాను ఆరోగ్య శాఖ అధికారులను ఆరా తీయగా రాష్ట్రం మొత్తంమీద 109 ఎన్‌జీవోలు మాత్రమే ఉన్నాయని తెలిసిందన్నారు. అమరావతిపై జగన్‌కు మొదటి నుంచీ అక్కసు ఉందని, అందుకే అవకాశం దొరికినప్పుడల్లా బురదజల్లడం, ఇతరులను ప్రేరేపించడం చేస్తుంటారని ఆరోపించారు. వైసీపీ నేత బొత్స సత్యనారాయణ కూడా గతంలో అమరావతిని శ్మశానంతో పోల్చారన్నారు. అమరావతి వాసులతోపాటు రాష్ట్ర ప్రజల మనస్సులు గాయపడేలా మాట్లాడిన వారిపై, సంబంధిత టీవీ చానెల్‌పై తమ శాఖకు అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'సాక్షి'పై కఠిన చర్యలు తీసుకోండి

▸ ఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఎన్‌సీడబ్ల్యూ, పీసీఐకి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఫిర్యాదు

గుంటూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అమరావతి వేశ్యల రాజధాని అంటూ సాక్షి టీవీ లైవ్ డిబేట్‌లో చేసిన వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదివారం జాతీయ మానవహక్కుల కమిషన్, జాతీయ మహిళ కమిషన్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలకు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. ఈ నెల 6వ తేదీన ఆ చానల్‌లో పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు నిర్వహించిన చర్చా కార్యక్రమంలో జర్నలిస్టు కృష్ణంరాజు ఈ వ్యాఖ్యలు చేశారని, రాజధాని మహిళలపై విషం చిమ్మారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ఆంధ్రప్రదేశ్ సంస్కృతిని, మహిళలను కించపరిచేలా ఉన్నాయని తెలిపారు. ఆ టీవీ ఛానల్‌పై సుమోటోగా చర్యలు చేపట్టాలని, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ విషయంలో కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కొమ్మినేని, కృష్ణంరాజుపై కేసు నమోదు

విజయవాడ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు, మరో జర్నలిస్టు వాడపల్లి కృష్ణంరాజుపై విజయవాడ పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం జగన్ చానల్‌లో కొమ్మినేని నిర్వహించిన చర్చా వేదికలో పాల్గొన్న కృష్ణంరాజు అమరావతి మహిళలపై నోరు పారేసుకున్నారు. రాజధాని ప్రాంతంలో వేశ్యలు ఉన్నారని వ్యాఖ్యానించారు. కేఎస్ఆర్, కృష్ణంరాజుపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళలు పటమట పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

భగ్గుమన్న మహిళా లోకం

మాటలు.. మంటలు!

మహిళలపై అనుచిత వ్యాఖ్యలపై పెల్లుబికిన నిరసనలు

▸ కొమ్మినేని, కృష్ణంరాజులపై పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు

▸ సాక్షి కార్యాలయాల ఎదుట తెలుగు మహిళల ధర్నాలు

▸ భారతీరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్

▸ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు అమరావతి జేఏసీ ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

'అమరావతి వేశ్యల రాజధాని' అంటూ జర్నలిస్టుల ముసుగులో ఉన్న వ్యక్తులు నోరు పారేసుకోవడంపై మహిళా లోకం భగ్గుమంది. రోత చానల్ లైవ్ డిబేట్‌లో అమరావతి మహిళలపై వారు చేసిన వ్యాఖ్యలపై ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు పెల్లుబికాయి. అత్యంత జుగుప్సాకర వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజుతో పాటు కొమ్మినేని శ్రీవాసరావును తక్షణం అరెస్టు చేయాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు జిల్లాల్లోని పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. నిరసన ర్యాలీలు నిర్వహించారు. 'సాక్షి' కార్యాలయాల ఎదుట ధర్నాలు చేసి, ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు. 'సాక్షి' చానల్‌లో మహిళలను అగౌరవపరుస్తుంటే ఆ సంస్థ యాజమాని భారతీరెడ్డి ఎందుకు స్పందించలేదని నిలదీశారు. భారతీరెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలను అగౌరపరిచేలా వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు, సాక్షి యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని కోరుతూ ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజకు అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో మహిళలు, నేతలు ఫిర్యాదు చేశారు. వీరితో పాటు రాష్ట్ర మహిళా విభాగం, ఎస్సీ సెల్, జనసేన, బీజేపీ, మానవ హక్కుల సంఘాల తరఫున వేర్వేరుగా ఫిర్యాదులు అందజేశారు. ఈ ఘటనపై పరిశీలన చేస్తున్నామని, త్వరితగతిన చర్యలు ఉంటాయని చైర్‌పర్సన్ తెలిపారు.



పశ్చిమగోదావరి జిల్లా ప్రత్తిపాడులో సాక్షి కార్యాలయం ఎదుట ధర్నా

నెల్లూరులో భారీ నిరసన ప్రదర్శన

నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ నుంచి వీఆర్‌సీ వరకు తెలుగు మహిళలు నల్లచీరలు ధరించి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాజధానిపై విషం చిమ్ముతున్న సాక్షి పత్రిక, చానల్‌ను బ్యాన్ చేయాలని కోరారు. ఉమ్మడి అనంతపురం జిల్లా సాక్షి యూనిట్ కార్యాలయం ఎదుట తెలుగు మహిళలు నిరసనకు దిగారు. యూనిట్ కార్యాలయానికి ఉన్న 'సాక్షి' అక్షరాలను తొలగించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. బలవంతంగా వారిని అరెస్టు చేసి, పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాప్తాడులో తెలుగు మహిళలు పోలీసు స్టేషన్ ఎదుట నిరసన చేపట్టి జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీడీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీ ఖండవిల్లి లక్ష్మి ఆధ్వర్యంలో రాజానగరం సమీపంలోని సాక్షి పత్రిక కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.



అనంతపురంలోని సాక్షి యూనిట్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం



రాజానగరంలోని సాక్షి కార్యాలయం ఎదుట మహిళల ఆందోళన

ఏ ఒక్కరినీ వదిలిపెట్టం

▸ అమరావతి రైతు సమన్వయ కమిటీ హెచ్చరిక



మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు ఫిర్యాదు చేస్తున్న అమరావతి మహిళలు

'అమరావతి మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడించిన సాక్షి చానల్‌ను, మాట్లాడినవారిని రైతు జేఏసీ వదిలిపెట్టదు. తగిన శాస్తి చేశాకే వారిని చట్టానికి అప్పగిస్తాం. భారతీ రెడ్డిని విమర్శించిన చేబ్రోలు కిరణ్‌ను హుటాహుటిన అరెస్టు చేసిన ప్రభుత్వం, కొమ్మినేనిని, కృష్ణంరాజును ఎందుకు అరెస్టు చేయలేకపోయిందో చెప్పాలి' అంటూ రాజధాని అమరావతి రైతు సమన్వయ కమిటీ భగ్గుమంది. రాజధాని పరిధిలోని తుళ్లూరులో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్, సాక్షి చానెల్‌ను, వారిపై చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం తీరుపై కమిటీ నేతలు విరుచుకుపడ్డారు. రాజధాని అమరావతిపై, మహిళలపై, రాష్ట్ర ప్రజల మీద తప్పుడు ప్రచారాలకు దిగితే, ఎంతటివారికైనా బడిత పూజ తప్పదని తెగేసి చెప్పారు. దీనిపై రాష్ట్ర, జాతీయ మహిళా కమిషన్‌కు, డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. న్యాయం జరగకపోతే అమరావతి ఉద్యమం తరహాలోనే మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. అందుకు రాష్ట్ర మహిళా లోకం సిద్ధంగా ఉండాలని, తదుపరి కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కాగా, అమరావతి రాజధాని పరిసర ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలను దారుణంగా కించపరిచిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎస్సీ సెల్ నేతలు, అమరావతి జేఏసీ మహిళలు గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వైసీపీ మార్క్ పొలిటికల్ టెర్రరిజం

(మొదటి పేజీ తరువాయి)

లేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నోరు విప్పి మాట్లాడలేని భయానక వాతావరణం. జగన్ అరాచక పాలనను భరించలేకే ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక నాటి 'దారుణాలు' దాదాపుగా లేవు. ఏడాదిలోనే పాలనను దాదాపుగా గాడిలో పెట్టారు. తప్పు చేయాలంటే నేరస్తులు భయపడాలని, శాంతిభద్రతలు కాపాడాలని, అప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని.. లేదంటే ప్రగతి అసాధ్యమని పలుమార్లు సమీక్షల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసులకు స్పష్టంగా చెప్పారు. పోలీసులు చట్టప్రకారం వ్యవహరిస్తుండటంతో సంఘ విద్రోహ శక్తులతో పాటు గతంలో అరాచకాలకు పాల్పడిన వైసీపీ నేతలు, కార్యకర్తలు తోకముడిచారు. సోషల్ మీడియాలో ఓ అనుచిత పోస్టు పెట్టాలంటే భయపడే పరిస్థితి. మరోవైపు కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపైనా దృష్టిపెట్టింది. పోలవరం సహా గతంలో ఆగిపోయిన పలు ప్రాజెక్టులకు మళ్లీ శ్రీకారం చుట్టింది. రోడ్లకు మహర్దశ తీసుకువచ్చింది. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాటలో నడుస్తుంటే.. సహించలేని వైసీపీ మూక విద్వేషాలు రెచ్చగొడుతోంది. ఇందుకు వైసీపీ అధ్యక్షుడు జగన్ స్వయంగా ప్రేరేపిస్తున్నారు. తప్పు చేసినవారిపై పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటుంటే.. పోలీసులకు ఎదురు తిరగండంటూ జగన్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. మనం అధికారంలోకి వచ్చాక వారితోనే సెల్యూట్ చేయిస్తానంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా వదలనంటూ పోలీసులకు వార్నింగ్‌లు కూడా ఇస్తున్నారు. గతంలో అరాచకాలకు పాల్పడి అరెస్టయిన వైసీపీ నేతలను జగన్ జైలుకు వెళ్లి పరామర్శిస్తున్నారు. ఇక ఆ పార్టీ నేతలూ నేరస్తులకు కొమ్ముకాస్తున్నారు. గతంలో మంత్రులుగా పనిచేసిన విడుదల రజనీ, అంబటి రాంబాబు వంటి వారు పోలీసుల పట్ల అనుచితంగా వ్యవహరించారు. వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన నేరగాళ్లు.. జగన్ అండ చూసుకుని మళ్లీ బుసకొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కొన్నిచోట్ల అధికార టీడీపీ వారిపైనే దాడులకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. సోషల్ మీడియాలో నీచమైన పోస్టింగ్‌లు పెడుతున్నారు. పనిలో పనిగా నోటికి కూడా పని చెబుతున్నారు. చివరకు అమరావతిని 'వేశ్యల రాజధాని' అంటూ దారుణమైన వ్యాఖ్యలు చేసే వరకూ పరిస్థితి వచ్చింది. జగన్ ఇస్తున్న ప్రోత్సాహంతో రాష్ట్రంలో రౌడీయిజం వ్యవస్థీకృతంగా మారే ప్రమాదం ఉంది. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై ఏపీ పోలీసులు చట్టపరంగా వ్యవహరిస్తుండటంతో జీర్ణించుకోలేని వైసీపీ.. సోషల్ యాక్టివిస్టుల స్వేచ్ఛపై దాడి అంటూ పెడబొబ్బలు పెడుతోంది. జగన్ సొంత మీడియాలో ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా వ్యతిరేక విషబీజాలు నింపే కార్యక్రమానికి జోరు పెంచింది. గతంలో హైకోర్టు న్యాయమూర్తులపై అనుచిత పోస్టులు పెట్టించి వారి ఆచూకీ దొరకలేదని సీబీఐతో చెప్పించిన ఘనత వైసీపీకి ఉంది. మళ్లీ అలాంటి పరిస్థితులు తీసుకువచ్చేలా వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారు.

ఇరాక్‌లో ఐసిస్.. ఏపీలో వైసిస్

గత ఐదేళ్ల జగన్ పాలనలో అభివృద్ధి అన్నది రాష్ట్రంలో ఎక్కడా కనపడకుండా చేశారు. అధికారంలోకి రావడానికి కోడికత్తి డ్రామా, గొడ్డలి పోటు నాటకం, అబద్ధాలు, విద్వేషాలు.. అధికారంలోకి వచ్చాక పగలు, ప్రతీకారాలు, అవినీతి, దోపిడీ, దౌర్జన్యాలు, అక్రమ కేసులతో భయానక పాలన సాగించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో పరిస్థితి గాడిన పడటం చూసి ఓర్వలేని జగన్ 'పొలిటికల్ టెర్రరిజం' ప్రేరేపిస్తున్నారు. 'ఇరాక్‌లో ఐసిస్‌లా.. ఏపీలో వైసిస్' తయారవుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఇరాక్‌లో పురుడు పోసుకున్న 'ఐసిస్' అనే చాందసవాద సంస్థ తమ రాజ్యస్థాపన, విస్తరణే లక్ష్యంగా చేయని అరాచకం లేదు. ఐసిస్‌కు మతోన్మాద ఉగ్రవాదం అజెండా అయితే.. ఇడుపులపాయలో పుట్టిన వైసీపీకి రాజకీయ ఉగ్రవాదం అజెండా అని విమర్శిస్తున్నారు.

సోషల్ సైకోలకు వణుకు

కూటమి ప్రభుత్వం వచ్చాక సోషల్ సైకోలకు వణుకు మొదలైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశంతో పోలీసులు రూటు మార్చారు. సోషల్ మీడియా ద్వారా సమాజంపై విషం చిమ్ముతున్న వైసీపీ సోషల్ మీడియా విష వృక్షాన్ని కూకటి వేళ్లతో పెకిలించివేశారు. తల్లి, చెల్లి అనే ఉచ్చనీచాలు లేకుండా దారుణ వ్యాఖ్యలు చేసే వర్రా రవీంద్ర రెడ్డి మొదలు వందలాది మంది వైసీపీ సైకోలను జైలుకు పంపారు. అత్యంత జుగుప్సాకరమైన మార్ఫింగ్ వీడియోలు తయారు చేసిన సైబర్ నేరగాళ్లకు చట్టం ఎలా ఉంటుందో చూపించారు. వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ సజ్జల భార్గవ్ రెడ్డి అయినా.. అధికార పార్టీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ చేబ్రోలు కిరణ్ అయినా హద్దు మీరితే కూటమి ప్రభుత్వంలో చూస్తూ ఊరుకోబోమని పోలీసులు నిరూపించారు.

అరాచక, అవినీతి శక్తులకు సంకెళ్లు

గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్ నుంచి ఇసుక అక్రమ తరలింపు, మైనింగ్ దోపిడీ వరకూ.. రాజకీయ అరాచకాల నుంచి రౌడీల బెదిరింపులు, సోషల్ మీడియాలో సైకోల వేధింపులన్నీ అరికట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. అధునాతన టెక్నాలజీ అందిపుచ్చుకుని నేర నియంత్రణలో దేశానికే ఏపీ పోలీసు ఆదర్శంగా నిలవాలని దిశానిర్దేశం చేశారు. అరాచకాలకు పాల్పడిన వల్లభనేని వంశీ, బూతులకు బ్రాండ్ అంబాసిడర్ అయిన పోసాని కృష్ణమురళి, అనిల్ బూరగడ్డ, మైనింగ్ దోచుకున్న కాకాని గోవర్ధన్ రెడ్డి, దౌర్జన్యాలకు పాల్పడిన పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, నందిగం సురేశ్ తదితరులను కూటమి ప్రభుత్వం జైలుకు పంపింది. అలాగే నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న సీనియర్ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు, దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణంలో సూత్రధారులు, పాత్రధారులైన జగన్ మాజీ కార్యదర్శి ధనుంజయ రెడ్డి, ఓఎస్‌డీ కృష్ణమోహన్ రెడ్డి ఇతర అధికారులను అరెస్ట్ చేయించింది. గంజాయిపై ఉక్కుపాదం మోపిన ఏపీ పోలీసులు 'ఈగల్'ను రంగంలోకి దించారు. మహిళల రక్షణ కోసం 'శక్తి' బృందాలు, శక్తి యాప్, వాట్సాప్ సహకారంతో మహిళా ఐజీ నేతృత్వంలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నేర నియంత్రణకు డ్రోన్లను సైతం వాడుతున్నారు. శిక్షల శాతం పెరగడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అందిపుచ్చుకోవడం లాంటి చర్యలతో నేరస్తుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు.

జగన్‌కు ప్రశ్నించే అర్హతే లేదు

▸ నాడు ఆయన పాలన అంతా అవినీతిమయం: సోము వీర్రాజు

అనంతపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఏ విధంగానూ ప్రశ్నించే అర్హత లేదని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు విమర్శించారు. ఆయన నేతృత్వంలోని గత ఐదేళ్ల వైసీపీ పాలన అంతా అవినీతి మయమేనని పేర్కొన్నారు. ఆయన ఆదివారం అనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ... 'జగన్‌రెడ్డి లిక్కర్ పాలసీలో అనేక అక్రమాలు జరిగాయి. డిజిటలైజేషన్‌లో దేశం నంబర్-1 స్థానంలో ఉంటే.. ఏపీలో లిక్కర్ విక్రయాలు ఉద్దేశపూర్వకంగానే డిజిటలైజేషన్ చేయలేదు. అవినీతికి పాల్పడ్డారనేందుకు ఈ ఒక్క ఉదాహరణ చాలదా?' అని వైసీపీని నిలదీశారు. 'ఇప్పుడేమో బటన్ నొక్కలేదని కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నావు. నువ్వు సక్రమంగా బటన్ నొక్కి ఉండుంటే ప్రజలు ఎందుకు ఓడించారో సమాధానం చెప్పాలి. నీ తప్పుడు విధానాల వల్లే చివరికి ప్రతిపక్ష హోదా కూడా ప్రజలు ఇవ్వలేదు. ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం ఫెయిలైందనంటున్నావు కదా.. నీ ఏడాది పాలనలో పాస్ అయ్యావా? అసలు దేని గురించీ ప్రశ్నించే అర్హత నీకు లేదు. నీవు ప్రతిపక్ష నాయకుడివా? ప్రశ్నించే అర్హత నీకుందా?.. ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకో' అని జగన్‌పై సోము వీర్రాజు ఫైర్ అయ్యారు.

నేడు మావోయిస్టు అగ్రనేత సుధాకర్ అంత్యక్రియలు



సత్యవోలు గ్రామం చేరుకున్న మావోయిస్ట్ సుధాకర్ భౌతికకాయం

పెదపాడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు సుధాకర్(65) అంత్యక్రియలు ఏలూరు జిల్లా పెదపాడు మండ లం సత్యవోలు గ్రామంలో సోమవారం జరగనున్నాయి. ప్రభుత్వ అనుమతితో సుధాకర్ భౌతికకాయాన్ని ఆయన కుటుంబసభ్యులు ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత గ్రామానికి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సుధాకర్ అంత్యక్రియలు సత్యవోలులో జరగనుండటంతో బంధువులతో పాటు గ్రామ ప్రజల్లో ఆసక్తి నెలకొంది. అంత్యక్రియల్లో పలువురు ప్రజాసంఘాల నేతలు, సానుభూతిపరులు పాల్గొనే అవకాశం ఉంది.

మరణిస్తూ.. ఐదుగురికి కొత్త జీవితం

▸ బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాల సేకరణ

▸ ఎయిర్‌లిఫ్ట్ ద్వారా ఢిల్లీకి కిడ్నీ, కార్నియా తరలింపు

బెంగళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను సేకరించిన వైద్యులు, ఐదుగురికి ప్రాణదానం చేశారు. బెంగళూరు నుంచి ఢిల్లీకి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానం ద్వారా శనివారం కిడ్నీ, కార్నియాను తరలించినట్టు ఎయిర్ ఫోర్స్ అధికారి ఒకరు తెలిపారు. బెంగళూరులోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కమాండ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి బ్రెయిన్‌డెడ్ అయినట్టు డాక్టర్లు నిర్ధారించారు. బంధువుల అంగీకారంతో అతని అవయవాలను సేకరించి, ఐదుగురికి జీవితం ప్రసాదించారు. ఓ కిడ్నీ, కార్నియాను ఢిల్లీలోని మిలిటరీ ఆస్పత్రికి ఎయిర్‌లిఫ్ట్ ద్వారా తరలించారు. మరో మూత్రపిండం, కార్నియా, స్కిన్ కోయిలాను బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. బీజీఎస్ గ్లెనిగల్ ఆస్పత్రికి కాలేయాన్ని తరలించారు. జీవన సార్థకత కర్ణాటక సంస్థ సహకారంతో అవయవాలు అవసరమైన వారికి అందించే కార్యక్రమం పూర్తి చేశారు.



సేకరించిన అవయవాలను తరలిస్తున్న దృశ్యం

ఢిల్లీలో తొమ్మిదేళ్ల బాలికపై హత్యాచారం?

▸ తమ ఇంటికి సమీపంలోని బంధువుల దగ్గరకెళ్లి ఒంటరిగా తిరిగొస్తున్న చిన్నారిపై అఘాయిత్యం

▸ అదే ప్రాంతంలోని ఓ ఇంట్లో సూట్‌కేసులో లభ్యమైన మృతదేహం

న్యూఢిల్లీ, జూన్ 8: దేశ రాజధాని న్యూఢిల్లీలో ఘోరం జరిగింది. లైంగిక దాడికి గురై ప్రాణాలు కోల్పోయిన తొమ్మిదేళ్ల బాలిక.. తన ఇంటికి సమీపంలోని మరో ఇంట్లోని సూట్‌కేస్‌లో శవమై కనిపించింది. న్యూఢిల్లీలోని దయాల్‌పూర్ ప్రాంతంలో శనివారం రాత్రి వెలుగు చూసిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. దయాల్‌పూర్ ప్రాంతానికి చెందిన ఓ బాలిక తమ ఇంటికి సమీపంలో నివసించే బంధువులకు ఐసు ముక్కలు ఇచ్చేందుకు శనివారం సాయంత్రం ఏడు గంటలప్పుడు వెళ్లింది. అలా వెళ్లిన బాలిక ఎంతసేపటికి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు బాలిక కోసం గాలించడం మొదలుపెట్టారు. సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి బాలిక వెళ్లిందని తెలియడంతో దాని తాళం పగలుగొట్టి లోపలికి వెళ్లారు. ఆ ఇంట్లోని ఓ గదిలో రక్తం మరకలతో ఉన్న ఓ సూట్‌కేసు కనిపించడంతో దానిని తెరిచి చూడగా.. బాలిక కనిపించింది. రక్త గాయాలతో సూట్‌కేసులో అపస్మారక స్థితిలో బాలికను తండ్రి హుటాహుటిన సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించగా.. బాలిక అప్పటికే మరణించిందని వైద్యులు చెప్పారు. దీనిపై బాలిక తండ్రి ఇచ్చిన సమాచారంతో ఆస్పత్రికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇక, బాలిక మృతదేహం దొరికిన ఇంట్లోని వ్యక్తులు ప్రస్తుతం పరారీలో ఉండగా... వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రాంతాలు వేరైనా తెలుగుజాతి ఒక్కటే


దత్తాత్రేయ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కోవింద్, చంద్రబాబు, వెంకయ్య

(మొదటి పేజీ తరువాయి)

'నా ఆత్మకథ' పుస్తకాన్ని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు గవర్నర్లు, కేంద్ర మంత్రులు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు. చంద్రబాబు ప్రసంగిస్తూ.. తాను ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడు.. తెలుగు జాతిని ఏ విధంగా అగ్ర స్థానంలో నిలపాలా అని ఆలోచన చేశామని.. హైటెక్ సిటీతో హైదరాబాద్ అభివృద్ధికి నాంది పలికామని చెప్పారు. 'నాటి ప్రధాని వాజపేయితో హైటెక్ సిటీని ప్రారంభింపజేశాం. చెన్నారెడ్డి వద్ద స్థలం తీసుకుని శిల్పకళా వేదిక, శిల్పారామం రెంటినీ అభివృద్ధి చేశాం. అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ వచ్చిన సమయంలో జంట నగరాల అభివృద్ధితోపాటు కొత్తగా సైబరాబాద్ నిర్మాణానికి రూపకల్పన చేశాం. రాజకీయాల్లో మనం చేసిన మంచి పనులతో ప్రజలకు ఫలితాలు అందినప్పుడు దానికి వి ంచిన ఆనందం ఉండదు' అని వ్యాఖ్యానించారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లే బాధ్యత ప్రధాని మోదీ తీసుకున్నారని.. తెలుగుజాతిని ముందుకు తీసుకెళ్లే బాధ్యతను రెండు రాష్ట్రాల నేతలు తీసుకోవాలని సూచించారు. జెంటిల్మన్‌కు ప్రతిరూపం దత్తాత్రేయ అని కొనియాడారు. 'ఆయనది పేరుకు హిందుత్వం.. మతం భారతీయం. కోరుకున్నది జనహితం. అనుసరించేది లౌకికవాదం. పాటించేది మతసామరస్యం. తెలుగు రాష్ట్రాల్లో ఆయన అజాతశత్రువు. నేను ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజా సమస్యలపై ఎన్నో లేఖలు రాశారు. ఆయన లేఖలకు బ్రాండ్ అంబాసిడర్' అని సరదాగా వ్యాఖ్యానించారు. 'ఆత్మకథ ఆవిష్కరణకు రావడం చాలా సంతోషంగా ఉంది. మీ అందరినీ చూడగానే ఎక్కడలేని సంతోషం కలిగింది. 40 ఏళ్లనాటి రోజులు గుర్తొచ్చాయి' అన్నారు.

స్కూలు బీజేపీ.. కాలేజీ టీడీపీ.. ఉద్యోగం రాహుల్ దగ్గర!

గవర్నర్ దత్తాత్రేయ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి కుటుంబాలతో తనకు సన్నిహిత సంబంధాలున్నాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఢిల్లీలో నీతి ఆయోగ్ సమావేశం సందర్భంగా జరిగిన సరదా సంఘటనను వెల్లడించారు. 'నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీ ఏపీ సీఎం చంద్రబాబును చూపిస్తూ.. ఇదిగో మీ సహచర సీఎం ఇక్కడున్నారని సరదాగా అన్నారు. అప్పుడు నేను ఆయన దగ్గరకు వెళ్లి.. 'నా స్కూలు బీజేపీలో.. కాలేజీ చదువు టీడీపీలో.. ఇప్పుడు రాహుల్ దగ్గర ఉద్యోగం చేస్తున్నా' అని నవ్వుతూ చెప్పాను' అని తెలిపారు. జాతీయ రాజకీయాల్లో దివంగత నేత అటల్ బిహారీ వాజపేయికి ఉన్న గౌరవం.. రాష్ట్ర స్థాయిలో దత్తాత్రేయకు ఉందని చెప్పారు. పేదలు పాన్ డబ్బా పెట్టుకుంటే దాన్ని ప్రారంభించేందుకు కూడా దత్తాత్రేయ అందుబాటులో ఉండేవారన్నారు. హైటెక్‌సిటీ అంటే చంద్రబాబు గుర్తుకొస్తారని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. ఆయన వల్లే హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్ పెరిగిందన్నారు.

డైపర్లు మార్చినట్లు పార్టీలు మారుస్తున్నారు: వెంకయ్య

చిన్నపిల్లలకు డైపర్లు మార్చినట్లుగా ప్రస్తుత నాయకులు పదవుల కోసం పార్టీలు మార్చేస్తున్నారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఎప్పుడు ఎవరు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. రాజకీయాల్లో నీతి, నిజాయితీ ఎంత ముఖ్యమో.. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండడం కూడా అంతే ముఖ్యమని, దత్తాత్రేయ విలువలకు కట్టుబడిన వ్యక్తి అని తెలిపారు. దత్తాత్రేయ తన ప్రజా జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ అన్నారు. సామాన్యుడిని అత్యున్నత పదవిలో కూర్చుండబెట్టే గొప్పదనం మన రాజ్యాంగానికి ఉందని తెలిపారు. బీజేపీ కార్యకర్తలే తన ఆస్తి అని, వారి కృషి వల్లే తానీ స్థాయికి ఎదిగానని దత్తాత్రేయ చెప్పారు. తన కోసం ఎన్నో త్యాగాలు చేసిన సతీమణి వసంతకు ఎంతో రుణపడి ఉంటానన్నారు. ఆంధ్ర, తెలంగాణ, ఒడిసా, త్రిపుర గవర్నర్లు అబ్దుల్ నజీర్, జిష్ణుదేవ్‌వర్మ, కంభంపాటి హరిబాబు, ఇంద్రసేనారెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, శ్రీనివాస వర్మ, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఆ రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీలు కె.లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అదానీ మీటర్లపై 24 గంటల్లోగా నివేదిక ఇవ్వండి

క్షేత్రస్థాయిలో పనితీరును పరిశీలించండి

- డిస్కమ్‌లకు మంత్రి గొట్టిపాటి ఆదేశం
- బిల్లులు ఎక్కువగా వస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని అంగీకారం
- కెపాసిటర్లు మార్చుకోవాలని ఏపీసీపీడీఎల్ సలహా
- నేడు డిస్కమ్‌ల అత్యవసర సమావేశం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



అమరావతి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అదానీ స్మార్ట్ మీటర్ల పనితీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలించి 24 గంటల్లోగా నివేదికను సమర్పించాలని విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్)లను ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం 'స్మార్ట్ షాక్' శీర్షికతో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. అదానీ మీటర్ల పనితీరుపై క్షేత్రస్థాయి విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం నాటికి దీనిపై సమగ్ర నివేదికను సమర్పించాలని డిస్కమ్‌లను ఆదేశించారు. స్మార్ట్ మీటర్లతో బిల్లులు ఎక్కువగా వస్తున్నాయన్న విషయం తన దృష్టికి వచ్చిందని మంత్రి అంగీకరించారు. ఎవరికి కూడా అనవసరంగా ఒక్క రూపాయి కూడా భారం పడేందుకు వీల్లేదని గొట్టిపాటి స్పష్టం చేశారు. కాగా చార్జీలు ఎక్కువగా వస్తున్నాయని తన దృష్టికి వచ్చిందని మంత్రి అంగీకరించగా... ఏపీసీపీడీఎల్ వివరణ పేరిట విడుదల చేసిన ప్రకటనలో అదానీ మీటర్లను వెనకేసుకువస్తూ వితండవాదం చేసింది. అదానీ మీటర్లను బిగించాక వినియోగదారులు కెపాసిటర్లను మార్చుకోవాలంటూ ఉచిత సలహా ఇచ్చింది. అంటే.. కెపాసిటర్లను మార్చుకోకపోతే చార్జీల భారం తడిసి మోపెడవుతుందని పరోక్షంగా అంగీకరించింది. పవర్ ఫ్యాక్టర్‌ను సరిగా ఉంచుకోకపోవడం, కెపాసిటర్లను మార్చుకోనందునే విద్యుత్తు బిల్లులు పెరుగుతున్నాయంటూ డిస్కమ్ తన వివరణలో పేర్కొంది. అయితే కెపాసిటర్లను మార్చుకోవాలంటే ఒక్కో పరిశ్రమపై సగటున రూ.25,000 నుంచి లక్ష రూపాయల దాకా, గృహాలకు రూ.5000 నుంచి రూ.10,000 దాకా భారం పడుతుందని అంటున్నారు. అంతేగాక అదానీ మీటర్లు బిగించినందుకు గృహాల నుంచి నెలకు రూ.86 చొప్పున 92 నెలలు రూ.7,912, త్రీఫేజ్ వినియోగదారుల నుంచి నెలకు రూ.176 చొప్పున 92 నెలలు రూ.16,192 అదనంగా వసూలు చేస్తారు. అదానీ మీటర్ల పనితీరును సమీక్షించకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా జగన్ జమానాలో తీసుకున్న నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం యథాతథంగా అమలు చేయడం ఏమిటని ప్రజా సంఘాలు, నిపుణులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్థాయిలో అత్యున్నత సమీక్ష చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడు డిస్కమ్‌ల భేటీ

అదానీ మీటర్ల పనితీరుపై సమీక్షించేందుకు డిస్కమ్‌లు సోమవారం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. ప్రస్తుతం పారిశ్రామిక రంగానికే మీటర్లను బిగించాలన్న నిర్ణయం ఉన్నా.. అదానీ సంస్థ సిబ్బంది వెళ్లి మురికివాడల్లోనూ మీటర్లను బిగిస్తున్నట్లు తెలియడంతో డిస్కమ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మీటర్ల పనితీరు పరీక్షించకుండానే నేరుగా బిగించడాన్ని తప్పు పడుతున్నాయి. మీటర్లను బిగించే ముందు డిస్కమ్‌ల ఇంజనీరింగ్ అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించడంపై ఇంకా స్పష్టత ఇవ్వకముందే.. ప్రస్తుతం ఉన్న మీటర్ల స్థానంలో అదానీ మీటర్లను బిగించే ప్రక్రియను వేగవంతం చేయడంపై డిస్కమ్‌ల యాజమాన్యాలు మండిపడుతున్నాయి. అదానీ మీటర్లపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం ఇంధన శాఖను కదిలించిందని ఆ శాఖ అధికారులు అన్నారు.

డిస్కమ్‌ల ఇష్టారాజ్యం

మీటర్ల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల దాకా కొనుగోళ్లలో డిస్కమ్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. 2017లో రాష్ట్రంలో విద్యుత్తు చౌర్యాన్ని సమూలంగా నిర్మూలించేందుకు వీలుగా ఐఆర్‌డీ స్మార్ట్ వైబ్రేషన్ మీటర్లను కొనుగోలు చేస్తున్నామని అట్టహాసంగా ప్రకటించాయి. ఈ మీటర్ల వాడకంతో డిస్కమ్‌ల వారీగా ఎంతెంత కరెంటు వినియోగిస్తున్నారో తెలుస్తుందని వెల్లడించాయి. దీనివల్ల డిమాండ్‌ను బట్టి కరెంటు ఉత్పత్తి హెచ్చుతగ్గులు, బహిరంగ మార్కెట్లో కొనుగోళ్లపై దృష్టి పెడతామని పేర్కొన్నాయి. ఈ మీటర్లను బిగించే ప్రక్రియ పూర్తికాకుండానే అదానీ స్మార్ట్ విద్యుత్తు మీటర్లను తెరపైకి తెచ్చారు. ఇప్పుడు మళ్లీ 2017 నాటి ఐఆర్‌డీ మీటర్ల కథను సరికొత్తగా చెబుతున్నాయి.



గృహాలకూ అదానీ మీటర్లు

సాధారణంగా స్మార్ట్ మీటర్ల పనితీరును డిస్కమ్ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించాలి. మీటర్ రీడింగ్‌లో ఎలాంటి లోపాలూ లేవని ధ్రువీకరించాలి. కానీ ఇలాంటి ప్రక్రియ జరగకుండానే అదానీ సిబ్బంది నేరుగా పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, గృహాలకు వెళ్లి ఇష్టారాజ్యంగా బిగించేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డిస్కమ్‌లకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించేస్తున్నారు. సీపీడీసీఎల్‌కు చెందిన ముఖ్య అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ దీన్ని తప్పుపట్టారు.

టీచర్ల 'కౌన్సెలింగ్'పై కుదరని ఏకాభిప్రాయం

(మొదటి పేజీ తరువాయి)

ఏకాభిప్రాయం రాకపోవడంతో సోమవారం నుంచి ఉద్యమబాట పట్టాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నిర్ణయించింది. దీనిపై డైరెక్టర్‌కు ఆన్‌లైన్‌లో నోటీసు పంపింది. సోమవారం ఉదయం 10 గంటల నుంచి అన్ని డీఈవో కార్యాలయాల ఎదుట నిరాహార దీక్షలు చేయాలని, మంగళవారం మంగళగిరిలోని విద్యా భవన్‌ను ముట్టడించాలని పిలుపునిచ్చింది. ఈ కార్యాచరణను మంత్రి లోకేశ్‌కు కూడా మెయిల్ ద్వారా పంపారు.

స్లాట్ ఆన్‌లైన్ కౌన్సెలింగ్: పాఠశాల విద్యాశాఖ

సెకెండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలకు స్లాటెడ్ ఆన్‌లైన్ విధానం అమలుచేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఈ విధానంలో తొలుత ప్రభుత్వ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ మేనేజ్‌మెంట్ల పాఠశాలలకు ఆప్షన్లు ఓపెన్ చేస్తారు. ఆ తర్వాత జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో స్లాట్ల వారీగా టీచర్లకు ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఇస్తారు. ఉదాహరణకు జిల్లాలో సీనియారిటీ ఆధారంగా 1 నుంచి 500 మంది టీచర్లకు మొదట అవకాశం ఇస్తారు. వారికి అన్ని ఖాళీలూ కనిపిస్తాయి. 4 నుంచి 6గంటల సమయం ఇస్తారు. ఆప్షన్లు ఇచ్చిన తర్వాత బదిలీ ఆర్డర్లు జారీ అవుతాయి. మిగిలిన ఖాళీలతో ఆ తర్వాతి 500 మందికి ఆప్షన్లు ఓపెన్ చేస్తారు. ఇలా స్లాట్ల విధానంలో 1 నుంచి చివరి వరకూ ఆప్షన్లకు అవకాశం ఇచ్చి, ఎప్పటికప్పుడు బదిలీ ఆర్డర్లు ఇస్తారు. సాధారణంగా అయితే అందరికీ ఒకేసారి అవకాశం కల్పించి రెండు మూడు రోజుల సమయం ఇస్తారు. అందరూ ఆప్షన్లు పెట్టుకున్నాక సీనియారిటీ వారీగా ప్రాధాన్యతా క్రమంలో బదిలీ ఆర్డర్లు ఒకేసారి జనరేట్ చేస్తారు. ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ లోనే స్లాట్ల విధానం తీసుకొచ్చారు. దీనివల్ల అందరూ ఎక్కువ ఆప్షన్లు పెట్టుకోవాల్సిన అవసరం తప్పుతుందని అధికారులు చెబుతున్నారు.

నేడు షైనింగ్ స్టార్స్ అవార్డులు

- టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రదానం
- పార్వతీపురంలో పాల్గొననున్న విద్యామంత్రి లోకేశ్

అమరావతి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రోత్సహించడానికి షైనింగ్ స్టార్స్ అవార్డు-2025 పేరిట సత్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, పార్వతీపురంలో విద్యా మంత్రి లోకేశ్ పాల్గొంటారు. విద్యలో నాణ్యత, నైపుణ్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 4,168 మంది టెన్త్ విద్యార్థులకు, ప్రభుత్వ, ప్రైవేట్ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ, ఒకేషనల్ విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించిన 920 మంది ఇంటర్ విద్యార్థులను ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ, ఓసీ, పీహెచ్ విభాగాల నుంచి అవార్డు గ్రహీతలను ఎంపిక చేశారు. ప్రతి అవార్డు గ్రహీతను పతకం, రూ.20 వేల నగదు బహుమతి, సర్టిఫికెట్‌తో సత్కరించనున్నారు. కాగా, ఈ ఏడాది ఏప్రిల్ 15న రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచిన 52 మంది ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులను మంత్రి లోకేశ్ ఉండవల్లిలోని నివాసంలో సత్కరించారు.

నెల్లూరు జిల్లాలో వృద్ధురాలికి కరోనా

నెల్లూరు(వైద్యం), జూన్ 8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని వసంతోపులో మరో కరోనా కేసు నమోదైంది. ఆ ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలి(61)కి ఆదివారం కరోనా నిర్ధారణ అయింది. నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో ఆమెకు కరోనా పరీక్ష చేశారు. కరోనా లక్షణాలు చాలా తక్కువగా ఉండటంతో ఆమెను హోం ఐసొలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. దీంతో జిల్లాలో కరోనా కేసుల సంఖ్య 8కి చేరింది. ఈ నెల 5న జిల్లాలో 6 కరోనా కేసులు నమోదయ్యాయి. 6న మరో కేసు, తాజాగా 8న ఇంకో కేసు నమోదయ్యాయి. జిల్లాలో కరోనా కేసులు పెరుగుతుండటంతో అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య

- ప్రమాదకర ద్రావణం పోసిన ఆనవాళ్లు
- అనంతపురంలో ఘటన..



అనంతపురం క్రైం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరానికి చెందిన ఇంటర్ విద్యార్థిని దారుణ హత్యకు గురైంది. స్థానిక రామకృష్ణ కాలనీకి చెందిన లక్ష్మీపతి కుమార్తె తన్మయి(19) నగరంలోని వివేకానంద కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదివింది. సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 3వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. తల్లిదండ్రులు పలు ప్రాంతాల్లో గాలించినా జాడ తెలియలేదు. దీంతో 4న వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 7న కూడేరు మండలం గొట్కూరు సమీపంలో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి పక్కన గుర్తుతెలియని శవం ఉందని పశువుల కాపరులు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. తన్మయి తల్లిదండ్రులు.. అక్కడికి చేరుకుని, మృతదేహం తమ కుమార్తెదేనని గుర్తించారు. కాగా యాసిడ్ వంటి ప్రమాదకర ద్రావణాన్ని ఆమెపై పోసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. గుర్తించలేని విధంగా ముఖం పూర్తిగా కాలి, ఉబ్బిపోయి ఉండడంతోపాటు శరీరంపై కాలిన గుర్తులతోపాటు పలు చోట్ల బొబ్బలు ఉన్నాయి. దీంతో ఆమెను ఉద్దేశ పూర్వకంగానే దారుణంగా హింసించి చంపి ఉంటారని అనుమానిస్తున్నారు. తమ కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని, బాలు అనే యువకుడు గతంలో వేధించాడని తల్లిదండ్రులు మీడియాకు తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. స్వయి రాయదుర్గానికి చెందిన బాలు, అనంతపురం ఐదోరోడ్డులో ఉంటున్న నరేశ్, ఫెర్రర్‌నగర్‌కు దినేశ్‌తో స్నేహంగా ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు నరేశ్, బాలు అనే యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దినేశ్ కోసం గాలిస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజీలు, ఫోన్ కాల్ లిస్ట్ ఆధారంగా విచారణ చేస్తున్నారు.

ఎమ్మెల్యే మాగంటి కన్నుమూత

- ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

హైదరాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్(62) కన్నుమూశారు. ఈ నెల 5న మధ్యాహ్నం తీవ్ర గుండెపోటుతో గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చేరిన ఆయన.. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 5.45 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు. మాగంటి గోపీనాథ్‌కు భార్య, ముగ్గురు పిల్లలు వాత్సల్యనాథ్, అక్షర నాగ, దిశిర ఉన్నారు. ఆయన మృతి విషయం తెలిసి బీఆర్‌ఎస్ శ్రేణులు, అనుచరులు, మిత్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన భార్య శైలిమ, తనయుడు హిమాన్షు, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పలువురు పార్టీ నేతలు, అభిమానులు ఆస్పత్రికి చేరుకున్నారు. మాగంటి భౌతికకాయాన్ని ప్రత్యేక వాహనంలో మాదాపూర్ వసంత హైట్స్‌లోని స్వగృహానికి తీసుకెళ్లారు. మాగంటి గోపీనాథ్ చివరి చూపుకోసం నేతలు, ప్రముఖులు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి తరలివచ్చారు. మాగంటి భౌతికకాయానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణితోపాటు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నేతలు నివాళులు అర్పించారు. మహాప్రస్థానంలో ప్రభుత్వ లాంఛనాలతో మాగంటి అంత్యక్రియలు జరిగాయి. పోలీసులు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. చితికి గోపీనాథ్ కుమారుడు వాత్సల్యనాథ్ నిప్పంటించారు. అంతకుముందు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మాగంటి నివాసానికి చేరుకుని భౌతికకాయం వద్ద నివాళి అర్పించారు. ఈ సమయంలో కేసీఆర్ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. మాగంటి కుమారుడు వాత్సల్యనాథ్‌ను దగ్గరికి తీసుకొని ఓదార్చారు.


గోపీనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేసీఆర్, లోకేశ్, బ్రాహ్మణి, కేటీఆర్

బుల్లెట్ ర్యాలీతో ఆకట్టుకుని..

ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన 1983లోనే మాగంటి ఆ పార్టీలో చేరారు. క్రమంగా ఎన్టీఆర్ వ్యక్తిగత బృందంలో సభ్యుడిగా మారారు. 1984లో రాజకీయ సంక్షోభంతో ఎన్టీఆర్ ముఖ్యమంత్రి పదవి కోల్పోయిన సమయంలో, 1985 ఎన్నికల్లో భారీ విజయం సాధించి తిరిగి సీఎంగా పదవి చేపట్టినప్పుడు.. మాగంటి గోపీనాథ్ తీసిన బుల్లెట్ బైకుల ర్యాలీ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్ ప్రచారంలో భాగంగా ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు కూడా మాగంటి తన బృందంతో కలిసి పాల్గొన్నట్టు టీడీపీ నేతలు చెబుతుంటారు. ఉత్తరప్రదేశ్‌లో అప్పటి ప్రధాని వీపీ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన సభకు ఎన్టీఆర్ వాహనం ముందు బుల్లెట్ బైకులతో ర్యాలీగా వెళ్లడం అందరి దృష్టిని ఆకర్షించింది. అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి రాంచంద్రన్ తన వద్దకు మాగంటిని పిలిపించుకుని బుల్లెట్ ర్యాలీ చేసి చూపించాలని కోరారు. ఆ ర్యాలీ చూసి ప్రత్యేకంగా అభినందించారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రచార సమయంలోనూ ఎన్టీఆర్ ప్రచారరథం ముందు పసుపు చొక్కాలు/టీషర్టులు వేసుకొని మాగంటి బృందం రక్షణ వలయంగా ఉండేది.

ఎన్టీఆర్ అస్థికలను మోసి..

ఎన్టీఆర్ మరణం మాగంటిని తీవ్రంగా కలచివేసింది. నాడు అంతిమ సంస్కారాలు పూర్తయ్యాక ఎన్టీఆర్ అస్థికలు ఉన్న కుండను బంజారాహిల్స్ ఇంట్లో భద్రపరిచారు. ఆ కుండను మాగంటి గోపీనాథ్ స్వయంగా నెత్తిన పెట్టుకొని బయటికి తీసుకువచ్చి ఊరేగింపుగా వాహనంలో పెట్టారు. ఎన్టీఆర్ అస్థికలు ముట్టుకునే అవకాశం దక్కడం తాను ఎప్పటికీ మరవలేనని మాగంటి చెప్పేవారు. ఆ సమయంలో తీసిన ఫొటోలను ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ స్మరించుకునేవారు.



ముగిసిన కాకాణి కస్టడీ

- నెల్లూరు ఎస్సీ, ఎస్టీ కోర్టులో హాజరుపరచిన పోలీసులు



నెల్లూరు(క్రైం), జూన్ 8(ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ అక్రమ తవ్వకం-రవాణా కేసులో ఏ-4గా ఉన్న మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి మూడ్రోజుల పోలీసు కస్టడీ ఆదివారంతో ముగిసింది. కోర్టు అనుమతితో ఈ నెల 6న మధ్యాహ్నం 12 గంటలకు నెల్లూరు కేంద్ర కారాగారంలో ఆయన్ను జిల్లా పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కృష్ణపట్నం పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఆయన్ను నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘటమనేని శ్రీనివాసరావు విచారించారు. తొలిరోజు 2 గంటలకుపైగా, రెండో రోజు 5గంటలకు పైగా ప్రశ్నించారు. పోలీసు అధికారులు ఏమడిగినా.. 'నాకు తెలియదు.. నాకు సంబంధం లేదు.. మా లాయర్‌తో మాట్లాడుకోండి' అని ఆయన సమాధానామిచ్చారు. ఎలాగూ ఆయన జవాబులివ్వడం లేదని.. ఆదివారం పోలీసులు అసలు విచారించలేదని సమాచారం. మధ్యాహ్నం కృష్ణపట్నం పోలీసు స్టేషన్ నుంచి నెల్లూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టుకు కాకాణిని తీసుకెళ్లారు. అక్కడ న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. సాయంత్రం 6.10 గంటల సమయంలో నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. రెండ్రోజుల విచారణలో చెప్పిన సమాధానాలతో పోలీసులు ఫైల్ తయారు చేశారు. కాగా.. కాకాణి బెయిల్ పిటిషన్ సోమవారం కోర్టులో విచారణకు రానుంది.

అంతర్వేది రథానికి రూ.96లక్షల ఇన్సూరెన్సు

- దేవస్థానం ఖాతాలో జమ చేసిన అధికారులు

అంతర్వేది, జూన్ 8(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా పేరొందిన ప్రఖ్యాత అంతర్వేది పుణ్యక్షేత్రంలో దగ్ధమైన లక్ష్మీనరసింహస్వామివారి రథానికి ఇన్సూరెన్సు మంజూరైంది. ఈ విషయాన్ని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ ఆదివారం మీడియాకు తెలిపారు. 2020 సెప్టెంబరు 5 అర్ధరాత్రి ఇక్కడి పురాతన రథం దగ్ధమైన ఘటన రాష్ట్రంలో సంచలనం రేపిన విషయం తెలిసిందే. దీంతో దేవదాయశాఖ అధికారులు ఇన్సూరెన్సు కోసం యునైటెడ్ ఇన్సూరెన్సు కంపెనీకి 2021లో దరఖాస్తు చేశారు. కాకినాడ జిల్లా వినియోగదారుల కోర్టులో సీసీ దాఖలు చేయగా దేవస్థానానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఇన్సూరెన్సు కంపెనీ ఆ తీర్పును నిరాకరించింది. దీనిపై దేవస్థానం అధికారులు విజయవాడలోని రాష్ట్ర కన్స్యూమర్ కోర్టులో 2023లో అప్పీల్ చేశారు. సుమారు రూ.84లక్షలు మంజూరు కాగా కాలయాపన చేస్తూ ఇన్సూరెన్సు కంపెనీ పట్టించుకోలేదు. చివరికి విజయవాడ కోర్టులో వడ్డీతో సహా ఇన్సూరెన్సు కంపెనీ రూ.96,39,361 డీడీ రూపంలో దేవస్థానం అధికారులకు అందించినట్లు ఏసీ సత్యనారాయణ తెలిపారు. ఆ డీడీలను దేవస్థానం బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేశామన్నారు. కాగా, దగ్ధ తర్వాత రథం దహనమైన కేసులో ఇన్సూరెన్సు మంజూరు కాగా, రథం శకలాలు ఇంకా అంతర్వేది ఆలయ ప్రాంగణంలోనే ఉండడంపై భక్తులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.

మిర్చి మార్కెట్‌లో డ్రాగన్ ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకురావాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. అయితే, వాటిని వెనక్కి తీసుకొస్తే ఇక్కడి పోర్టుల్లో కస్టమ్స్ అధికారులు ఏదేశం నుంచి దిగుమతి చేసుకొంటున్నారని 80 శాతం దిగుమతి సుంకం విధించే అవకాశం ఉంది. దీంతో ఏపీ మిర్చిదారులు లబోదిబోమంటూ విజయవాడలోని ఉన్న కస్టమ్స్ కమిషనర్‌కు మొర పెట్టుకున్నారు.

గతంలో ఎన్నడూ లేదు!

ఏటా గుంటూరు మిర్చియార్డు నుంచి ఎక్స్‌పోర్టర్లు చైనాకు 2 లక్షల టన్నులకు పైగా మిర్చిని ఎగుమతి చేస్తుంటారు. ఈ సంవత్సరం అక్కడి దిగుమతిదారులు పెద్దమొత్తంలో ఆర్డర్లు పెట్టారు. మిర్చి ధర చాలా తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. క్వింటా రూ.9 వేల నుంచి రూ.13 వేలకు వెరైటీ బట్టి లభ్యమయ్యాయి. ఏ దశలోనూ మార్కెట్లో ధర పెరగలేదు. దీంతో ఈ సంవత్సరం దాదాపుగా 3 లక్షల టన్నుల ఆర్డర్లు వచ్చాయని ఇక్కడి వ్యాపారులు చెబుతున్నారు. అంతా సవ్యంగా జరిగిపోతుందనుకుంటున్న తరుణంలో మిర్చిలో పురుగుమందుల అవశేషాలున్నాయని, వాటిని తిరస్కరిస్తున్నట్టు చైనా కస్టమ్స్ శాఖ ఒక్కసారిగా బాంబు పేల్చింది. మరియా స్లర్ పాస్‌రిన్ 0.90 ఎంజీ/కేజీ, పైరిడబిన్ 0.53/కేజీ, బెంజోడజిపెన్ 0.20 ఎంజీ/కేజీ ఉన్నట్టు ల్యాబ్ రిపోర్టులో వచ్చిందని చైనా కస్టమ్స్ అధికారులు చెబుతున్నారు. కొన్ని కంటైనర్లలోని విఎర్రిలో థైమిన్ 0.52 ఎంజీ/కేజీ ఉన్నట్టు పేర్కొన్నారు. దీంతో చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చైనాలో భారత విదేశాంగ శాఖ ప్రతినిధులను కలిసి గోడు వెలిబుచ్చారు. అలానే స్పైసెస్ బోర్డు అధికారులకు నివేదించారు. దీంతో ఈ రెండు సంస్థల అధికారులు పలువురిని చర్చలు జరిపిస్తున్నారు.

ఇంపోర్టు డ్యూటీ మినహాయించాలి లేక!

సాధారణంగా కంటైనర్లు చైనాకు చేరుకోగానే అక్కడి దిగుమతిదారులు వాటిని వేర్‌హౌస్‌కు తరలిస్తారు. చైనా కస్టమ్స్ అధికారులు ఆయా వేర్‌హౌస్‌లకు వెళ్లి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపుతారు. 2-3 రోజుల్లో ఫలితాలు వస్తాయి. ఇదే విధానం పోర్టుల్లోనే నిర్వహించి కంటైనర్లను తిరస్కరిస్తే వాటిని వెనక్కి తెచ్చుకోవడానికి ఇబ్బంది ఉండదు. అయితే వేర్‌హౌస్‌లో దిగుమతి జరిగాక టెస్టులు చేసి తిరస్కరిస్తుండటంతో వాటిని తాజా కంటైనర్లలోనే లోడింగ్ చేసి వెనక్కి తీసుకురావాలి. ఈ క్రమంలో మిర్చి మొత్తం పాడైపోతుంది. ఇలా ఫ్రెష్ కంటైనర్లలో సరుకును తీసుకురావాలంటే ఆ దేశం నుంచి భారత్‌కు మిర్చిని వ్యాపారాలు దిగుమతి చేసుకొంటున్నారని కస్టమ్స్ శాఖ దిగుమతి సుంకం విధిస్తుంది. అసలే సరుకు తిరస్కరణకు గురై తీవ్రంగా నష్టపోయిన వ్యాపారి రవాణా చార్జీలు, దిగుమతి సుంకం చెల్లించాలంటే పూర్తిగా దివాలా తీయాల్సిందే. ఈ నేపథ్యంలో చైనా నుంచి తిరస్కరణకు గురైన సరుకును ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇక్కడి పోర్టుల్లో దిగుమతి చేసుకొనేలా అనుమతించాలని కస్టమ్స్ కమిషనర్‌ను ఎక్స్‌పోర్టర్లు విజ్ఞప్తి చేస్తూ లేఖ రాశారు. దీనిపై అధికారులు ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Veduruppavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.